ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం  fb.com/vaartha

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-2-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 16 పేజీలు: 8+16 వెల: 6.50



వస్త్ర ఎగుమతుల లక్ష్యం రూ. 9 లక్షల కోట్లు: పిఎం

హరీష్‌రావు పిఎ వంశీకృష్ణ అరెస్టు 3


# వచ్చేస్తోంది.. ఐపిఎల్-2025

## మార్చి 22 నుంచి మే 25 దాకా 65 రోజుల్లో 74 మ్యాచ్‌లు

### హైదరాబాద్‌లో ఏడు, వైజాగ్‌లో రెండు మ్యాచ్‌లు

### షెడ్యూలు విడుదల చేసిన ఐపిఎల్




**ముంబయి, ఫిబ్రవరి 16:** ఇండియన్‌ప్రీమియర్‌లీగ్ 2025 18వ ఎడిషన్ పూర్తిస్థాయి షెడ్యూలు విడుదలచేసారు. మార్చి 22నుంచి మే 25వరకూ ఐపిఎల్ 2025 సీజన్ క్రికెట్ అభిమానులను అలరిస్తోంది. మొత్తం74 మ్యాచ్‌లు 65 రోజులపాటుజరుగుతాయనిఐపిఎల్ కమిటీ ప్రకటించింది. తొలిమ్యాచ్ మార్చి 22న డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కత్తానైట్‌రైడర్, రాయల్‌ఛాలెంజర్స్ మధ్య ఈడెన్‌గార్డెన్స్‌లో ప్రారంభం అవుతుంది. అలాగేమార్చి 23న ఉప్పల్ వేదికగా హైదరాబాద్‌రాజస్థాన్‌జట్లమధ్య పోరు ఉంటుంది. విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్ మైదానానికి రెండు మ్యాచ్‌లు కేటాయిస్తూ ఐపిఎల్‌కమిటీ నిర్ణయించింది. మార్చి24న ఢిల్లీ, లక్నో, మార్చి 30న ఢిల్లీ హైదరాబాద్ జట్లమ్యాచ్‌లు ఈస్టేడియంలో జరుగుతాయి. కొత్తవేదికల్లోకూడా మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఐపిఎల్ 2025 సీజన్‌లో గతంలోవలే 10 వేదికల్లో జరుగుతాయి. అలాగే ఈసారి ఐపిఎల్‌మ్యాచ్‌లకు కొత్తవేదికలు కూడాఅనుమతించారు. అహ్మదాబాద్, ముంబయి, చెన్నై, బెంగళూరు, లక్నో, ముల్లన్‌పూర్, ఢిల్లీ, జైపూర్, కోల్‌కత్తా, హైదరాబాద్, గువాహతి, ధర్మశాలల్లో జరుగుతాయి. రాజస్థాన్ గువాహతిని రెండో హోంగ్రౌండ్‌గా ఎంపికచేసుకుంది. మార్చి 26, 30తేదీల్లో అక్కడ రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. రాజస్థాన్ జట్టు, కోల్‌కత్తానైట్‌రైడర్స్, చెన్నై సూపర్‌కింగ్స్‌లో మ్యాచ్‌లున్నాయి. పంజాబ్‌కింగ్స్ తన మూడు మ్యాచ్‌లను ధర్మశాలలో ఆడుతోంది. మిగిలిన హోంమ్యాయచ్‌లు పంజాబ్‌లోని ముల్లన్‌పూర్‌లో జరుగుతాయి. మార్చి 22వ తేదీ కోల్‌కత్తా, ఆర్సీబీ జట్లు కోల్‌కత్తాలో తొలిమ్యాచ్

>>2

# అధికారులు ఎసి గదులు వదలరా?

## అప్పట్లో నేతలకు దిశానిర్దేశం చేసేవారు..

### అలాంటి అధికారులు ఇప్పుడు ఏరీ?

### 'లైఫ్ ఆఫ్ ఏ కర్మయోగి' పుస్తకావిష్కరణలో సిఎం రేవంత్


ఆదివారం హైదరాబాద్‌లో 'లైఫ్ ఆఫ్ ఏ కర్మయోగి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధానప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి16:** అధికారులు ఎంత నిబద్ధత చూపితే పథకాలు అంత విజయవంతమవుతాయని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ నాయుడు రచించిన 'లైఫ్ ఆఫ్ ఏ కర్మయోగి-మెమోర్ ఆఫ్ ఏసివిల్ సర్వెంట్ పుస్తకావిష్కరణ కార్యక్రమంఆదివారం బేగంపేటలోని ఐఏఎస్ అధికారుల సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా, మండలి సభ్యుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఇప్పుడు సిఎంగా అనేక మంది అధికారులను చూస్తూ వస్తున్నానని తెలిపారు. అప్పట్లో అధికారులు ప్రజలమధ్యనే గడిపేవారని, ప్రజాసేవ దిశగా నాయకులకు ఆ అధికారులు దిశానిర్దేశం చేసేవారని

>>2

# కామన్ ఎంట్రన్స్ సీట్లు 100 శాతం తెలంగాణకే

## అనుమతి కోసం ప్రభుత్వానికి ఉన్నత విద్యా మండలి లేఖ

### ఆ తర్వాతే ఇఎపి సెట్ నోటిఫికేషన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఇకపై కామన్ ఎంట్రన్స్‌ల ద్వారా చేపట్టే ప్రవేశాలన్నీ తెలంగాణ విద్యార్థులతోనే భర్తీ చేయనున్నారు. ఏపీ విద్యార్థులు చేరాలంటే నేషనల్ ఇంటిగ్రిటీ కోటాలో చేరాల్సి ఉంటుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో.. ఇప్పటి వరకు తెలంగాణలోఉన్నత విద్యలో ప్రవేశాల కోసం వివిధ కామన్ ఎంట్రన్స్‌ల ద్వారా ప్రవేశాలను చేపడుతున్నారు. వాటిల్లో తెలంగాణ విద్యార్థులతోపాటు ఏపీ విద్యార్థులకి కూడా స్థానికులుగానే ప్రవేశాలకు అవకాశం కల్పించారు. రాష్ట్రాల పునర్విభజన చట్టంలో భాగంగా 10 సంవత్సరాల పాటు ఉమ్మడి అడ్మిషన్లకి అవకాశం కల్పించారు. అయితే ఇప్పుడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తి కావడంతో ఇకపై తెలంగాణలోని ఉన్నత విద్యలో ప్రవేశాలను పూర్తిస్థాయిలో తెలంగాణ వారికే ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఇంజనీరింగ్‌తోపాటు ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, లా కోర్సులతోపాటు ఇతర ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం కామన్ ఎంట్రన్స్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. వాటిల్లో ఇప్పటి వరకు ఏపీ వారిని కూడా స్థానికులుగా పరిగణించారు. అయితే ఇప్పుడు పదేళ్లు పూర్తికావడంతో ఇకపై ఏపీవారిని స్థానికేతరులుగానే భావించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఈ నేపథ్యంలో ఏపీ విద్యార్థులు తెలంగాణలో విద్యను కొనసాగించడం కోసం కామన్ ఎంట్రన్స్‌లలో పాల్గొంటే వారికి నేషనల్ ఇంటిగ్రిటీ పేరుతో 5 శాతం సీట్లను కేటాయించాలని ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తే.. ఇకపై రాష్ట్రంలోని ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం ఏపీ వారు కూడా ఇతర రాష్ట్రాల వారిగానే పాల్గొనే విద్యార్థులుగానే కొనసాగుతారు. అయితే అందుకు ప్రభుత్వం అనుమతిస్తూ ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నెల 20న ఈఏపీ సెట్-2025 నోటిఫికేషన్‌ను జారీ చేయాల్సి ఉన్నందున ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అధ్వర్యంలో స్థానికతపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. తన నివేదికలో ఇదే అంశాన్ని చేర్చినట్టు తెలిసింది. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ వంటి వాటిల్లో ఉన్న సీట్లలో 5 శాతం సీట్లను నేషనల్ ఇంటిగ్రిటీ పేరుతో ప్రస్తుతం కూడా ఇతర రాష్ట్రాల వారికి కేటాయిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాల కోటాలో చేర్చలేదు. ఇప్పుడు చేర్చాల్సి వస్తుంది. కాబట్టి ప్రభుత్వ అనుమతి కోసం నివేదికలో చేర్చారు. స్థానికతపై ప్రభుత్వ అనుమతి వచ్చిన తరువాతనే కామన్ ఎంట్రన్స్‌లకి నోటిఫికేషన్లను జారీ చేయనున్నారు. ఆయా నోటిఫికేషన్లలో ఇదే విషయాన్ని స్పష్టం చేయాల్సి ఉంటుంది. కాబట్టి ప్రభుత్వ అనుమతి తరువాతనే నోటిఫికేషన్లను జారీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# న్యూఢిల్లీ ఘటనతో యుపి, బీహార్, ఎంపి రైల్వే స్టేషన్లకు అలర్ట్

## రద్దీ క్రమబద్ధీకరణకు చర్యలు


18 మంది మృతికి కారణమైన న్యూఢిల్లీ రైల్వే స్టేషన్లో జరిగిన తొక్కిసలాట దృశ్యం -5లో

**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 16:** మహాకుంభ్‌మేళాకు వచ్చేభక్తుల తొక్కిసలాటతో 18 మంది మృతిచెందిన సంఘటనతో యూపిలోని మహాకుంభ్‌నగర్‌కు వచ్చే యాత్రీకుల భద్రతకు రైల్వేశాఖ పటిష్ట చర్యలుచేపట్టింది. మహాకుంభ్‌నగర్‌కు వచ్చే యాత్రీకుల వాహనాలను దూరప్రాంతాల్లోనే నిలిపివేస్తున్నారు. బలసాన్, బైర్వానా, సోబ్టియాగ్, దర్భంగాల సమీపంలో భారీరద్దీ ఏర్పడింది. 15 నిమిషాల జర్నీకి మూడుగంటలుపడుతోంది. మహాకుంభ్‌కు వచ్చే మధ్యప్రదేశ్ రేవా వాహనాలు ప్రయాగరాజ్‌కు వస్తున్నవి కూడా

>>2







కృష్ణవేణి నాటిచిత్రం, ఇప్పటి చిత్రం

# అలనాటి మేటి నటి కృష్ణవేణి కన్నుమూత

**హైదరాబాద్ (పంజగుట్ట), ఫిబ్రవరి 16 (ప్రభాతవార్త):** సినీ ఇండస్ట్రీలో విషాదంచోటు చేసుకుంది. సీనియర్ ఎన్టీఆర్‌ని ఇండస్ట్రీకి పరిచయం చేసిన నాటి మేటి కృష్ణవేణి నటి కన్నుమూశారు. వయసు రీత్య అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం ఉదయం ఫిలింనగర్‌లోని ఆమెనివాసంలో తుది శ్వాస విడిచారు. కృష్ణవేణి మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ఆమెకి నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చెందిన కృష్ణవేణి సినిమాలలోకి రాక ముందు రంగస్థల నటిగా చేశారు. 1936లో సతీఅనసూయ చిత్రంతో బాలనటిగా సినీ రంగప్రవేశం చేసిన కృష్ణవేణి ఆ తరువాత కథానాయకిగా తెలుగులో 15 చిత్రాలలో నటించారు.

>>2

# భారీ గోల్‌మాల్

## అమాయకులకు రూ.1700 కోట్ల టోకరా?

### ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ పేరిట మోసం

### ఇద్దరి అరెస్టు.. పరారీలో మరో ముగ్గురు


కంపెనీ ఎండి అమర్‌దీప్ (ఫైల్)

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో వైట్ కాలర్ నేరాలు ఆగడం లేదు. ఎన్ని చట్టాలు చేసినా, అడ్డగోలు ప్రకటనలపై పోలీసులు ప్రజల్లో ఎంత చైతన్యం తెచ్చినా మోసాలు చేస్తున్న వారు ఎక్కడా తగ్గడం లేదు. ప్రజలు కూడా లేనిదానికి ఆశపడుతూ ఉన్నది పోగొట్టుకుంటూ లబోదిబో మంటుండడం రోజువారి వ్యవహారంగా మారింది. ఇటువంటి భారీ మోసం సైబరాబాద్‌లోని మాదాపూ ర్‌లో వెలుగు చూసింది. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ పేరుతో జరిగిన భారీ గోల్‌మాల్ పథకం ద్వారా లక్షరాల 1700 కోట్ల రూపాయలను కేటుగాళ్లు కాజేయగా ఈ నేరానికి పాల్పడ్డ నేరగాళ్లు బిచాణా ఎత్తేసిన తరువాత బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కాగా బాధితుల ఫిర్యాదుపై సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం ఇద్దరిని అరెస్టు చేయగా మరో ఇద్దరు పారిపోయారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలావున్నా యి. మాదాపూర్‌లోని హైటెక్ సిటీ కేంద్రంగా 2021లో క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఓ కంపెనీ ప్రారంభ మయ్యింది. చిన్న తరహా పెట్టుబడు ల పేరుతో ఫోంజీ స్కీంను సదరు కంపెనీ మొదలు పెట్టింది. దీనినే ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ అని కూడా ప్రచారం చేశారు. ఇందుకోసం సదరు కంపెనీ ఏజెంట్లను నియమించుకుని బీద, మధ్య తరగతి ప్రజలు, చిరు వ్యాపా రులకు ఆకర్షణీయ పథకాల పేరిట వల విసిరింది. తక్కువ మొత్తంలో పెట్టుబడులు పెడితే తక్కువ స మయంలో ఎక్కువ లాభాలు వస్తాయని డిపాజిటర్లను నమ్మబలికారు. ఇందుకోసం మొబైల్ అప్లికేషన్‌ను కూడా ప్రారంభించి ఐదు వేల రూపాయల నుంచి లక్ష రూపాయల వరకు డిపాజిట్లు సేకరించారు. తమ సంస్థ షేర్ మార్కెటింగ్ రంగంలో అంతర్జాతీయ రంగంలో పేరు గడించిందని, ప్రపంచ వ్యాప్తంగా అనేక కంపెనీలలో తమ సంస్థ పెట్టుబడులు పెట్టి భారీగా లాభాలు గడిస్తోందని, ఇలా వచ్చిన లాభాల నుంచి మీకు వాటా ఇస్తామని క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతిని ధులు పెట్టుబడిదారులను నమ్మించారు. కేవలం 45 రోజుల నుంచి 180 రోజుల్లో 11 నుంచి 22 శాతం రిటర్న్స్ వస్తాయని చెప్పడంతో వందల

>>2

# మూడేళ్లలో 30వేల మందికి ఉద్యోగాలు

2



## తెలంగాణ యువత కోసం మంత్రి శ్రీధర్ బాబు చొరవ

### బిఎఫ్ఎస్ఐ స్కిల్లింగ్ పేరిట ప్రత్యేక కోర్సు.. యేటా 10వేల మంది బిటెక్, డిగ్రీ పట్టభద్రులకు శిక్షణ



ఒమన్‌లో ఆదివారం ఆదేశ విదేశాంగ మంత్రి సయ్యద్ బదర్ బిన్ హమద్ బిన్ హమూద్ అల్ బుసైదీతో భేటీ అయిన విదేశాంగ మంత్రి జైశంకర్

# కులగణనపై ప్రజల్లో అవగాహన కల్పించిన బిసి కమిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి16:** రాష్ట్రంలో గతంలో కులగణనలో పాల్గొనని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిన నేపథ్యంలో బిసి కమిషన్ సభ్యులు పలు ప్రాంతాల్లో కులగణనలో పాల్గొనేలా ప్రోత్స మించేందుకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. కులగణనలో పాల్గొనని వారికోసం ఆదివారం ప్రారంభమైన కులగణన ఈ నెల 28 వరకు కొనసాగనుంది. దీంతో తొలిరోజు బిసి కమిషన్ జంట నగరాల్లో వివిధ బస్తీల్లో పర్యటించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ ఆదివారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు పాత బస్తీ లోని చాంద్రాయణగుట్ట కుమ్మరిబస్తీలో ఇంటింటికీ వెళ్ళి కులగణన జరిగిందా? లేదా అనే సమాచారాన్ని సేకరించారు. ఇంతవరకు కులగణనలో పాల్గొనని వారు ఏ విధంగా నమోదు చేసుకోవాలో వివరించి చెప్పారు. సుమారు రెండు వందల కుటుంబాల వద్దకు వెళ్లి సమాచారం సేకరించగా అందులో 72 కుటుంబాల వారు తమ కులగణన వివరాలు సేకరించ లేదని చెప్పారు. వారి ఇంటి నెంబర్లు తదితర వివరాలను, బిసి సంక్షేమ, మున్సిపల్ వార్డ్ అధికారులు నోట్ చేసుకుని, నమోదుకు తదుపరి చర్యలు తీసుకోనున్నారు. బిసి కమిషన్ చైర్మన్‌తో పాటు బిసి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆశన్న, స్థానిక ప్రముఖులు చైర్మన్ వెంట ఉన్నారు. కాగా శాలివాహన నగర్, మలక్‌పేటలో బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయ ప్రకాష్, టిఎస్‌జిఓ కాలని, గచ్చిబౌలి లో సభ్యులు తిరుమలగిరి సురేందర్ ప్రజలకు అవగాహన కల్పిస్తూ పర్యటించారు.

# మాలి బంగారుగనిలో ప్రమాదం

## 48 మంది మృతి, మరికొందరికి గాయాలు

**బమాకో(మాలి),ఫిబ్రవరి 16:** పశ్చిమాఫ్రికాదేశం అయిన మాలిలో అక్రమంగా నిర్వహిస్తున్న బంగారుగని కూలిపోయి 48 మంది చనిపోయారు. మరికొందరు తీవ్రగాయాలపాలయినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఆఫ్రికాలో బంగారం ఉత్పత్తిచేసే ప్రధానదేశాలలో మాలి ఒకటి. ఇక్కడి గనులలో ఇలాంటి ప్రమాదాలు తరచుగానే జరుగుతాయి. సాయంత్రం ఆరుగంటలప్రాంతంలో గనికూలిపోవడంతో 48 మందిప్రాణాలు కోల్పోయారు. కేవలం నెలరోజుల వ్యవధిలోనే ఇది రెండోప్రమాదం. కెనిబా గోల్డ్‌మైనర్స్ అసోసియేషన్ మృతులసంఖ్య 48గా వెల్లడించింది. బాధితులకోసం అన్వేషణ కొనసాగుతోందని పర్యావరణ అధికారి తెలిపారు. గతంలో కూడా ఈ గనిని ఒక చైనా కంపెని నిర్వహించింది. మాలిప్రపంచంలోని అత్యంత పేద దేశాల్లో ఒకటి. ఇక్కడ అక్రమ మైనింగ్‌ను నియంత్రించడం అధికారులకు ఒకసవాల్. జనవరిలోకూడా దక్షిణమాలిలోని ఒక గనివద్ద కొండచరియలు విరిగిపడి కనీసం పదిమంది చనిపోయారు. మరికొందరు తప్పిపోయారు. వారిలో మహిళలే ఎక్కువమంది ఉన్నారు. దక్షిణాఫ్రికాలోకూడా మూసివేసిన గనులు చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్నారు. అత్యంత లోతైన గనుల్లో వందలాదిమంది చిక్కుకున్నారు. వాస్తవానికి ఈ గనుల్లో చిక్కుకున్నప్రజలను రక్షించడానికి పోలీసులు వాటికి అన్ని సామగ్రిసరఫరాను నిలిపివేసారు. జనవరి నివేదికప్రకారమే 78 మంది మృత దేహాలను వెలికితీసారు. 246 మందిని సురక్షితంగా తరలించారు. మాలిజనాభా 2మిలియన్లు అంటేపదిశాతంకంటే ఎక్కువ మందిమైనింగ్‌పైనే ఆధారపడ్డారు.

# బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్..

## ఆ రెండు పార్టీలు బొమ్మ బొరుసు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హన్మకొండ బ్యూరో, ఫిబ్రవరి 16.(ప్రభాత వార్త):** రాష్ట్రంలో బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ పరిపాలన ఉందని,రెండు బొమ్మ బొరుసు అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. టీచర్స్ ఏం ఎల్ సి ఎన్నికల ప్రచారం లో భాగంగా ఆదివారం హన్మకొండ జిల్లా కేంద్రంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ మూడు ఎమ్ ఎల్ సి స్థానాల్లో బీ జె పీ గెలుస్తుంది అన్నారు.తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన లక్షల కోట్ల నిధులు ,రుణాల వివరాలు వెల్లడించారు. మతి లేని వారి మాటల్లో నిజం లేదని ఇప్పటికైనా నిజం తెలుసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక తెలంగాణ కోసం రూ. 10 లక్షల కోట్లు ఖర్చు చేసిందన్నారు. మరో రూ. 10 లక్షల కోట్లు రుణాలరూపంలో ఇచ్చామన్నారు. రామగుండంలో రూ. 7వేల కోట్లతో యూరియా యూనిట్, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, జాతీయ రహదారుల కోసం రూ. 1.20 లక్షల కోట్లు, రూ. 80 వేల కోట్ల నిర్మాణం కొనసాగుతుందని, వరంగల్ స్మార్ట్ సిటీ పనులు, రామప్ప దేవాలయానికి రూ. 150 కోట్ల కేటాయింపు, యూనిస్కో గుర్తింపు, 40 రైల్వే స్టేషన్ల పునరుద్ధరణ, కొమురవెల్లి రైల్వే స్టేషన్, సమ్మక్క సారాలమ్మ దేవాలయ అభివృద్ధికి రూ. 1000 కోట్లు, ఎయిమ్స్ ఆసుపత్రికి నిర్మాణానికి రూ.1350 కోట్లు, హైదరాబాద్ నుంచి యాదగిరి గుట్ట వరకు ఎంఎంటీఎస్ కు పచ్చజెండా, ఎన్టీపీసీ 850 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, ఫ్లోటింగ్ యూనిట్, ఎరువులపై రూ. 60వేల కోట్ల సబ్సిడీ, కిసాన్ సన్మాన్ నిధి, గ్రామ పంచాయితీలకు రూ. 13వేల కోట్లు, ఇన్ కంట్యాక్స్ రూ. 12.75 లక్షల వరకు తగ్గింపు, జహీరాబాద్ లో ఇండస్ట్రియల్ పార్కు, ఐదు కేజీల ఉచిత బియ్యం కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు అని ఆయన లెక్కలతో సహా విలేఖరుల సమావేశంలో వివరించారు.

**2018లో బీఆర్ఎస్ చంకలు గుద్దుకున్నారు..**

తెలంగాణకు ఏం చేశారనే వారి నోళ్లను ఆధారాలతో సహా నిరూపించి మూయించారు. ప్రాగా టూల్స్, ఐడీపీఎల్, హెచ్ ఎంటీ, ఆల్విన్ లాంటి అనేక సంస్థలు మూతపడ్డాయన్నారు. బయ్యారం సంస్థ స్థాపించాలంటే లాభమా? నష్టమా? అనే సర్వే ప్రకారం ముందుకు వెళతామన్నారు. బయ్యారంపై కేంద్రం ప్రకటన చేయలేదన్నారు. తామే ఏర్పాటు చేస్తామని 2018లో కేసీఆర్, కేటీఆర్, హరీష్ లు చంకలు గుద్దుకున్నారని చెప్పారు. వాస్తవంగా ఆ సంస్థ రావాలనే తనకూ ఉందని, కానీ స్టీల్ లభ్యత ఉండదని తెలిసిన తరువాత ప్రజల డబ్బును నష్టం చేయలేమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలు ఉపాధ్యాయ, పట్టభద్రుల మూడు ఎన్నికల్లోనూ బీజేపీ పోటీ చేస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మూడుస్థానాల్లో బీజేపీకి సుహృద్భావ వాతావరణం కనిపిస్తుందని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పట్ల పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. బీజేపీకి ఈ ఎన్నికలు పూర్తి సానుకూల ఫలితాలను ఇవ్వబోతున్నాయని తెలిపారు. బీఆర్ ఎస్ పట్ల వ్యతిరేకతతో గతంలో ప్రజలు మార్పు కావాలని కోరుకున్నారు. ఆ మార్పు రేవంత్ రెడ్డి ఉపన్యాసాలు, రాహుల్ ప్రసంగాలతో మభ్యపెట్టడం వల్ల అధికారంలోకి వచ్చారు. కానీ ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక గ్యారంటీలు, హామీలు అమలు చేయడంలో, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో హస్తం పూర్తి వైఫల్యం చెందింది. రాష్ట్రంలో దయనీయ పరిస్థితిలో ఈ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బీజేపీ ఉపాధ్యాయులకు, పట్టభద్రుకు, ప్రజలకు అండగా ఉండాలనే మూడు స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. పట్టింపు, సానుభూతి, అండగా ఉండే శక్తి ఉందని అందుకే తాము పోటీలో ఉన్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

# అలనాటి మేటి నటి కృష్ణవేణి కన్నుమూత

>> కొన్ని తమిళ, కన్నడ భాషా చిత్రాలలో కూడా కథానాయకిగా నటించారు. 1949 తెలుగులో సినిమా చరిత్రలో మైలురాయి అయినటువంటి మన దేశం చిత్రాన్ని నిర్మించి అందులో తెలుగు తెరకు సీనియర్ ఎన్టీఆర్‌ని, యస్వీ రంగారావు, నేపథ్యగాయకునిగా ఘంటసాల వెంకటేశ్వరరావును పరిచయం చేశారు. ఆ తరువాత సినిమాలలో అనేక మంది గాయకులు నటులు, సంగీత దర్శకులను పరిచయం చేశారు. ఇక కృష్ణవేణి నటించిన సినిమాలలో సతీ అనసూయ ధ్రువ (1935), మోహినీ రుక్మాంగద (1937), కచ దేవయాని (1938), మళ్ళీ పెళ్ళి (1939), మహానంద (1939), జీవనజ్యోతి (1940), దక్షయజ్ఞం (1941), భీష్మ (1944), బ్రహ్మరథం (1947), మదాలస (1948), మన దేశం (1949), గొల్లభామ (1947), లక్ష్మమ్మ (1950) మంచి గుర్తింపు తెచ్చి పెట్టాయి. ఆమె అందించిన సేవలకు గాను తెలుగు సినిమా పరిశ్రమ 2004లో ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య అవార్డుతో సత్కరించింది. ఆమె మృతిపట్ల సినీ రాజకీయాలకు చెందిన ప్రముఖులు సంతాపం వెలుబుచ్చారు.

# ఎపి ఇష్టారాజ్యంగా నదీ జలాలను తరలిస్తుంటే చోద్యం చూస్తున్న రేవంత్ సర్కార్: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి16:** ఏపీ ఇష్టారాజ్యంగా కృష్ణా జలాలను తరలిస్తుంటే కాంగ్రెస్ చోద్యం చూస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. కృష్ణా జలాల నుంచి ఏపీ ఇప్పటికే 646 టీఎంసీలు వినియోగించిందని, నదీ జలాలను ఏపీ తన్నుకుపోతుంటే కాంగ్రెస్ చలనం లేకుండా ఉందని అన్నారు. ఏడాది కాలంలోనే కాంగ్రెస్ పంట పొలాలను ఎండబెట్టిందని ఆదివారం ఎక్స్ వేదికగా విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో న్యాయం కోసం ఏర్పడ్డ రాష్ట్రంలో.. ఒక్కొక్కటిగా అన్నింటినీ కాంగ్రెస్ గంగలో కలుపుతోందన్నారు. కేఆర్ఎంబీ పరిధిలోని త్రీమెన్ కమిటీ దిక్కులేదు, సాగర్, శ్రీశైలంలో నీళ్ల అడుగంటి పొలాలు ఎండుతున్నా నిమ్మకు నీరెత్తినట్టు కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ట్వీట్ చేశారు.

## వారం - వర్జ్యం

తేదీ : 17-02-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
పంచమి తె.4.54
చిత్త పూర్తి
వర్జ్యం : మ.1.32-3.20
దు.ము.12.53-1.39, 2) మ.3.12-3.58
శుభసమయం : ఉ.10.00-10.40
సా.7.00-8.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. తగాదాలకు దూరంగా వుండండి.

**వృషభం:** ఆరోగ్యం పట్ల శ్రద్ధ చాలా అవసరం. ఔషధ సేవనం ప్రయాణాలు.

**మిథునం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**కర్కాటకం:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కొంటారు.

**సింహం:** ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి.

**కన్య :** దూరపు బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. శుభవార్తలు.

**తుల :** కుటుంబసమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. ఉద్యోగాలలో స్థానచలనం.

**వృశ్చికం:** ఋణబాధలు తీరి ఊరట చెందుతారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**ధనుస్సు:** కొత్తమిత్రుల పరిచయాలు పెరుగుతాయి. పుణ్యక్షేత్రాల సందర్శనం.

**మకరం:** కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు. వస్తులాభం.

**కుంభం:** దూరప్రయాణాలు లాభిస్తాయి. విలువైన వస్తువుల కొనుగోలు.

**మీనం :** బంధువుల నుండి ముఖ్య విషయాలు తెలుసుకొంటారు. వస్త్రాలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వచ్చేస్తోంది.. ఐపిఎల్ -2025

>> ప్రారంభిస్తే 23వ తేదీ సన్‌రైజర్స్ హైదరాబాద్ రాజస్థాన్ రాయల్స్ జట్లుహైదరాబాద్‌లో తలపడ తాయి. 23వ తేదీ చెన్నై సూపర్‌కింగ్స్,ముంబయి ఇండియన్స్ మ్యాచ్ చెన్నైలోను, 24వ తేదీ ఢిల్లీ కేపిటల్స్ వర్సస్ లక్నో సూపర్‌జెయింట్స్ విశాఖలోను, 25వ తేదీ గుజరాత్ టైటాన్స్ పంజాబ్‌కింగ్స్ జట్లు అహ్మదాబాద్‌లోను పోటీపడతాయి. మార్చి 26వ తేదీ రాజస్థాన్ రాయల్స్ కోల్‌కత్తా నైట్‌రైడర్స్ గువాహ తిలోను, 27వ తేదీ సన్‌రైజర్స్ హైదరాబాద్, ఎల్ఎస్జీజట్లు హైదరాబాద్‌లోను, 28వ తేదీ సీఎస్కే, ఆర్సీబీ జట్లు చెన్నైలోను29వ తేదీ గుజరాత్ టైటాన్స్ ముంబయి ఇండియన్స్ జట్లు అహ్మదాబాద్‌లతోను, 30వ తేదీ ఢిల్లీకేపిటల్స్, సన్‌రైజర్స్ జట్లు విశాఖలోను అదేరోజు రాజస్థాన్ రాయల్స్,సీఎస్కే జట్లు గువాహతిలోను 31వ తేదీ ముంబయి ఇండియన్స్ కోల్‌కత్తా నైట్‌రైడర్స్ జట్లు ముంబయిలోను పోటీపడతాయి.

ఏప్రిల్ ఒకటవ తేదీ ఎల్ఎస్‌జీ జట్టు పంజాబ్‌కింగ్స్‌తో లక్నోలోను, రెండోతేదీ ఆర్సీబీ, గుజరాత్‌టైటాన్స్ జట్టు కోల్‌కత్తాలోను,4వ తేదీ లక్నో జట్టు ముంబయి ఇండియన్స్‌తో లక్నోలోను, ఐదో తేదీ సీఎస్కే, ఢిల్లీకేపిటల్స్ జట్లు చెన్నైలోను, ఐదోతేదీ పంజాబ్‌కింగ్స్ రాజస్థాన్ రాయల్స్ న్యూచండీఘర్‌లోను, ఏప్రిల్ ఆరోతేదీ సన్‌రైజర్స్ గుజరాత్ టైటాన్స్ హైదరాబాద్‌లోను, ఏడోతేదీ ముంబయి ఇండియన్స్, ఆర్సీబీ జట్లు ముంబయిలోను, 8వ తేదీ పంజాబ్‌కింగ్స్, సీఎస్కే జట్లు న్యూచండీఘర్‌లోనూ, తొమ్మిదో తేదీ గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్ అహ్మదాబాద్‌లోను, ఏప్రిల్ పదోతేదీ ఆర్సీబీ, ఢిల్లీ కేపిటల్స్ జట్లు బెంగళూరులోను తలపడతాయని ఐపిఎల్‌కమిటీ ప్రకటించింది. అలాగే ఏప్రిల్ 11వ తేదీ సీఎస్కే, కెకెఆర్ జట్లు చెన్నైలోను12వ తేదీ ఎల్ఎస్జీ గుజరాత్ టైటాన్స్ జట్లు లక్నోలోను, అదేరోజు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు హైదరాబాద్‌లోను తలపడతాయి. 13వ తేదీ రాజస్థాన్ రాయల్స్, ఆర్సీబీతో జైపూర్, 13వ తేదీనే ఢిల్లీకేపిటల్స్ ముంబయి ఇండియన్స్ జట్లు ఢిల్లీలోను, 14వ తేదీ ఎల్ఎస్జీ జట్టుసీస్కేతో లక్నోలోను తలపడతాయి. అలాగే 31వ తేదీ పంజాబ్‌కింగ్స్ కెకెఆర్ జట్టుతో న్యూఛండీఘర్, 16వ తేదీ ఢిల్లీకేపిటల్స రాజస్థాన్ రాయల్స్ ఢిల్లీలోను, 17వ తేదీ ముంబయి ఇండియన్స, సన్‌రైజర్స్ హైదరాబాద్ ముంబయిలోను 18వ తేదీ ఆర్సీబీజట్లు పంజాబ్ కింగ్స్‌తో బెంగలూరులోను, 19వ తేదీ గుజరాత్ టైటాన్స్ ఢిల్లీకేపిటల్స్ జట్టు అహ్మదాబాద్‌లోను తలపడతాయి. అదేరోజు రెండోమ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్, ఎల్ఎస్జీ జట్టుతోజైపూర్‌లోను, 20వ తేదీ పంజాబ్‌కింగ్స్, ఆర్సీబీజట్టు న్యూఛండీఘర్, 20వ తేదీ ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్‌కింగ్స్‌జట్టు ముంబయిలోను తలపడతాయి. అలాగే 21వ తేదీ కెకెఆర్ జట్టు గుజరాత్‌టైటాన్స్‌తో కోల్‌కత్తాలోను, 22వ తేదీ ఎల్ఎస్జీ జట్టు ఢిల్లీకేపిటల్స్‌తో లక్నోలోను, 23వ తేదీసన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ముంబయి ఇండియన్స్‌తో హైదరాబాద్‌లోను, 24వ తేదీ ఆర్సీబీజట్టు రాజస్థాన్ రాయల్స్‌తో బెంగళూరులోను తలపడతాయి. 25వ తేదీ సిఎస్కేజట్టు సన్‌రైజర్స్‌తో చెన్నైలోను, 26వ తేదీ కెకెఆర్‌జట్టు పంజాబ్‌కింగ్స్‌తో కోల్‌కత్తాలోను, 27వ తేదీ ముంబయి ఇండియన్స్ ఎల్ఎస్జీ జట్టుతో ముంబయిలోను, 27వ తదీనే ఢిల్లీకేపిటల్స్,ఆర్సీబీ ఢిల్లీలోను, 28వ తేదీ రాజస్థాన్ రాయల్స్, గుజరాత్‌టైటాన్స్ జట్టు జైపూర్‌లోను, 29వ తేదీ ఢిల్లీకేపిటల్స్, కెకెఆర్‌జట్టుతో ఢిల్లీలోను, 30వ తేదీ సీఎస్కే జట్టు పంజాబ్‌కింగ్స్‌తో చెన్నైలోను మ్యాచ్‌లు ఆడతాయని ఐపిఎల్ బోర్డుప్రకటించింది. ఇక మే ఒకటవ తేదీ రాజస్థాన్ రాయల్స్ ముంబయి ఇండియన్స్‌మధ్య జైపూర్‌లోను, 2వతేదీ గుజరాత్ టైటాన్స్ సన్‌రైజర్స్ జట్టుమధ్య అహ్మదాబాద్‌లోను, 3వ తేదీ ఆర్సీబీ జట్టు చెన్నై సూపర్‌కింగ్స్‌తో బెంగళూరులోను,4వ తేదీ కెకెఆర్‌జట్టు రాజస్థాన్‌రాయల్స్‌తో కోల్‌కత్తాలోను, అదేరోజు పంజాబ్‌కింగ్స్ ఎల్ఎస్జీజట్టు ధర్మశాలలోను, ఐదో తేదీ సన్‌రైజర్స్ ఢిల్లీకేపిటల్స్ జట్లు హైదరాబాద్‌లోను తలపడతాయి. ఇకమే ఆరవ తేదీ ముంబయి ఇండియన్స్ గుజరాత్ టైటాన్స్ జట్లమధ్య ముంబయిలోను, ఏడోతేదీ బుధవారం కెకెఆర్‌జట్టు సీఎస్కేజట్టుతో కోల్‌కత్తాలోను, 8వ తేదీ పంజాబ్‌కింగ్స్ ఢిల్లీకేపిటల్స్‌తో ధర్మశాలలోను, 9వ తేదీ ఎల్ఎస్జీజట్టు ఆర్సీబీజట్టుతో లక్నోలోను, 10వ తేదీ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కోల్‌కత్తా నైట్‌రైడర్స్‌తో హైదరాబాద్‌లోను తలపడతాయి. ఇక మే 11వ తేదీ ఢిల్లీకేపిటల్స్ వర్సెస్ గుజరాత్‌టైటాన్స్ ఢిల్లీలోను, 12వ తేదీ సీఎస్కేజట్లు రాజస్థాన్‌రాయల్స్‌తో చెన్నైలోను, 13వ తేదీ ఆర్సీబీజట్టు సన్‌రైజర్స్ బెంగళూరుతోను, 14వ తేదీ బుధవారం గుజరాత్‌టైటాన్స్ ఎల్ఎస్జీ జట్టతో అహ్మదాబాద్‌లోను 15వ తేదీ ముంబయి ఇండియన్స్ ఢిల్లీకేపిటల్స్‌జట్లు ముంబయిలోను, 16వ తేదీ రాజస్థాన్‌రాయల్స్, పంజాబ్‌కింగ్స్ జట్లు జైపూర్‌లోను పోటీపడతాయి. ఇక 17వ తేదీ ఆర్సీబీ కెకెఆర్‌జట్లు బెంగళూరులోను, 18వ తేదీ గుజరాత్ టైటాన్స్, సీఎస్కేజట్లు అహ్మదాబాద్‌లోను, అదేరోజు రాత్రి మ్యాచ్‌లో ఎల్ఎస్జీజట్టు సన్‌రైజర్స్‌తో లక్నోలోను తలపడతాయి.ఇక మే 20న క్వాలిఫయర్ వన్ మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు హైదరాబాద్‌లోను, 21వ తేదీ బుధవారం ఎలిమినేటర్ మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు హైదరాబాద్‌లోనే జరుగుతుంది. ఇక మే 23వ తేదీ క్వాలిఫయర్2 మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు కోల్‌కత్తాలోను, మే 25వ తేదీ ఫైనల్ మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు కోల్‌కత్తాలోనుజరుగుతాయని ఐపిఎల్‌కమిటీ ప్రకటించింది.

# మూడేళ్లలో 30వేల మందికి ఉద్యోగాలు

## తెలంగాణ యువత కోసం మంత్రి శ్రీధర్ బాబు చొరవ

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా బిటెక్ పట్టభద్రులకు ప్రారంభించిన బిఎఫ్ఎస్ఐ స్కిల్లింగ్ కోర్సుకు విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం నిర్వహ అర్హత పరీక్ష జరిగింది. వీరిలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ ఏడాది జూలై వరకు బ్యాంకింగ్ ఆపరేషన్స్, ఫైనాన్షియల్ మార్కెట్స్, ఇన్సూరెన్స్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, సాఫ్ట్ వేర్, ప్రోగ్రామింగ్, అప్లికేషన్ అండ్ డేటాబేస్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, సాఫ్ట్ స్కిల్స్ తదితర అంశాలపై యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో శిక్షణ ఇస్తారు. అనంతరం బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బిఎఫ్ ఎస్ఐ)కు సంబంధించిన హైదరాబాద్‌లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జిసిసి)లో ప్లేస్ మెంట్స్ కల్పిస్తారు. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య నెలకొన్న అంతరాన్ని తగ్గించి, తెలంగాణను నైపుణ్యం కలిగిన మానవ వనరులకు చిరునామాగా మార్చాలని సిఎం రేవంత్‌రెడ్డి సంకల్పించారు. అందులో భాగంగానే స్కిల్ వర్సిటీకి శ్రీకారం చుట్టారు. ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ అందుకు అనుగుణంగా కొత్తకోర్సులను యువతకు అందుబాటులోకి తెచ్చేందుకు మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. అనుకూలమైన వాతావరణం ఉండటం తో హైదరాబాద్‌లో జిసిసిలను ప్రారంభించేందుకు దిగ్గజ సంస్థలు ముందుకొస్తున్నాయి. ముఖ్యంగా బిఎఫ్ఎస్ఐ రంగంలో ఏర్పాటవుతున్న జిసిసిల సంఖ్య పెరుగుతోంది. వీటిల్లో తెలంగాణ యువతకు ఉద్యోగాలు దక్కేలా ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇప్పించాలని మంత్రి శ్రీధర్ బాబు సంకల్పించారు. బిఎఫ్ఎస్ఐ రంగంలో అనుభవమున్న దేశీయ, యూఎస్ఏ, సింగపూర్ నిపుణులు, జిసిసిల నిర్వాహకులను సంప్రదించారు. వారి సూచనలు సలహాలతో బిఎఫ్ఎస్ఐ - స్కిల్లింగ్ పేరిట ప్రత్యేక కోర్సును స్కిల్ యూనివర్సిటీలో అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా ఏటా 10వేల మందికి శిక్షణ ఇస్తారు. వీరిలో 5వేల మంది ఇంజినీరింగ్, మరో 5వేల మంది డిగ్రీ పట్టభద్రులుంటారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతరం బిఎఫ్ఎస్ఐ జిసిసిల్లో ఉద్యోగాలు ఇస్తారు. అంటే రానున్న మూడేళ్లలో 30వేల మంది తెలంగాణ యువతకు ఈ కోర్సు ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. గతేడాది సెప్టెంబర్‌లో మొదటి బ్యాచ్ ప్రారంభమయ్యింది. దీని నిర్వహణకయ్యే ఖర్చును ఎక్విప్, బిఎఫ్ఎస్ఐ కన్సార్షియం భరిస్తుంది. విద్యార్థులు స్వల్ప అడ్మిషన్ ఫీజు చెల్లిస్తే చాలు అన్నారు. సర్టిఫికేట్, ఇతర అడ్మినిస్ట్రేటివ్ అవసరాల కోసం అభ్యర్థుల నుంచి ఒక్కసారి రూ.5వేలు వసూలు చేస్తారు. ఇప్పటికే రెండు బ్యాచ్ లను విజయవంతంగా పూర్తి చేసినట్లు కోర్సు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం మూడో బ్యాచ్ కోసం అర్హత పరీక్షలను నిర్వహించారు. ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న పట్టభద్రులు స్కిల్స్ యూనివర్సిటీ వెబ్ సైట్‌ను తరచూ సందర్శించాలని కోరారు.



ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ్ త్రివేణి సంగమంలో ఆదివారం పుణ్యస్నానాలు చేసిన కేంద్ర మంత్రులు గడ్కరీ, ధర్మేంద్ర ప్రధాన్ దంపతులు

# అధికారులు ఎసి గదులు వదలరా?

>> వివరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎంత తిరిగితే అంత మంచిదన్నారు. కానీ, ఇప్పటి అధికారులు కొందరు క్షేత్ర స్థాయికి వెళ్లేందుకు సుముఖంగా లేరని, ఏసీ గదులు వీడేందుకు ఇష్టపడట్లేదని వ్యాఖ్యానించారు. నిబద్ధత కలిగిన అధికారులను గుర్తించి ప్రాధాన్యత ఇస్తున్నాం. పాలకులు ఎన్ని పాలసీలు చేసినా... అమలు చేసేది అధికారులే. క్షేత్ర స్థాయిలో బాగా పనిచేసిన వారిని ప్రజలూ గుర్తుంచుకుంటారు. మనకున్న జ్ఞానం,అధికారం పేదలకు ఉపయోపడాలి' అని సిఎం అన్నారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఎం.గోపాలకృష్ణనాయుడు రచించిన లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి పుస్తకంలో తాను సివిల్ సర్వెంట్‌గా ప్రజల కోసం ఏమేం చేశారో ఎలాంటి కష్టాలు ఎదుర్కొని,విజయాలు సాధించారో పొందుపరిచారని అన్నారు. ఆరు దశాబ్దాల తను అనుభవాన్ని నిక్షిప్తం చేయడం పెద్ద టాస్క్ అని పేర్కొన్నారు. ఏదైనా కొనవచ్చు కానీ, ఎక్స్‌పిరియన్స్‌ను కొనలేం, సివిల్ సర్వెంట్స్ అందరికీ ఈ పుస్తకం ఒక దిక్సూచీగా ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి ఈ పుస్తకాన్ని చదివి... గోపాలకృష్ణ లాగ ప్రజల బాగు కోసం పాటుపడాలని సూచించారు. అనాడు జవహర్‌లాల్ నెహ్రూ నుంచి నేటి నరేంద్ర మోడీ వరకు దేశంలో వేగంగా జరిగిన మార్పులకు ఆయన ప్రత్యక్ష సాక్షి అన్నారు. అధికారులు ప్రజాక్షేత్రంలో ఎంత తిరిగితే అంత మంచిది అని,ప్రజల అవసరాలు ఏంటో స్వయంగా తెలుసుకోవచ్చని అన్నారు. శంకరన్,శేషన్,మన్మోహన్‌సింగ్ లాంటి అధికారులను ప్రతిక్షణం అధికారులు గుర్తు చేసుకుంటూ ఉండాలన్నారు. నిబద్ధతతో పనిచేసిన గొప్ప అధికారి శంకరన్ అని, పారదర్శక ఎన్నికల నిర్వహణకు ఎంతో కృషి చేసిన గొప్ప వ్యక్తి శేషన్ అన్నారు. దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపిన వ్యక్తి మన్మోహన్‌సింగ్ అన్నారు. వారి అనుభవాల నుంచి సివిల్ సర్వెంట్స్ ఎంతో నేర్చుకోవాల్సి ఉందన్నారు. కొంత మంది కలెక్టర్లు ప్రజాక్షేత్రంలోకి వెళ్లకుండా ఏసీ గదులకు మాత్రమే పరిమితం అవుతున్నారని, ఏసీ రూముల్లోంచే బయటకు వెళ్లడం లేదని మండిపడ్డారు. కొందరు కొత్త ఐపిఎస్‌లు యునిఫామ్ వేసుకొని పోలీస్ స్టేషన్లకు వెళ్లి సివిల్ పంచాయతీలు చూసుకుంటున్నారని తప్పుపట్టారు. నిబద్ధత ఉన్న ఆఫీసర్లకు ఎక్కడ ఉన్నా పోస్టింగ్‌లు వస్తాయని చెప్పారు. ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా అవి అధికారుల ద్వారా మాత్రమే ప్రజలకు చేరుతాయని,అధికారులు ఏసీ గదులు వదిలి రాకపోతే అవి ఏ విధంగా వారికి అందుతాయని ప్రశ్నించారు. గతంలో ఐఎఎస్ అధికారులు నిత్యం ప్రజల్లో ఉండేవారని, గతంలో రాజకీయ నాయకులు అంశాలను ప్రస్తావిస్తే అందులోని లోతుపాతులు,లాభ నష్టాలను వివరించేవారని అన్నారు. ప్రజలను ఆనందింపజేసేందుకు నేతలు అనేక హామీలు ఇస్తుంటారని, కానీ ఆ హామీల సాధాసాధ్యాలు, లోటుపాట్లను వివరించి నేతలను సరైన దారిలో నడిపించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

కానీ ఈ రోజుల్లో ఎందుకో అది తగ్గి పోయిందని, అలాంటి అధికారులు కనిపించడం లేదని విచారం వ్యక్తం చేశారు. తప్పుచేయొద్దు అని చెప్పేవాళ్లకంటే మూడు తప్పులు చేద్దాం అని చెప్పేవారే ఎక్కువగా ఉన్నారని సరదాగా వ్యాఖ్యానించారు. రాజకీయ నిర్ణయాలపై నాయకులకు అధికారులు విశ్లేషణ చేసి చెప్పాలని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల కంటే ప్రజలు అధికారులను ఎక్కువ గుర్తించుకునేవారన్నారు. అధికారులు నిబద్ధతతో పని చేస్తేనే ప్రజలకు మంచి జరుగుతుందని ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి తెలియజేశారు. కొత్త అధికారులు సీనియర్లను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి,ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రామకృష్ణ నాయుడు మిత్రులు,బంధువులు, రిటైర్డ్ ఐఎఎస్,రిటైర్డ్ ఐపిఎస్ అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# రైల్వే స్టేషన్లకు అలర్ట్

>> 24గంటల సమయం పడుతోంది.ఇదిలా ఉంటే న్యూఢిల్లీ స్టేషన్‌లోజరిగిన తొక్కిసలాట ఘటనను దృష్టిలో ఉంచుకుని మధ్యప్రదేశ్, యూపీల్లోని ఇతర ప్రాంతాల రైల్వేస్టేషన్లను అప్రమత్తంచేసారు. దీనితో ఎప్పటికప్పుడుప్రయాణీకుల రద్దీని క్రమబద్దీకరించాలని అదనపు రైళ్లలో వారిని వెంటనే గమ్యస్థానాలకు పంపించేయాలని రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేసారు. ఈ తొక్కిసలాటను తగ్గించేందుకు న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌నుంచి మరో అదనపు ప్రత్యేకరైళ్లు నాలుగింటిని అప్పటికప్పుడు ఏర్పాటుచేసినట్లు రైల్వేశాఖప్రకటించింది. అనౌన్స్‌మెంట్ ఒకనెంబరు, ప్లాట్‌ఫామ్‌పై మరో నెంబరుతో ఉన్న రైళ్లు ఆగడం వల్లనే ప్రయాణీకులు గందరగోళానికి గురయ్యారు. రైల్వేశాఖ నిర్లక్ష్యం వల్లనే భారీ ప్రమాదం సంభవించిందని ఇప్పటికీ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే మహాకుంభమేళాసందర్భంగా పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించిన భక్తులసంఖ్య 50 కోట్లు దాటేసిందని యుపి ప్రభుత్వం ప్రకటించింది. జనవరి 13నుంచి ఫిబ్రవరి 26వరకూ సాగే ఈ ప్రపంచ ఆధ్యాత్మిక వేడుకలో ఎలాంటి పొరపాట్లు లేకుండాచూసేందుకు యూపి ప్రభుత్వం సర్వశక్తులను ఉపయోగిస్తోంది.

# భారీ గోల్‌మాల్

>> సంఖ్యలో బీద, మధ్యతరగతివారు, చిరు వ్యాపారులు ఈ సంస్థలో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారు. ఈ క్రమంలోనే ఈ సంస్థ దేశ వ్యాప్తంగా తమ కార్యకలాపాలను విస్తరించి వందల సంఖ్యలో ఏజెంట్లను నియమించుకుని 6979 మంది డిపాజిటర్ల నుంచి ఏకంగా రూ.1700 కోట్లను డిపాజిట్లుగా వసూలు చేసింది. ఇందులో కొందరు ఐదు లక్షల రూపాయల నుంచి పది లక్షల రూపాయల వరకు డిపాజిట్ చేయగా బీద, మధ్య తరగతి వారు ఐదు వేల రూపాయల నుంచి లక్ష రూపాయల వర కు పెట్టుబడి పెట్టారు. కాగా గత నెల 15వ తేదీన మాదాపూర్‌లోని క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బోర్డు తిప్పేసింది. రాత్రికి రాత్రి కార్యాలయం బోర్డు తొలగించడంతో పాటు ఉద్యోగులు పత్తా లేకుండా పోవడం, ఏజెంట్ల సెల్‌ఫోన్లు స్విచాఫ్ కావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసిన మాదాపూర్ పోలీసులు కేసు తీవ్రత దృష్ట్యా ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు. దీనిపై విచారించిన ఆర్థిక నేరాల విభాగం పోలీసులు ఈ సంస్థ ఉపాధ్యక్షు డు పవన్ కుమార్ ఓదెల, డైరక్టర్ కావ్య నల్లూరిని అరెస్టు చేశారు. కాగా ఈ కంపెనీలో కీలకంగా వుండి వసూళ్లలో ముఖ్య భూమిక వహించిన అమర్‌దీప్ కుమార్, ఆర్యన్ సింగ్, యుగందర్ పరారీలో వున్నారు. వీరి కోసం గాలింపు చేబట్టడంతో పాటు విదేశాలకు పారిపోకుండా లుకవుట్ నోటీసులు జారీ చేశారు. కాగా ఈ కేసును విచారించిన ఆర్థిక నేరాల విభాగం పోలీసులకు కొత్త విషయాలు వెలుగు చూశాయి. ఈ కంపెనీ పథకం ప్రకారం అమాయకులను మోసం చేసి రూ.1700 కోట్లను దోచుకుందని. అయితే కొందరు డిపాజిటర్ల ఒత్తిడి వల్ల ఇందులో 850 కోట్ల రూపాయలను తిరిగి చెల్లించగా మిగతా నగదును కంపెనీకి అనుబంధంగా ఏర్పాటైన 14 షెల్ కంపెనీల్లో మళ్లించినట్లు తేలింది. కాగా పరారీలో వున్న ముగ్గురు నిందితులు ఇప్పటికే దుబాయ్‌లో మకాం వేసినట్లు తేలడంతో ఆ దిశగా పోలీసులు విచారణ చేబట్టారు. పట్టుబడ్డ ఇద్దరి వద్ద నగదు కానీ స్థిర, చరాస్తులు కానీ ఏమీ లభ్యం కాలేదు. పరారీలో వున్న ముగ్గురు పట్టుబడితే కానీ బాధితులకు న్యాయం జరిగే అవకాశాలు లేవని పోలీసులు చెబుతున్నారు.

## హరీశ్‌రావు పిఎ వంశీకృష్ణ అరెస్ట్

**హైదరాబాద్ (పంజగుట్ట), ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పిఎ వంశీకృష్ణతోపాటు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ చేయడంతోపాటు బెదరింపులకు పాల్పడిన ఆరోపణలతో వంశీకృష్ణతో పాటు సంతోష్‌కుమార్, పరశురాములును అదుపులోకి తీసుకున్నారు. చక్రధర్‌కు బెదరింపు కాల్స్, మెసేజ్‌లు చేస్తూ డబ్బులు వసూలు చేశారని ముగ్గురు నిందితులపై ఆరోపణలు ఉన్నాయి. కేసులో ఏ1గా హరీశ్ రావు, ఏ2గా రాధాకృష్ణన్‌రావు ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో చక్రధర్‌గౌడ్ ఎలాంటి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా వంశీకృష్ణ, సంతోష్‌కుమార్, పరశురాములు కలిసి ఓ రైతు గుర్తింపుకార్డులతో సిమ్ కార్డు కొనుగోలు చేసి బెదరింపులకు గురిచేస్తున్నారని ఆరోపణలున్నాయి. అంతేగాక, గతంలో ఆరోగ్యశ్రీ శాఖలో పనిచేస్తూ అవినీతికి పాల్పడినట్లు హరీశ్‌రావు పిఎ వంశీకృష్ణపై ఆరోపణలున్నాయి. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్నారు. ఆరోగ్యశాఖ మంత్రిగా హరీశ్‌రావు ఉన్నప్పుడు ఆయన పేషీలో వంశీకృష్ణ పనిచేశారు. ఫోన్ ట్యాపింగ్, బెదరింపులపై చక్రధర్‌గౌడ్ గత యేడాది పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు తాజాగా, నిందితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 28వతేదీ వరకు ముగ్గురు నిందితులకు రిమాండ్ విధించారు.

## మీర్‌పేట మహిళ హత్యోదంతంలో నిందితుడి తల్లి, సోదరి, తమ్మునిపై కేసు

### నోటీసులు జారీ చేసిన పోలీసులు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** హత్య కేసుల్లో అత్యంత దారుణమైనదిగా పోలీసు రికార్డులకెక్కి సంచలనమై తెలుగు రాష్ట్రాల్లో కలకలం సృష్టించిన హైదరాబాద్ నగర శివార్లలోని మహిళ హత్య కేసులో నిందితుడైన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి పుట్టా గురుమూర్తి కుటుంబానికి చెందిన తల్లి, సోదరి, తమ్మునిపై పోలీసులు వేధింపుల కేసు నమోదుచేసి నోటీసులు జారీ చేశారు. గత నెల సంక్రాంతి పండుగ రోజుల్లో జిల్లెలగూడ వెంకటేశ్వరనగర్ కాలనీలో నివసిస్తున్న పుట్టా గురుమూర్తి తన భార్య వెంకటమాధవిని అత్యంత పాశవికంగా హత్య చేసి మృతదేహ అవశేషాలను స్థానిక జిల్లెలగూడ చందన చెరువులో వేసిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని విచారించిన మీర్‌పేట్ పోలీసులు రిమాండ్ చేశాక ఇటీవల మేజిస్ట్రేట్ అనుమతితో నాలుగు రోజులపాటు కస్టడీకి తీసుకొని మళ్లీ విచారణ చేసి తిరిగి జైలుకు తరలించారు. అయితే హతురాలు మాధవి పుట్టింటి వారు ఇచ్చిన ఫిర్యాదులో గురుమూర్తి తల్లి, సోదరి, తమ్ముడు కూడా వేధింపులకు గురి చేశారని పేర్కొనడంతో పోలీసులు ఆ దిశగా విచారణ జరిపారు. నిందితుడి తల్లి, సోదరి, తమ్మునిపై 498కు అనుబంధ సెక్షన్ 85 కింద గృహహింస/వేధింపుల కేసును నమోదు చేసివారికి మీర్‌పేట్ పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు.

# కొండలు గుట్టలు, అటవీమార్గాల్లో ప్రయాణం

### చివరకు బోర్డర్ దాటినా పోలీసుల అదుపులో నరకం

### అమృత్‌సర్‌కు వచ్చిన భారతీయుల అనుభవాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** ప్రమాదకరమైన రూట్లలో కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతాలు, సముద్రం వంటివి దాటుకుని అమెరికాలో ఎంతో కొంత ఉపాధి పొందుదామని వచ్చిన మరో 116 మంది భారతీయులతో వచ్చిన అమెరికా ఆర్మీ విమానం అమృత్‌సర్‌కు చేరుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రకటించిన అక్రమ వీసాదారుల అప్పగింత కార్యాచరణ మరింత వేగంగా జరుగుతోంది. ముందు మమ్మల్ని కొలంబియాకు తరలించారని, అక్కడ మూడున్నర నెలలపాటు ఉంచి ఆ తర్వాత పనామాకు నౌకలో తీసుకువెళ్లారని, అక్కడి నుంచి దట్టమైన కీకారణ్యాలను దాటుకుని వెళ్లామని అమెరికాకు వెళ్లడం కోసం ఆ మార్గంలో రోజుకు రెండు సార్లు నడవాల్సి వచ్చేదని అక్కడి నుంచి వచ్చిన భారతీయులు వెల్లడించారు. నవాన్‌కోట్, ఫిరోజ్‌పూర్ ఇతర ప్రాంతాలకు చెందినవారు కూడా ఈ విమానంలో భారత్‌కు చేరుకున్నారు. తమనుంచి బ్రోకర్ 45 లక్షలు తీసుకున్నాడని, అమెరికాకు పంపిస్తామని చెప్పి మలేసియాకు తీసుకెళ్లాడని, ఆ తర్వాత పదిరోజులు ముంబయి, ఆ తర్వాత ఆమ్‌స్టర్‌డామ్, పనామా, తపాచులా, ఆ తర్వాత మెక్సికో సిటీ, అక్కడినుంచి మూడు నాలుగురోజులు ప్రయాణించి అమెరికా సరిహద్దుల్లోకి వెళ్లామని ఈ ఇమ్మిగ్రెంట్లు అందరూ చెప్పారు. ఎలాగోలా సరిహద్దును దాటితే అక్కడ పోలీసులు తమను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారని, అక్కడి నుంచి ఒక శిబిరంలోకి మమ్మల్ని తరలించారని 18 రోజులపాటు అక్కడే ఉంచారన్నారు. ఎవ్వరూ మానుంచి వివరాలు తీసుకోలేదని, ఎవ్వరికీ మా విజ్ఞప్తులు పట్టలేదని మా చేతులు కాళ్లు కట్టివేసారని, మా ఫోన్లను సీజ్ చేసారని చెప్పిన భారతీయులు కేవలం విమానం ఎక్కుతున్న సమయంలోనే మమ్మల్ని భారత్‌కు వెనక్కి పంపించేస్తున్నట్లు చెప్పారన్నారు. మరికొందరిని అయితే బ్రెజిల్ నుంచి అటవీప్రాంతం గుండా తీసుకెళ్లారని, ఆ మార్గంలో మృతదేహాలే ఎక్కువ కనిపించినట్లు వారి అనుభవాలు వివరించారు. ఇలా అమెరికా నుంచి తిరిగివచ్చిన వారికి ఉపాధి కల్పించాలని వారి తల్లితండ్రులు కోరుకుంటున్నారు. రెండో విడతగా వచ్చిన వలసదారుల్లో 65 మంది పంజాబ్, 33 మంది హర్యానా, ఎనిమిది మంది గుజరాత్, యుపి నుంచి ఇద్దరు, గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్‌ల నుంచి ఇద్దరు చొప్పున ఉంటే హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకాశ్మీర్ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. వారిలో అత్యధిక శాతం 18 నుంచి 30 యేళ్లలోపువారే ఉన్నారు. ఈనెల 5వ తేదీ మొదటి విడతగా అమెరికా మిలిటరీ విమానం 104 మంది భారతీయులను అమృత్‌సర్‌కు తీసుకువచ్చింది. ఇక మూడో విమానం కూడా ఆదివారం 157 మందితో భారత్‌కు ఇదే అమృత్‌సర్ విమానాశ్రయానికి తీసుకువస్తున్నట్లు సమాచారం.



## కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా 18, 19న నిరసన కార్యక్రమాలు

### వామపక్షాల నిర్ణయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజల మౌలిక అవసరాలకు కేటాయింపులు తగ్గించి.. సంపన్నులకు రాయితీలు పెంచిందని వామపక్ష పార్టీలు విమర్శించాయి. దేశంలోని సామాన్యులకు ప్రధాని మోడీ బడ్జెట్‌లో తీరని అన్యాయం చేశారని వామపక్ష పార్టీల నేతలు విమర్శించారు. ఈ మేరకు వామపక్ష పార్టీల నేతలు జాన్‌వెస్లీ, సిపిఎం రాష్ట్రకార్యదర్శి. కూనంనేని సాంబశివ రావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, పోటు రంగారావు, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి, గాదగోని రవి, ఎంసిపిఐ(యు)రాష్ట్ర కార్యదర్శి, సాదినేని వెంకటేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జెవి చలపతిరావు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జానకిరాములు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి, సిహెచ్ మురహరి, ఎస్‌యుసిఐ(సి)రాష్ట్ర కార్యదర్శి, మామిండ్ల రమేష్‌రాజా, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి, బి సురేందర్‌రెడ్డి, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రసాదన్న, సిపిఐ(ఎంఎల్)రాష్ట్ర కార్యదర్శి నిర్ణయించారు. కేంద్ర ప్రతిపాదించిన బడ్జెట్‌కు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను రూపొందించి, వాటికి మద్దతుగా ప్రజలను సమీకరించాలని వామపక్షాలు నిర్ణయించాయి. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ అఖిలభారత వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా ఈ నెల 18, 19 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్రంలోని వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. దేశంలో 200 మంది శత కోటీశ్వరులపై 4శాతం సంపద పన్ను ప్రవేశపెట్టాలని, కార్పొరేట్ పన్ను పెంచాలని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు హామీ కల్పించాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. అలాగే బీమా రంగంలో 100శాతం ఎఫ్‌డిఐ ఉపసంహరించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటువారికి అప్పగించడం ఆపాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 50శాతం కేటాయింపులు పెంచాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్ల గౌరవ వేతనంలో కేంద్ర వాటాను పెంచాలని, రాష్ట్రాలకు నిధుల బదిలీ పెంచాలని, పెట్రోలియం ఉత్పత్తులపై సెస్సులు, సర్‌ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలతో పార్లమెంట్‌లో ఫైనాన్స్ బిల్లు ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ప్రధానిని అవమానపరిచే అంశం ఏమీ లేదు

### నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** మోడీ పుట్టకతో వెనుకబడిన తరగతులకు చెందినవారు కాదని లీగల్లీ కన్వర్టెడ్ బిసి అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారని, ఇందులో ప్రధానిని అవమానపరిచే అంశం ఏముందని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి ఒక ప్రకటనలో అనుమానం వ్యక్తం చేశారు. పుట్టుకతో ఆయన బిసి కాకపోవడం వల్ల బిసిల అణిచివేత, అవమానాలు ఆయనకు తెలియదని రేవంత్‌రెడ్డి ప్రస్తావించారని ఆయన వివరించారు. రేవంత్‌రెడ్డికి బిసి సమస్యలు బాగా తెలుసు కాబట్టి ఆయన సిఎంగా కులగణన చేశారని అన్నారు. మోడీ బిసి అయివుంటే బిసిలపై ప్రేమ ఉంటే దేశంలో కులగణన చేపట్టేవారని అన్నారు. బిసిలపై ప్రేమ ఉంటే జనగణనతోపాటు కులగణన చేయాలని అన్నారు.

## వస్త్ర ఎగుమతుల లక్ష్యం రూ.9 లక్షల కోట్లు

### భారత్ టెక్స్ సభలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** వస్త్రపరిశ్రమ ఎగుమతులు పెంచడమే లక్ష్యంగా కేంద్రం కార్యాచరణ అమలుచేస్తోందని, ఈరంగంలో వార్షిక ఎగుమతులను 2030 కంటే ముందే రూ.9 లక్షలకోట్ల లక్ష్యం సాధించగలమని ప్రధాని నరేంద్రమోడీ ధీమా వ్యక్తం చేసారు. రాజధానిలో ఈనెల 14నుంచి 17వరకూ జరుగుతున్న భారత్ టెక్స్ కార్యక్రమంలో ఆయన ఆదివారం పాల్గొని మాట్లాడారు. టెక్స్‌టైల్స్ రంగానికి బ్యాంకులు సహకారం అందించాలని దీనివల్ల ఉపాధి పెంచేందుకు సహకరించాలనికోరారు. ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఉన్న భారత్ గత ఏడాది ఏడుశాతం వృద్ధినమోదుచేసిందన్నారు. ప్రస్తుతం రూ.3 లక్షలకోట్లుగా వార్షిక ఎగుమతుల్ని 2030నాటికి రూ.9 లక్షలకోట్లకు పెంచడమే టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలిపారు. భారత్ టెక్స్ 2025లో 120కిపైగా దేశాలు పాల్గొంటున్నాయని ప్రధాని అన్నారు. భారత్ హైగ్రేడ్ కార్బన్ ఫైబర్ తయారీ దశలో ముందుకు సాగుతోందని వస్త్రరంగంలో నైపుణ్యం కలిగినప్రతిభావంతులను తయారుచేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక వస్త్రరంగంపై దృష్టిపెట్టామన్నారు. ప్రధాన పత్తిరకాల ఉత్పాదకతను పెంచేందుకు కేంద్రం రూ.500 కోట్లతో కాటన్‌మిషన్‌ను ప్రకటించింది. అంతేకాకుండా 2025-26 బడ్జెట్‌లో జౌళి మంత్రిత్వశాఖకు కేంద్ర బడ్జెట్‌లో రూ.5272 కోట్లు కేటాయించింది. గతార్థిక సంవత్సరంతోపోలిస్తే ఇది 19శాతం అధికం అని ప్రధాని వెల్లడించారు.



# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎవరు? ఎప్పుడు?

### అధ్యక్ష పదవిపై ఒక్కొక్కరిది ఒక్కోబాట

### పాత, కొత్త నేతల మధ్య యుద్ధం

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపికి కొత్త అధ్యక్షుడు ఎవరు? ఎప్పుడు నియామకం పూర్తవుతుందని ప్రస్తుతం పార్టీలో చర్చనీయాశంగా మారింది. రాష్ట్రంలో ఇప్పటికే జిల్లాల వారీగా అధ్యక్షులు ఎంపికలను పూర్తిచేశారు. కానీ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక పూర్తవ్వలేదు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఈ ప్రక్రియను పూర్తిచేస్తామని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్త అధ్యక్షుడు ఎంపికపై క్లారిటీ ఇప్పటి వరకు లేదు. గత కొంత కాలం వరకు మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ ఇస్తారని, దాదాపు ఖరారు అయినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఈ విషయంలో పార్టీ స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో అధ్యక్ష పదవి ఎంపిక ప్రక్రియ మొదటికి వచ్చినట్లు తెలిసింది. కొత్త అధ్యక్షుడి ఎంపిక విషయంలో పలువురు నేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంలో అధిష్టానం పునరాలోచన పడింది.

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అసెంబ్లీ ఎన్నికలతో పాటు పార్లమెంటు ఎన్నికలలో ఎక్కువ సీట్లు గెలచుకోవడం, ఓటు బ్యాంకు సైతం అనూహ్యంగా పెరగడంతో పార్టీ అధ్యక్ష పదవిపై పోటీ పెరిగింది. వచ్చే ప్రభుత్వం బిజెపి అన్నధీమాను నాయకులు వ్యక్తం చేస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే అధిష్టానం కసరత్తు సైతం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో గతంలో అధ్యక్ష ఎంపిక విషయంలో ఆచితూచి అడుగులు వేస్తుంది. సమర్ధవంతమైన నాయకుడిని ఎంపిక చేయాలని అధిష్టానం భావిస్తుంది. ఈ నేపథ్యంలో బిజెపి అధ్యక్ష స్థానానికి ఎన్నడూ లేని విధంగా పోటీ పెరిగింది. మరోవైపు పార్టీ అధ్యక్ష పదవిపై గత కొంత కాలంగా నేతలు ఒక్కొక్కరు ఒక్కోమాట మాట్లాడుతున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తాను రెండు బాధ్యతలు చేయలేనని అధ్యక్ష బాధ్యతలను కొత్తవారికి ఇవ్వాలని కోరిన సంగతి తెలిసింది. ఈ విషయం ప్రకటించి నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకు అధ్యక్ష ఎంపిక పూర్తికాలేదు. కసరత్తు కొనసాగుతూనే ఉంది. అయితే గతంలో కేంద్ర కేబినెట్ విస్తరణ సందర్భంగా పలువురు పదవులు ఆశించారు. అలా కేంద్ర మంత్రి పదవులు ఆశించి భంగపడిన వారు ప్రస్తుతం అధ్యక్షపీఠంవైపు దృష్టిసారించారు.

ప్రస్తుతం పార్టీలో కొత్త, పాత నేతల మధ్య అధ్యక్ష పదవి పంచాయతీ కొనసాగుతుంది. బిజెపిలో మొదటి నుంచి ఉన్న నేతలకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. అర్హత ఉన్నవారికి అవకాశం ఇవ్వాలని మరికొంత మంది కోరుతున్నారు. కానీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నది వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. మరోవైపు సామాజిక వర్గంపై కసరత్తు కొనసాగుతుంది. అధ్యక్షత పదవికి బిసి నేతకు ఇవ్వాలా? రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వాలా అన్న ప్రచారం సాగుతుంది. ప్రస్తుతం బిజెపిఎల్ నేత రెడ్డి సామాజిక వర్గం నేత ఉండడంతో బిసికి దక్కే అవకాశం ఉందని కొందరు అంటుండగా మరికొందరు రెడ్డికే దక్కుతుందని అంటున్నారు. ఈ క్రమంలో అధ్యక్ష పదవి విషయంలో అధిష్టానం ఆచితూచి అడుగులు వేస్తుంది. అధ్యక్ష ఎంపిక త్వరలోనే పూర్తవుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో ఆశవాహులు మరోసారి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

# జాతీయరహదారి 44పై కుంభమేళా వాహనాలతో రద్దీ

### రోల్మామడా టోల్‌ప్లాజా వద్ద భారీ సంఖ్యలో దక్షిణాది వాహనాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళాకు దక్షిణాది రాష్ట్రాల నుంచి వెళ్లే వాహనాలతో జాతీయ రహదారి 44 రద్దీగా మారింది. గుంటూరు, విజయవాడ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ నుంచి వచ్చే వాహనాలు గుడిహ్నాతూర్ వద్ద జాతీయ రహదారి 44కు అనుసంధానం అవుతున్నాయి. కొంతమంది పెరికేట్ వద్ద 44 జాతీయ రహదారిపైకి చేరుకుంటున్నారు. శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకు ఉండే 4,112 కి.మీ నిడివి కలిగిన ఈ రహదారిపై గత కొద్దిరోజులుగా వాహనాల సంఖ్య పెరిగిపోయింది. మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు ఇస్లాంనగర్ రోల్మామడా టోల్‌ప్లాజా వద్ద రోజుకంటే అత్యధికంగా 137 శాతం ప్రయాణికుల వాహనాలు దాటుతున్నాయి. 44 జాతీయరహదారిపై ప్రయాణికుల వాహనాల కంటే అత్యధికంగా సరుకులు సరఫరాచేసే వాహనాలు ప్రయాణి స్తుంటాయి. జనవరి 13 నుంచి కుంభమేళా ప్రారంభం కావడంతో కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి భక్తులతో వెళ్లే వాహ నాలు అత్యధికంగా వస్తున్నాయి. యాత్రికులు రోడ్డు నిడివితో ఆగి సేద తీర్చుకుంటున్నారు అటవీప్రాంతంలో ఖాళీ ప్రదేశాల్లో వంటలు చేసు కొంటున్నారు.



ఇందలావాయి, తూప్రాన్ టోల్‌గేట్లలో గతంకంటే 103 శాతం ప్రయాణికుల వాహనాలు వెళుతుండటంతో టోల్‌గేట్ల వద్ద రద్దీ నెలకొంటున్నది. కుంభమేళాకు వెళ్లే భక్తులు సొంత వాహనాలు, టూరిస్ట్ వాహనాల్లో వెళుతున్నారు. అనూహ్యంగా వాహనాల సంఖ్య పెరగడంతో టోల్‌గేట్ల వద్ద అధిక సంఖ్యలో సిబ్బంది విధుల్లో ఉంటూ వాహనాలను ఆలస్యం లేకుండా పంపిస్తున్నారు. ఇందల్వాయి, పిప్పల్‌ధరి టోల్‌గేట్ వద్ద రోజుకు సగటున 7,342 వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ రోజు 18వేలకుపైగా వాహనాలు వెళుతున్నట్లు నేషనల్‌హైవే అధికార వర్గాలు తెలిపాయి. వాహనాలు అత్యధికంగా ప్రయాణిస్తుండటంతో 44 ఎన్‌హెచ్‌పై తరుచుగా ట్రాఫిక్ అంతరాయాలు, అదేవిధంగా కొత్తగా ఈ ప్రాంతానికి వస్తున్న డ్రైవర్లు అత్యధికంగా ఉండటంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు హైవేపై ఉన్న హోటళ్లు, పెట్రోల్ బంకులు ఇతర వ్యాపారాలు కూడా భక్తుల కారణంగా టర్నోవర్ పెంచుకొంటున్నాయి. ఇంకా పదిరోజులు అంటే ఈ నెల 26 వరకు కుంభమేళా ఉంటుంది. ఈ వాహనాల రద్దీ తిరుగుప్రయాణికులతో మార్చి మొదటివారం వరకు ఉండే అవకాశం ఉంది.

## సంక్షేమ విద్యార్థుల ఫీజురీయింబర్స్‌కు మోక్షం

### బకాయిల చెల్లింపునకు ఆర్థిక శాఖ కసరత్తు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులకు సంబంధించి బకాయిలు ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను త్వరలో చెల్లించేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పరీక్షా ఫలితాలు విడుదల చేసే లోపు చెల్లించేందుకు ఆర్థిక శాఖ కసరత్తు చేస్తున్నట్లు తెలియవచ్చింది. ఇందులో భాగంగా ఇప్పటివరకు ఉన్న బకాయిలు, ఏ తరగతులకు ఎంతెంత ఇవ్వాల్సి ఉంటుంది, ఏ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ముందుగా చెల్లించాలి, అందుకు ఏ మేరకు నిధులు అవసరం ఉంటుందనే అంశాలపై వివరాలు సేకరిస్తోంది. గతేడాది బకాయిలు రావాల్సి ఉన్నదని, ఆ ఫీజు మొత్తాన్ని చెల్లించిన తర్వాతే సర్టిఫికెట్స్ ఇస్తామని ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు ప్రతిసారీ షరతులు పెడుతున్నాయి.

## సెంట్రల్ విజిలెన్స్, సిబిఐకి ఫిర్యాదులతో

# మిల్లర్లపై మళ్లీ రాష్ట్ర విజిలెన్స్ దృష్టి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** కస్టమ్ మిల్లింగ్ బియ్యం అక్రమాలపై సెంట్రల్ విజిలెన్స్,సిబిఐకి ఫిర్యాదులు వెల్లువెత్తుతండటం, రాష్ట్ర విజిలెన్స్ అధికారులు కూడా దాడులకు సన్నద్ధం అవతున్న నేపథ్యంలో అక్కమార్కులు మిల్లు యజమానాలు జంకుతున్నారు. రాష్ట్ర విజిలెన్స్ దాడులతోనే ముగుస్తుందా లేక కేంద్ర నిఘా సంస్థల విచారణను ఎదుర్కొనాల్సి వసుందా అని ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన కొంత మంది "విజిల్‌బ్లోయర్స్" సమాచార చట్టం ద్వారా సేకరించిన అంశాల ఆధారంగా కొద్దినెలల క్రితం కేంద్ర విజిలెన్స్ సంస్థకు నిజామాబాద్ జిల్లాలోని ఒక రైస్‌మిల్లును లక్ష్యంగా చేసుకొని జిల్లావ్యాప్తంగా ఉండే రైసుమిల్లర్లపై ఫిర్యాదు చేయడంతో ఆనిఘా సంస్థ రాష్ట్రంలోని అనేక రైసుమిల్లులపై దేగకన్నువేసి ఇన్నాళ్ల వారి చర్యలను కూలంకశంగా అధ్యయనం చేసినట్లు రాష్ట్రంలోని నిఘావర్గాలకు ఉప్పు అందడంతో ఇక వారికంటే ముందే కార్యక్షేత్రంలోకి దూకుతున్నట్లు తెలిసింది.అదే విధంగా మరో సంస్థ కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధికంగా బకాయిలు ఉన్నా మిల్లర్లపై సిబిఐ డైరెక్టర్ జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది.సిఎంఆర్ బియ్యం ప్రభుత్వంకు చెల్లించకుండా మిల్లర్లు ఎగ్గొట్టుతున్నారని వనపర్తి జిల్లా నుంచి మిల్లర్లపై కూడా చీఫ్ విజిలెన్స్ అధికారికి ఫిర్యాదు అందింది. దీనితో కేంద్ర నిఘా వర్గాలు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సిఎంఆర్ అక్రమదందాపై పూర్తిగా సమాచారం సేకరించడమే కాకుండా పౌరసరఫరాల అధికారులు మిల్లర్ల వద్ద బియ్యం లేకున్నా ఉన్నట్లు నివేదికలు ఇస్తున్నారని గుర్తించినట్లు తెలిసింది.2022-23 యాసంగి సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన వడ్లలో 35లక్షల టన్నుల్ని గత ఏడాది 12 లాట్లుగా ఇ-వేలం వేయగా అనేక మంది వ్యాపారులు వాటిని దక్కించుకున్నారు. రైసుమిల్లుల్లో ఉన్న ధాన్యాన్ని బిడ్డర్లకు ఇవ్వడంలో సమస్య ఎదురుకావడంతో 315 మిల్లులలోవిజిలెన్స్ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తనిఖీ చేయించారు. రికార్డులమేరకు రైసుమిల్లులలో ధాన్యం మిల్లర్ల వద్ద కనపవడలేదు. తడిసిన ధాన్యం సేకరించడం, మిల్లులలో స్థలలేకపోవడం తదుపరి సీజన్‌లో వచ్చే వడ్లను సర్దుబాటు చేసుకోవచ్చనే ధీమాతో అనేక మంది మిల్లర్లు ముందే ధాన్యం అమ్ముకొన్నారు. మంచిర్యాల, వరంగల్,నిజామాబాద్, పెద్దపల్లి,ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలలో 5.41లక్షలటన్నుల వడ్లు కనిపించలేదని రాష్ట్ర విజిలెన్స్ అధికారులు గుర్తించారు.మంచిర్యాల జిల్లాలో30వేల టన్నుల వడ్లు, వరంగల్‌లో 20వేల టన్నుల వడ్లు రైసుమిల్లర్లు మాయం చేశారని విజిలెన్స్ అధికారులు నివేదికలను బట్టి తెలిసింది. 2023 ఖరీఫ్‌లో 47.98లక్షల టన్నుల ధాన్యం రైతుల నుంచి సేకరించి ఇవ్వగా [illegible] 6500కోట్ల రూపాయల విలువగల బియ్యం రికవరీకి రైసుమిల్లర్లు ప్రభుత్వానికి చుక్కలు చూపారు. రూ.3500కోట్ల విలువగల బియ్యం జనవరి మూడోవారం వరకు రికవరి చేయగలిగారు. మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండలం మిరాసిపల్లి గుట్టల్లో ట్రేడర్ 2022-23 సంబంధించిన వానాకాలం యాసంగి సిఎంఆర్ ధాన్యం రూ.20కోట్ల విలువగలవి దాచి అడ్డంగా సివిల్‌సప్లయ్ విజిలెన్స్ అధికారులకు దొరికాడు.252162 బస్తాలకు గాను మిల్లులో 18375 బస్తాలు మాత్రమే ఉంచి వాటిని ధాన్యంగా తనిఖీకి వచ్చిన వారికి చూపెడుతూ మభ్యపెట్టాడు సదరు వ్యాపారి. సూర్యాపేట జిల్లాలోనే ఎనిమిది మంది మిల్లర్లు దాదాపు 515 కోట్లు బకాయి ఉండటంతో ఆయా మిల్లులపై యజమానులతోపేర్లతో సిబిఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సిబిఐ కి ఫిర్యాదు చేయడం వాళ్ళు కూడా రంగంలోకి దిగుతున్నారని వార్తలు వస్తుండటంతో సివిల్‌సప్లయ్‌శాఖలో ఇటు మిల్లర్లలో అలజడి మొదలైంది. ప్రభుత్వం ధాన్యం కేటాయించడానికి 2024 ఖరీఫ్ సీజన్‌లో సిఎంఆర్ సక్రమంగా చేసినవారికి చేయనివారిని విభజించింది. 10శాతం నుంచి 25శాతం బ్యాంకు గ్యారెంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ ఉంటేనే బియ్యం కేటాయింపులు చేయాలని నిర్ణయించినారు. అంతేకాదు డిఫాల్టర్లకు ధాన్యం కేటాయించకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది 67శాతం రికవరీ రేటు చొప్పున సిఎంఆర్ వసూలు చేయాలనే లక్ష్యంతో ఉండటంతో రైసుమిల్లర్లకు గడ్డుపరిస్థితి ఉంటుందని అంతా భావించారు. క్షేత్రస్థాయిలో అధికారులకు ఉండే అనుబంధాల కారణంగా బినామి పేర్లతో కొత్త మిల్లులను ఏర్పాటు చేసుకొని తిరిగి ధాన్యం కేటాయింపులు చేయించుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్రనిఘా సంస్థలు ఇప్పుడు తనిఖీ చేయడానికి వస్తే మిల్లర్లుమాత్రమే కాదు సివిల్ సప్లయ్ అధికారులు అడ్డంగా బలవుతారని భావిస్తున్నారు.

> గతంలో రాష్ట్రంలోని 315 మిల్లులను తనిఖీచేసిన విజిలెన్స్ అధికారులు
> మళ్లీ విజిలెన్స్‌దాడులు చేయబోతున్నారనే వార్తలకు జంకుతున్న రైసుమిల్లర్లు

## ఇండియా పోస్ట్ పేరిట సైబర్ నేరగాళ్ల కొత్తతరహా మోసాలు

### అడ్డగోలు మెసేజ్‌లను క్లిక్ చేయవద్దని సైబర్ నిపుణుల హెచ్చరిక

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు రూటుమార్చారు. ఇప్పటి వరకు అనేకరకాల మోసాలకు పాల్పడిన ఈ నేరగాళ్లు ఇప్పుడు పోస్టాఫీస్ విభాగంపై పడ్డారు. భారత్‌లో పోస్టాఫీస్ అధికారిక హోదా కలిగిన ఇండియా పోస్ట్ పేరును వాడుతూ ఎవరికిపడితే వారికి మెసేజ్‌లు పంపుతున్న సైబర్‌నేరగాళ్లు ఇందులో ఎవరైనా పోస్టాఫీస్ ఖాతాలు కలిగివుండి వాటిని తెరిస్తే క్షణాల వ్యవధిలో వారి ఖాతాల నుంచి నగదు కాజేస్తున్నారు. మొదట మెసేజ్‌లు పంపుతున్న నేరగాళ్లు వాటిని ఎవరైనా ఓపెన్ చేస్తే వెంటనే వారు ఓపెన్ చేసిన సైట్ నుంచి డివైజ్‌లోకి మాల్వేర్ ఇన్‌స్టాల్ చేస్తున్నారు. దీంతో క్షణాల వ్యవధిలో మెసేజ్‌లు తెరిచిన వారి ఖాతాల వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి అందుతున్నాయి. దీని తరువాత రెప్పపాటులో నేరగాళ్లు ఖాతాదారుల ఖాతాల నుంచి నగదును కాజేస్తున్నారు. ఈ తరహా మోసాలు ఇటీవల ఉత్తరాది రాష్ట్రా లో కొన్ని నమోదయ్యాయని, ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాల ప్రజలు వెంటనే అప్రమత్తం కావాలని సైబర్‌క్రైం పోలీసులతోపాటు సైబర్ నిపుణులు కోరుతున్నారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని వారు కోరారు. యుఆర్ఎల్‌లను తెరిచేముందు అవి అసలైనవా? నకిలీవా అని చెక్ చేసుకోవాలని వారు కోరారు. ఇండియా పోస్ట్‌కు సం బంధించి అధికారిక వెబ్‌సైట్‌నే ఉపయోగించాలని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలున్నా సంబంధిత అధికారులతో మాట్లాడాలని సైబర్‌క్రైం పోలీసులు కోరారు. ఇండియా పోస్ట్ తమ ఖాతాదారులను ఎప్పుడూ ఎలాంటి వివరాలు అడగదని పోలీసులు తెలిపారు. ఈ తరహా మోసపూరిత మెసేజ్‌లపై సైబర్‌క్రైం పోలీసులకు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని వారు కోరారు.

వార్త

విధి అంటూ ఎవరూ సృష్టించలేదు. మనకు మనమే సృష్టించుకున్నాం. మన మాట, ఆలోచన, ప్రవర్తన వల్ల మన జీవితానికి మనమే బాధ్యులం.

-డబ్ల్యు ఎమర్సన్

# మెట్టు దిగని ట్రంప్!


అధ్యక్షుడుగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్‌ట్రంప్ ప్రపంచదేశాలపై దూకుడు ప్రదర్శిస్తున్న సంగతి తెలిసిందే. తమ దేశ వాణిజ్య లోటును భర్తీచేసుకునేందుకు ఎడాపెడా సుంకాలు విధిస్తూ ప్రపంచదేశాలకు సమస్యలు తెచ్చిపెడుతున్నారు. మిత్రదేశం, వ్యూహాత్మక భాగస్వామ్య దేశం అని చెపుతున్న అమెరికా భారత్ విషయంలో కూడా తగ్గేదేమీ లేదని ట్రంప్ చెప్పేసారు. ఫ్రాన్స్‌లో తన పర్యటనను ముగించుకుని అమెరికాకు వెళ్లిన ప్రధాని ఒక్క ప్రతీకార పన్నుల విషయంలో తప్ప మరిన్నింటిపైనా సానుకూలంగానే వ్యవహరించారు. అమెరికా ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవడం ఖజానాను మరింత పరిపుష్టం చేసుకునేందుకు ఈ చర్యలు తప్పవని తెగేసి చెప్పేశారు. తొలి విడతగా చైనా, మెక్సికో, కెనడా, స్పెయిన్ వంటి దేశాలపై సుంకాలు విధించిన ట్రంప్ ఇతర దేశాలపైనా తప్పవన్నారు. అంతేకాకుండా డాలర్ కరెన్సీతో కాకుండా ఇతరత్రా కొత్త కరెన్సీలను తీసుకురావాలని భావిస్తే బ్రిక్స్‌దేశాలకు కష్టాలు తప్పవని మరీ హెచ్చరించారు. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్ ఇప్పుడు కీలక చెలామణి కరెన్సీగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈసంగతి అటుంచితే సుంకాల గురించే మనం చర్చించుకోవాలి. ఏ దేశమైనా విదేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై సుంకాలు పన్నుల రూపంలో వసూళ్లు సహజమే. అయితే మిత్రదేశమైనా మరేవాణిజ్య మిత్రదేశమైనాసరే ఆ దేశం తమఉత్పత్తులపై ఎంతమేర సుంకాలు విధిస్తుందో అంతేస్థాయిలో తమదేశానికి వచ్చే దిగుమతులపైనా సుంకాలు, పన్నులు విధిస్తుంటాయి. ఇది అనాదిగా వస్తున్న సాంప్రదాయమే. అమెరికా నుంచి ఎగుమతి అవుతున్న వస్తువుల బిల్లుతో పోలిస్తే అమెరికాకు వస్తున్న బిల్లు అధికంగా ఉంటున్నది. గత ఆర్థికసంవత్సరంలో భారత్‌తో అమెరికాకు వాణిజ్య లోటు 35.31బిలియన్ డాలర్లు అని ఈలోటును పూడ్చుకోవాలంటే పరస్పర పన్నువిధానం తప్పదన్న వాదనను తెరపైకి తెచ్చారు. అంతేకాకుండా మిత్ర దేశం అయినా మరేదేశమైనా సరే ఆదేశం తమ వస్తువులపై ఎంతశాతం మేర దిగుమతి సుంకాలు విధిస్తుంటే అంతేస్థాయిలో మేం కూడా ఆదేశం నుంచి వచ్చే వస్తువులపై సుంకాలువేస్తాం అందులో భారత్‌కు మినహాయింపు అంటూ ఏమీఉండదు అని మీడియా సమావేశంలోనే ట్రంప్ స్పష్టం చేసారు. భారత్ ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న ట్యారిఫ్ ల సగటురేటు 3.3శాతం అయితే అమెరికా ఉత్పత్తులపై మనదేశం విధిస్తున్న ట్యారిఫ్‌ల సగటురేటు 17శాతంగా ఉంది. అందువల్లనే ఇప్పుడు పరస్పర సుంకాలు తప్పవన్న వాదనతో ట్రంప్ ఆ దిశగా అడుగులు వేసారు. దేశీయ పరిశ్రమలను రక్షించుకోవాలన్న లక్ష్యంతో దిగుమతులపై అధిక సుంకాలు వేస్తే ఒక్కోసారి ఇలాంటి ధరలు కూడా పెంచుకోవాల్సిన అనివార్య పరిస్థితులు ఎదురవుతాయి. ట్రంప్ విధించే ఈ సుంకాల వల్ల ఔషధ తయారీ, ఎగుమతులు, రత్నాభరణాలు ఎగుమతులు, ఇనుము ఉక్కు, వాహనాలు, విద్యుత్ యంత్రపరికరాలు, జౌళిరంగం వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, ఆహార పదార్థాలపైనా ఎక్కువ ఉంటుంది. అంటే భారత్ నుంచి ఎగుమతి చేసే డెయిరీఉత్పత్తులు, పళ్లు తృణధాన్యాలు, నూనెగింజలు, కొవ్వులు, నూనెలు, పొగాకు ఉత్పత్తులు వంటి వాటిపై అమెరికా 150నుంచి 188శాతం వరకూ ఇప్పుడు సుంకాలు విధిస్తుంది. కాఫీ, టీ, సుగంధద్రవ్యాలు, చేపలు, మత్స్య ఉత్పత్తులు రసాయనాలపై 35 శాతం నుంచి 56శాతం వరకూ కూడా ఈ సుంకాలువిధిస్తుంది. ప్రతీకార సుంకాలులేదా పరస్పర సుంకాలపేరిట అమెరికా విధిస్తున్న సుంకాలతో ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య యుద్ధాలు మళ్లీ చెలరేగుతాయి. ఇప్పటికే చైనా ప్రతీకార సుంకాలను విధించింది. 25 శాతం వరకూ అమెరికా విధిస్తే అదే స్థాయిలో చైనా కూడా విధించింది. ఇక ఐరోపా దేశాలు కూడా ఇదే దారిలో వెళుతున్నాయి. యూరోపియన్ కమిషన్‌లో చర్చించిన తర్వాత నిర్ణయం ప్రకటిస్తామని, అమెరికాకు ధీటుగా తాముకూడా వ్యవహరించక తప్పదని స్పష్టంచేసాయి. దీంతో అమెరికా ఉత్పత్తులు ఐరోపా కూటమిలోని 27దేశాల్లో ఏదేశానికి వెళ్లినా అమెరికా ఎంతమేర సుంకాలు విధిస్తుందో యూరోల్లో అంతే సుంకాలు అమెరికా ఉత్పత్తులపై చెల్లించుకోవాల్సి ఉంటుంది. అమెరికా తన ఆర్థిక పరిపుష్టిని పెంచుకోవడం కోసం ఈ సుంకాలు విధిస్తున్నదని తెలుస్తోంది. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ నినాదంలో ఇదికూడా ఒక భాగమే. ట్రంప్ మొదటిసారి బాధ్యతలు స్వీకరించిన కాలంలోనే ప్రముఖ బైకర్ కంపెనీ హార్లే డేవిడ్‌సన్ ఈ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చినప్పటినుంచి ట్రంప్ మదిలో సుంకాలు కదలాడుతున్నాయి. ఎన్నికల ప్రచారం నుంచే తమ ఉత్పత్తులపై అధిక సుంకాలు వేసే దేశాలపై ప్రతీకార సుంకాలు తప్పవని హెచ్చరిస్తూ వచ్చారు. మిత్రదేశమైనా వ్యూహాత్మక మైత్రీదేశమైనా కూడా ఈ సుంకాలు ఆదేశాలు, పన్నులకు లోబడి ఉంటాయని వెల్లడించారు. ఈ ఒక్క అంశంలో మినహాయిస్తే భారత్‌కు ట్రంప్ అన్ని విధాలా సహకరిస్తామని బహిరంగంగానే చెప్పేసారు. ఇక అక్రమ వలసలపై భారత్ కూడా తన వైఖరిని స్పష్టం చేసింది. అక్రమ వలసదారులను మేమే వెనక్కి రప్పిస్తామని ప్రపంచవ్యాప్తంగా ఈ విధానం సరైనదేనని, దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానమేనని భారత్ కూడా ఏకీభవించడంతో సమస్యకు తెరపడింది. మొత్తం మీద ప్రధానిమోడీ అమెరికా పర్యటన ఒక్క సుంకాల పరంగా మినహాయిస్తే రక్షణ, వాణిజ్య, ఇంధన రంగాల్లో ఒప్పందాలతో సత్ఫలితాలిచ్చిందనే చెప్పుకోవచ్చు.

జీవితానికి అర్థం తెలుసుకుంటే మానసిక అశాంతి ఉండదు. కాంతి ప్రవేశిస్తే చీకటి నశించినట్లే.



మార్షల్

తమ తప్పులను కప్పిపుచ్చుకోవాలని ప్రయత్నించే వారే ఇతరులలో తప్పులను ఎత్తిచూపుతారు.



ఒవిడ్

# ప్రజావాక్కు



## రైల్వే శాఖ పనులు వేగవంతం కావాలి!

ఈ సంవత్సరం కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రంలో రైల్వే అభివృద్ధిపనులకు 9417 కోట్ల రూపాయలు కేటాయించారు. క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేస్తేనే మొత్తం నిధులనువినియోగించుకునే అవకాశంఉంది. లేకుంటే సహజంగా మన రైల్వే శాఖ పనులు నత్తనడకన సాగుతూ, ఒక సంవత్సరంలో పూర్తి చేయవలసిన పనులు నాలుగు సంవత్సరాలు తీసుకుంటారు. ఇటీవలి కాలంలో స్థానిక ప్రజా ప్రతినిధులు రైల్వేగుత్తేదారులనుంచి పర్సంటేజ్‌లు గుంజటంతో వాళ్లు కూడా పనులు చేపట్టడానికి జంకుతున్నారు. పనులువేగవంతంకావాలంటున్న ముఖ్యమంత్రి గారు, రైల్వేశాఖ పనులపై ప్రత్యేక దృష్టిసారించాలి. ప్రతి ప్రాజెక్టుకి స్థానిక ఎం.పి. నేతృత్వంలో ఒక సమన్వయ కమిటీ ఏర్పాటుచేసి పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలి.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

## రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న సంగారెడ్డి జిల్లా బొల్లారం పారిశ్రామికప్రాంతాల్లో ఎన్నోఫార్మా, ఇంజినీరింగ్ సంస్థలు ఉన్నాయి. ఈ సంస్థల్లో చాలామంది ఉత్తర భారత రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు పనిచేస్తూ కుటుంబాలతో జీవిస్తున్నారు. బాచుపల్లి నుంచి బొల్లారంకు వెళ్లే రోడ్డు నిత్యం భారీ వాహనాలు, రెడీమిక్స్ వాహనాలతో రద్దీగా ఉండటంతో రోడ్లు పూర్తిగా చెడిపోయినవి. రోడ్లు చెడిపోవడం వలన దుమ్ము, ధూళితో వాహనదారులు ప్రయాణించడం కష్టంగాఉంది. కావున అధికారులు ఇట్టి రోడ్డుకు మరమ్మత్తు చేసి ప్రజలను రోగాల బారిన పడకుండా కాపాడాలి.

-ఆళవందార్ వేణుమాధవ్, హైద్రాబాద్

## సమాజహితం అవసరం

కొన్ని వార్తా ఛానల్స్, కొన్ని ప్రధాన పత్రికలు సినిమా, నేర వార్తలు, రాజకీయాలకు ఎక్కువప్రాధాన్యత ఇస్తున్నాయి. సైన్స్, సాహిత్యం, విద్య, వినోదానికి సంబంధించిన కార్యక్రమాలు ప్రసారం చేయడం లేదు. అందువలన ప్రజలు మీడియాకు దూరం అయ్యే అవకాశం ఉంది. పత్రిక, ఛానల్స్ అధినేతలు రేటింగ్స్ కోసం కాకుండా, సమాజ హితం కొరకు కార్యక్రమాలు నిర్వహించాలి.

- పుట్లూరి రాంనర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

## నేరచరితులను నిషేధించాలి

క్రిమినల్ చరిత్ర కలిగినవారికి రాజకీయపార్టీలు ఎన్నికలద్వారా చట్ట సభలకు పంపడం వారిలో కొందరు మంత్రులు కావడం ఏమాత్రం ఆశ్చర్యం కలిగించని వాస్తవం. కోర్టులకీ విషయం తెలియందికాదు. నేర ప్రజాప్రతినిధుల చేతిలో లక్షల ఓట్లు ఉండటం, కోటీశ్వరులు కావడంతో భారతీయ జనతా పార్టీతో సహా అన్నిపార్టీల వారు వీరినే తమ ప్రతినిధులగా నిలబెడుతున్నారు. ఇది జగమెరిగిన సత్యం. ఇన్నేళ్లుగా నిద్రపోయిన సుప్రీం కోర్టు ఇప్పుడు మేల్కొని నేరస్తులుగా నిరూపింపబడిన వారిని ఎన్నికలలో పోటీ చేయకుండా శాశ్వత నిషేధం విధించాలని, దీనిమీద మూడువారాలలో అభిప్రాయాన్ని తెలుపమని కేంద్రానికి, ఎలక్షన్ కమిషన్‌కు ఆదేశాలను జారి చేసింది. నేరస్తులను లామేకర్సుగా చేస్తే ఏం ప్రయోజనం? లా బ్రేకర్సుగా మారిన సందర్భాలెన్నో మన ప్రజాస్వామ్యంలో చూశాం.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## స్కూల్ బ్యాగ్ మోత తగ్గించాలి

పిల్లలకు బరువుగా అనిపించే బ్యాక్‌ప్యాక్‌ను మోసుకెళ్లే సుపరిచితమైన దృశ్యం చాలా మంది తల్లిదండ్రులు, విద్యావేత్తలకు ఆందోళనకలిగిస్తుంది. పాఠ్యపుస్తకాలుపాఠశాలసామాగ్రి అభ్యాస ప్రక్రియలో అవసరమైన భాగం అయితే, భారీ సంచులు పిల్లల అభివృద్ధి చెందుతున్న శరీరానికి తీవ్రమైన ప్రమాదాలను కలిగిస్తాయి. బాల బాలికల విద్యాభ్యాసం లోపభూయిష్టమైన మన విద్యావిధానం వలన ఒత్తిడిమయంగా మారుతోంది. ప్రాథమిక దశ నుండే పిల్లలపై పెనుభారం మోపుతోంది. ఎల్ కె జి నుండి పదేసి కిలోల బరువును భుజాన్న వేసుకొని భారంగా స్కూలు వైపు అడుగులు వేసే ఆ అభం శుభం తెలియని చిన్నారులను చూస్తే ఎవరికైనా హృదయం ద్రవించక మానదు.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఉచితాలపై మదింపు ఏది?

నేడు మహారాష్ట్ర మొదలుకొని ఢిల్లీవరకు ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా మహిళలు విద్యార్థివిద్యార్థినీలు, గృహిణులు అనే తేడాలేకుండా ఉచిత మంచినీరు నుండి మొదలు పెట్టి ఉచిత ప్రయాణం వరకు అన్ని ఉచితాల పేరు మీదుగా అభివృద్ధి నమూనా తయారు అవ్వడం ఎంతమాత్రం సమంజసం కాదు. ఎందుకంటే అన్ని ఉచితాలే చేస్తే ప్రభుత్వ ఖజానా డొల్లపోయి అప్పుల కుప్పలుగా తయారు అవుతున్నాయి. ఇదిఆర్థిక వ్యవస్థ కుప్పకూలడానికి సామాజిక చిలికకు దారితీస్తుంది.

-భారత అవినాష్, జనగామ

# భారతీయుల బహిష్కరణ, సవాళ్లు

**అక్రమ వలసదారులపై అమెరికా ప్రభుత్వం తీసుకుంటున్న కఠినచర్యలు భారతీయ కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వారి జీవనోపాధి, పిల్లల విద్య, భవిష్యత్తు అనిశ్చితిలో పడుతున్నాయి. భారత ప్రభుత్వం అమెరికా అధికారులతో చర్చలు జరపాలి. బహిష్కరణలను తగ్గించేందుకు, భారతీయుల హక్కులను రక్షించేందుకు కృషి చేయాలి. బహిష్కరణల వల్ల భారతదేశంలో నిరుద్యోగిత, ఆర్థికభారం పెరగవచ్చు. అదేవిధంగా, అమెరికాలో భారతీయుల ప్రతిష్ఠకు కూడా దెబ్బతగలవచ్చు. ఈ పరిస్థితిలో భారత ప్రభుత్వం తన ప్రజల గౌరవాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలి. అమెరికా వంటి దేశాలతో వ్యూహాత్మక సంబంధాలు కొనసాగించడం ఒకవైపు అవసరం. అయినా, భారతీయుల హక్కులను, గౌరవాన్ని పరిరక్షించడం మరింత ప్రాధాన్యతనీయాల్సినాంశం. ఇతర దేశాల్లా గట్టిగా స్పందించి, అమెరికా నుండి సమాధానం కోరే ప్రయత్నంచేయాలి.**

అమెరికాలో అమర్ (పేరు మార్చబడింది) అనే భారతీయ అక్రమ వలసదారుని దినచర్య సాధారణంగా కనిపిస్తుంది. ఉదయం లేచి గ్యాస్ స్టేషన్‌కు నడిచి వెళ్లడం, రాత్రికి ఇంటికి తిరిగి వచ్చి కొంత టేక్‌అవే ఆహారంతినడం. కానీ దీని వెనుక అతను ఎప్పుడూ చట్టానికి దొరక్కుండా ఉండేందుకు తీసుకునే జాగ్రత్తలు, అనుభవించే భయం, ఎదుర్కొనే పరిమితులు చాలా ఉన్నాయి. అతను డ్రైవింగ్ లైసెన్స్ పొందలేడు, రిజిస్టర్డ్ ఉద్యోగం చేయలేడు, ఏ చిన్న పొరపాటు జరిగినా తనను పట్టుకొని బహిష్కరిస్తారన్న భయం అతనిలో ఉంటుంది. అది నిజానికి ఒక నిరంతరంగా దాక్కునే ప్రయాణమే. భారతదేశం నుండి చాలా మంది పత్రాలు లేని వలసదారులు అమెరికాలో ప్రవేశించేందుకు మధ్య మార్గాలను అనుసరిస్తారు. వీసా గడువు ముగిసినా ఉండిపోవడం. లేదా అక్రమ మార్గాల ద్వారా సరిహద్దులు దాటడం. ఈ ప్రమాదకర ప్రయాణానికి వారంతా భారీ మూల్యం చెల్లించాలి. అమెరికాలో పత్రాలు లేని వలసదారుల సమూహంలో భారతీయులు మూడవ స్థానంలో ఉన్నారు. తాజా పాలనలో ఇమ్మిగ్రేషన్ నియమాలు మరింత కఠినతరమవడంతో వారు మరింత ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇటీవల అమెరికా నుండి అనధికార వలసదారులైన భారతీయులను సంకెళ్లు వేసి, చేతులు, కాళ్లు కట్టివేసి బహిష్కరించడం తీవ్రంగా కలత కలిగించింది. ఈ వలసదారులు మెరుగైన జీవనం కోసం ప్రయత్నించారు. వారి పట్ల అనుసరించిన పద్ధతి మానవత్వంలేనిదిగా కనిపిస్తోంది. అక్రమంగా దేశంలో ప్రవేశించాలనుకోవడం తప్పే. అయినావారిపై ఇలా అమానుషంగా వ్యవహరించడం సమర్థనీయం కాదు. అమెరికాకు తన చట్టాలను అమలు చేసే హక్కుఉంది. ఈ తరహా చర్యలు మానవ హక్కులను ఉల్లంఘిస్తాయి. బహిష్కరణ ప్రక్రియలో గౌరవాన్ని కాపాడేలా చూడాల్సిన అవసరం ఉంది. కానీ, వీరిని నేరస్తుల్లా సంకెళ్లు వేయడం, నలభై గంటల పాటు కదలిక లేకుండా చేయడం, కనీస అవసరాలు కూడా అందించకపోవడం దయనీయ పరిస్థితిని సూచిస్తున్నాయి. ఈ విధానం చాలా దేశాల్లో వ్యతిరేకతను రేకెత్తించగా, భారతప్రభుత్వంమాత్రం దీనిపై గట్టి ప్రకటన చేయలేదు. గ్వాటెమాల, మెక్సికో, కొలంబియా వంటి దేశాలు తమ పౌరులపై ఇటువంటి అన్యాయాన్ని తీవ్రంగా ఖండించాయి. కానీ, భారత ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు నిరసన వ్యక్తం చేయలేదు. అమెరికా ప్రభుత్వం ఈ చర్యలను సమర్థించడానికి ప్రయత్నిస్తోంది. భారత ప్రభుత్వం తన పౌరుల గౌరవం కోసం ప్రశ్నించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అంతేకాక, భారత ప్రభుత్వం ఇటీవల అమెరికా నుండి దిగుమతులు చేసే కొన్ని ఉత్పత్తులపై సుంకాలు తగ్గించింది. ఇది సరైన సమయంలో తీసుకున్న నిర్ణయమా? భారతీయుల పట్ల అక్కడ అమానవీయంగా వ్యవహరించినప్పుడు, ఆ దేశానికి ఎలాంటి ఆర్థిక లాభాలు కలిగించే విధానాన్ని కొనసాగించడం సమంజసం కాదు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ ఉద్యమం కఠినమైన వలస విధానాలను ప్రోత్సహిస్తోంది. అమెరికా ఫస్ట్ అనే సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చింది. ట్రంప్ నాయకత్వంలో, అమెరికా పరిశ్రమలను రక్షించేందుకు విదేశీ ఉత్పత్తులపై సుంకాలు పెంచారు. అక్రమ వలసలను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకోవడం కొనసాగుతోంది. భారతీయుల పట్ల జాత్యహంకార ధోరణి పెరగడం మరింత ఆందోళన కలిగించే అంశం. అమెరికాలో భారతీయుల జనాభా గణనీయంగా పెరుగుతోంది. 2024 నాటికి, సుమారు 50లక్షల మంది భారతీయులు అమెరికాలో నివసిస్తున్నారు. అయితే, వీరిలో కొంతమంది అక్ర

ఎం.కె.కుమార్



మంగా నివసిస్తున్నారు. 2022 నాటికి, అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయుల సంఖ్య సుమారు 2,20,000గా ఉంది. అమెరికా ప్రభుత్వం అక్రమ వలసదారులపై కఠిన చర్యలు తీసుకుంటోంది. 2009 నుండి 2024 వరకు, మొత్తం 15,668 మంది భారతీయులను అమెరికా నుండి బహిష్కరించారు. ఇటీవల, అక్రమంగా నివసిస్తున్న 205 మంది భారతీయులను అమెరికా నుండి భారత్‌కు పంపించారు. అమెరికాలోని అక్రమ భారతీయ వలసదారుల సంఖ్య 2015లో 560,000 నుండి 2022 లో 220,000కి తగ్గింది. 2020 నుండి అక్రమంగా అత్యధిక సంఖ్యలో అక్రమ భారతీయ వలసదారులున్న రాష్ట్రాలు అత్యధిక సంఖ్యలో చట్టబద్ధమైన భారతీయ వలసదారులు ఉన్న రాష్ట్రాలకు సమానం. కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూజెర్సీ, న్యూయార్క్, ఇల్లినాయిస్ ఇందుకు ఉదాహరణ. కానీ ఒహియో, మిచిగాన్, న్యూజెర్సీ, పెన్సిల్వేనియాలలోని మొత్తం అనధికార జనాభాలో భారతీయులు 10శాతంకంటే ఎక్కువ మంది ఉన్నారు. టేనస్సీ, ఇండియానా, జార్జియా, విస్కాన్సిన్, కాలిఫోర్నియాలలోని మొత్తం భారతీయులలో నాలుగింట ఒక వంతు కంటే ఎక్కువ మంది అక్రమ భారతీయులున్నారు. నాలుగు కీలక రాష్ట్రాలైన మిచిగాన్, పెన్సిల్వేనియా, జార్జియా, విస్కాన్సిన్, మరో రెండు రెడ్ స్టేట్స్ అయిన టేనస్సీ, ఇండియానాలలో వారి జాతీయ వాటా కంటే అక్రమ భారతీయ వలసదారుల వాటా ఎక్కువగా ఉంది. ఇది రాజకీయ ప్రాముఖ్యతను కలిగించవచ్చు. ప్రవేశించే వారి సంఖ్య పెరిగినట్లు ఈ అధ్యయనం వెల్లడించింది. ట్రంప్ పాలనలో కఠిన వలస విధానాలు, గ్రీన్ కార్డు ఆమోద రేట్లు తగ్గడం, భారతదేశ ఆర్థిక అభివృద్ధి వంటి కారణాలు అక్రమ నివాసితుల తగ్గుదలకు దారితీశాయి. అయితే, మెక్సికో మార్గం నుండి కెనడా మార్గానికి మార్పు, పంజాబీ వలసదారుల పెరుగుదల, ఆశ్రయం దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరగడం తదితర అంశాలు కొత్త వలస ధోరణులను సూచిస్తున్నాయి. అమెరికా ప్రభుత్వం అక్రమ వలసదారులను నిర్బంధించి, అనంతరం స్వదేశాలకు పంపిస్తోంది. అయితే, "క్వాంటమా జైలు' వంటి ప్రత్యేక జైళ్ల గురించి ప్రామాణిక సమాచారం లేదు. ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకున్న భారతీయ వలసదారులలో పంజాబీ మాట్లాడేవారే అతిపెద్ద సమూహంగా ఉన్నారని వార్తలొచ్చాయి. 2001 నుండి 2022 మధ్య, భారత జాతీయులకు సంబంధించిన ఆశ్రయం కేసుల్లో మూడింట రెండు వంతులు (66శాతం) పంజాబీ మాట్లాడేవారే దాఖలు చేశారు. పంజాబీ తరువాత, భారతీయ ఆశ్రయం కోరే వారు మాట్లాడే ఇతర సాధారణభాషలు హిందీ (14శాతం), ఇంగ్లీష్ (8శాతం), గుజరాతీ (7శాతం) వున్నారు. పంజాబీ మాట్లాడేవారికి సంబంధించిన కేసులు కూడా ఆశ్రయం అభ్యర్థనలకు అత్యధిక ఆమోద రేట్లనుచూశాయి. 58శాతం హిందీ మాట్లాడేవారు, 25శాతం గుజరాతీ మాట్లాడేవారు ఆమోదం పొందగా, 63శాతంమందికి ఆశ్రయం మంజూరు చేయబడింది. ఈ పరిణామాలు అమెరికాలో నివసిస్తున్న భారతీయులపై ప్రభావం చూపుతున్నాయి. అక్రమంగా నివసిస్తున్నవారు తమ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు. భారత ప్రభుత్వం, అమెరికా ప్రభుత్వం కలిసి ఈ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలి. భారతీయులు ఉద్యోగ, విద్యా అవకాశాల కోసం అమెరికాకువలస వెళ్తున్నారు. అయితే, వీసా పరిమితులు, ఇమ్మిగ్రేషన్ నిబంధనల కఠినతరం కారణంగా కొంతమంది అక్రమంగా నివసించాల్సి వస్తోంది. అక్రమ వలసదారులపై అమెరికా ప్రభుత్వం తీసుకుంటున్న కఠినచర్యలు భారతీయ కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వారి జీవనోపాధి, పిల్లల విద్య, భవిష్యత్తు అనిశ్చితిలో పడుతున్నాయి. భారత ప్రభుత్వం అమెరికా అధికారులతో చర్చలు జరపాలి. బహిష్కరణలను తగ్గించేందుకు, భారతీయుల హక్కులను రక్షించేందుకు కృషి చేయాలి. బహిష్కరణల వల్ల భారతదేశంలో నిరుద్యోగిత, ఆర్థికభారం పెరగవచ్చు. అదేవిధంగా, అమెరికాలో భారతీయుల ప్రతిష్ఠకు కూడా దెబ్బతగలవచ్చు. ఈ పరిస్థితిలో భారత ప్రభుత్వం తన ప్రజల గౌరవాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలి. అమెరికా వంటి దేశాలతో వ్యూహాత్మక సంబంధాలు కొనసాగించడం ఒక వైపు అవసరం. అయినా, భారతీయుల హక్కులను, గౌరవాన్ని పరిరక్షించడం మరింత ప్రాధాన్యతనీయాల్సినాంశం. ఇతరదేశాల్లా గట్టిగా స్పందించి, అమెరికా నుండి సమాధానం కోరే ప్రయత్నంచేయాలి. •

# వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువభారతం!

భారతదేశ జనాభా నేడు 145 కోట్లు దాటింది. భారతీయుల సగటు వయస్సు 28.4 ఏళ్లు మాత్రమే ఉండడంతో మన దేశాన్ని యువ 'భారత్' అంటూ సగర్వంగా పిలుస్తున్నాం. దేశ జనాభాలో 14ఏళ్లలోపు జనాభా 24 శాతం, 25 ఏళ్ల లోపు జనాభా 50శాతం, 35 ఏళ్లలోపు జనాభా 65శాతం నమోదు అవుతున్నది. నేటి ఈ విచిత్ర పరిస్థితుల్లో ప్రపంచ యువత కేంద్రంగా భారత్ నిలుస్తున్నది. భారత్‌కు మాత్రమే సొంతమైన యువశక్తిని క్రమ పద్ధతిలో పెంచి పోషిస్తే రేపటి భారత భవిష్యత్తు ఉజ్వలంగా ఉండగలదని అంచనా వేస్తున్నారు. నేటి యువ భారతానికి నాణ్యమైన విద్య, సాంకేతిక నైపుణ్యాలు సమృద్ధిగా ఉన్న యువత తక్షణ అవసరంగా మారింది. మన యువతను సన్మార్గంలో నిలుపగలిగితే దేశ, విదేశాల్లో వారి అవసరం పెరిగి నిరుద్యోగం తగ్గడం, దేశం సమగ్రాభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు వేయడం సుసాధ్యం అవుతుందని మరిచిపోరాదు. కరోనా విపత్తు అనంతరం భారత ఆర్థిక గమనం మందగించడంతోపాటు ధనికుల సంపద పెరగడం, పేదలు నిరుపేదలుగా మారడం జరుగుతూ అసమానవతలు, ద్రవ్యోల్బణం క్రమంగా పెరుగుతున్నవేళ 2025 సంవత్సరమైనా మన ఆర్థిక అనారోగ్యాలకు సరైన ఔషధ చికిత్సలు అందించాలి. ప్రభుత్వాల నగదు బదిలీ సంక్షేమ పంపకాలు క్రమంగా పెరగడంతో పాటుమధ్య తరగతి, సంపన్న వర్గాలపై పన్నుల పోటు పెరగడం కూడా కొంత కలవం పెడుతున్నది. వేతనాలు తగ్గడం, ఉద్యోగ ఉపాధులు సన్నగిల్లడంతో పేదలు నలిగిపోతున్నారు. నేటి యువ భారతంలో ఉద్యోగ, ఉపాధుల కొరతతో యువశక్తి నిర్వీర్యం అవుతున్నదని, ప్రైవేటు రంగాలకు అందించే ఆర్థికవెసులుబాటు సబ్సిడీలను ఉద్యోగ ఉపాధుల కల్పనకు లింక్ చేయడం ఒక మంచి ప్రయత్నం అవుతుంది. కార్మిక వర్గ వేతనాలు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెరగకపోవడం, ధనిక మధ్య తరగతి వర్గాలు 30శాతం వరకు పన్నులు చెల్లించవలసి రావడం ప్రధాన సమస్యలుగా గుర్తించారు. ఉత్పత్తి ఆధార సబ్సిడీల కల్పన సరైన పద్ధతిలో సాగితే మాన్యుఫాక్చరింగ్ రంగాలు ఊపిరి పీల్చుకుంటాయి. అదే విధంగా ఉద్యోగ

బి.మధుపాళి




కల్పన ఆధార సబ్సిడీలతో కూడా నిరుద్యోగానికి సమాధానాలు దొరుకుతాయని విశ్లేషిస్తున్నారు. దేశంతోపాటు భారతీయుల భవితను దృష్టిలో పెట్టుకొని పెట్టుబడులు పెట్టడం సముచితంగా ఉంటుంది. మహిళా శక్తికి ఊతం ఇవ్వడం ఉద్యోగాల కల్పన, పన్నుల్లో రాయితీలు మరింత పెరగాలి. యువశక్తి అపారంగా ఉన్న యువభారతంలో విద్యకు బడ్జెట్ కేటాయింపులు రెట్టింపు కావాలి. పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య బోధనలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. నాణ్యమైన విద్యతోపాటు నైపుణ్య వికాసానికి సమానంగా, సమతుల్యత పాటిస్తూ అధిక నిధులు కేటాయించాలి. పేదలకు నాణ్యమైన నైపుణ్యాలతో కూడిన విద్య లభిస్తేనేరేపటి యువభారతం అభివృద్ధిలో భాగస్వామి అవుతుందని తెలుసుకోవాలి. సేవా రంగాలు బలపడడం, నాణ్యమైన విద్య అందించడం సమాంతరంగా కొనసాగాలి. పేద వర్గాలకు ప్రైవేటు రంగంలో నాణ్యమైన విద్యను అందించే పాఠశాలలకు రాయితీలు లేదా ప్రోత్సాహకాలు అందించడం మంచి ఫలితాలను ఇవ్వవచ్చు. ఉపాధ్యాయులకు కాలానుగుణంగా శిక్షణలు లేదా రిఫ్రెషర్ కోర్సులు నిర్వహించడం, ఉపాధ్యాయుల కొరతలేకుండా చూడడం మరువరాదు. ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం పాఠశాల విద్య సదుపాయాల పెంపులో తీసుకున్న చర్యలు మంచి ఫలితాలను ఇవ్వడమే కాకుండా రాజకీయంగా ఆప్‌పార్టీకి లబ్ధినిచేకూరడం కూడా చూస్తున్నాం. విద్యకు సంబంధించిన పట్టాలు ఉండడం మాత్రమే ఉద్యోగ నియామకాలకు అర్హతకాదు. ఉన్నత విద్యతో పాటు నైపుణ్యాల పెంపుదలకు అధిక పెట్టుబడులు ఇవ్వడం నేటి డిజిటల్ యుగంలో కనీస అవసరమవుతున్నది. నాణ్యమైన విద్య అందిస్తూనే నైపుణ్య వికాస శిక్షణలు సమాంతరంగా ఏకకాలంలో కొనసాగాలి. నైపుణ్యశిక్షణకు అవసరమైనకేంద్రాలను ప్రభుత్వాలు నెలకొల్పడం, పేద వర్గాల యువతకు నైపుణ్య విద్యఅందించడం జరగాలి. ఉద్యోగ కల్పన ఆధార విద్యాసంస్థల స్థాపనకు ఊతం ఇవ్వాలి. మెడికల్ కాలేజీల్లో నర్సింగ్ కాలేజీలు, ఫార్మసిస్టులు, మెడి కల్ టెక్నీషియన్లకు శిక్షణ కేంద్రాలు కొనసాగితే దేశవిదేశీ వైద్యరంగాల్లో ఉద్యోగ నియామకాలు పెరుగుతాయి. ప్లంబర్లు, ఎలక్ట్రిఫికేషన్, కార్పెంటరీ లాంటి రంగాల్లో యువతకు తగు శిక్షణాకేంద్రాల ద్వారా అవసర నైపుణ్య విద్యను కల్పించాలి. •

# వయోవృద్ధుల సమస్యలు పరిష్కారమయ్యేనా?



నేదునూరి కనకయ్య

కొడుకుల బిడ్డల నిరాదరణకు గురౌతున్న వారి కోసం కేంద్ర ప్రభుత్వం 2007లో తల్లితండ్రుల వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రతి డివిజన్ స్థాయిలో ఒక ట్రిబ్యునల్ కమిటీ ఏర్పాటుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వృద్ధుల సమస్యల పరిష్కారం సంక్షేమం, హక్కుల రక్షణ కొరకు నియమావళిని రూపొందించారు. కమిటీకి 'ఛైర్మెన్'గా రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారి వ్యవహరిస్తారు. జిల్లా వికలాంగుల సహాయ సంచాలకులు వయోవృద్ధులు శాఖ సహాయ సంచాలకులు కన్వీనర్లుగా స్వచ్ఛంద సంస్థల నుండి ఒకరు లేదా ఇద్దరు ప్రతినిధులు వుంటారు. ఈ కమిటీకి కోర్టుకు వుండే అధికారాలు వుంటాయి. కమిటీ తల్లితండ్రుల కేసులు విచారించి 90రోజుల్లో తీర్పులు ఇస్తాయి. కాని క్షేత్ర స్థాయిలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం ఆశించిన విధంగా జరగడం లేదు. రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారి తన రెగ్యులర్ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం వల్ల సమయం లేకపోవడం వల్ల వయోవృద్ధుల సమస్యలు పరిష్కారానికి నోచుకోని స్థితి దాపురించింది. రాష్ట్రంలో వృద్ధులను బెదిరించి వారి ఆస్తులను తమ పేరు మీద రాయించుకోవడం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఒంటరి వృద్ధులు ఆస్తులు కోల్పోయి బజారున పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్లు, ఒంటరి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పలుపథకాలు ప్రవేశపెట్టడం అభినందనీయం. కానీ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరక్షరాస్యులైన వయోవృద్ధుల సంక్షేమం వారి హక్కుల రక్షణకు సమగ్రమైన చర్యలు చేపట్టాలి. వయోవృద్ధుల ఆస్తులు రాయించుకొని వారిని ఇంటి నుండి బైటకు గెంటి వేస్తున్నా రు. వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తున్నారు. బలవంతంగా వృద్ధుల చేత ఆస్తులు రాయించుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆస్తి విక్రయానికి సంబంధించిన సొమ్ము వృద్ధుని ఖాతాలో



జమ ఆయిన విషయం రూఢీ చేసుకుని అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వృద్ధులు నిరక్షరాస్యులు. వారికి బ్యాంక్ ఖాతాలుండవు. వారిని బెదిరించి శారీరకంగా మానసికంగా హింసిస్తున్నారు. ఇంటి నుండి గెంటివేసిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. డివిజన్ స్థాయి అధికారులు తమ రెగ్యులర్ ఉద్యోగ బాధ్యతల్లో తీరికలేకుండా వుండటంవల్ల వయోవృద్ధుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. మండల స్థాయిలో సీనియర్ సిటిజన్స్ చట్టం అమలుకు ప్రత్యేకనోడల్ అధికారిని నియమించాలి. ప్రభుత్వం ప్రతి మండల స్థాయిలో వయోవృద్ధులు సమస్యలు పరిష్కారం సంక్షేమం, హక్కుల రక్షణకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమించాలి. గ్రామసభ సీనియర్ సిటిజన్స్ చట్టంపట్ల అవగాహన కల్పించాలి. గ్రామ పంచాయితీ కార్యదర్శి గ్రామంలోని వృద్ధుల సంఖ్యపై సర్వే నిర్వహించాలి. గ్రామసభలో వయోవృద్ధుల పోషణసంక్షేమం హక్కుల రక్షణ సీనియర్ సిటిజన్స్ చట్టం పట్ల అవగాహన చైతన్యం కలిగించాలి. అలాగే ప్రతి 3నెలలకు ఒకసారి గ్రామసభలో వృద్ధుల సమస్య ఎజెండాగా సమావేశం నిర్వహించాలి. వృద్ధుల ఆరోగ్యం, సంక్షేమం, అభివృద్ధి పథకాల మీద చర్చ జరగాలి. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి వయోవృద్ధుల జనాభా సేకరించి ప్రతినెలవృద్ధుల కొరకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించాలి. ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు తల్లుల కమిటీలు మాదిరి వయోవృద్ధుల కమిటీ ఏర్పాటు చేయాలి. కేంద్రం వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన టోల్ ఫ్రీ నెంబర్ మీద విస్తృత ప్రచారం చెయ్యాలి. మీడియా ప్రసార మాధ్యమాలు ఎల్రక్టానిక్ మీడియా క్రియాశీల పాత్ర పోషించాలి. ఉచితన్యాయ చైతన్య సదస్సులు నిర్వహించి భూమి యాజమాన్యం భూమిహక్కులు పేరు మార్పిడి వీలునామా సంరక్షణ చట్టాలమీద సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన కల్పించాలి. గ్రామాల్లో వయో వృద్ధులను బెదరించి ఆస్తిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై 1977 చట్టాన్ని అమలు చేసి కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు జరిమానాలు విధించి తిరిగి వయోవృద్ధుల ఆస్తిని వారి పేరు మీద రిజిస్టర్ చెయ్యాలి. సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొనే సమస్యలు జిల్లా కలెక్టర్ రెవెన్యూ డివిజన్ అధికార్లకు నివేదించాలి. వృద్ధులను మానవ వనరుల అభివృద్ధికి సారథులుగా సమాజం ప్రభుత్వం గుర్తించాలి. సామాజిక సంస్కృతికి నాగరికతకు సామాజిక మానవీయ విలువల ప్రదాతలుగా గుర్తించాలి. •

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



శనివారం న్యూఢిల్లీ స్టేషన్‌లో తొక్కిసలాట దృశ్యం



న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో బాధితుల రోదనల దృశ్యం

# అనూహ్య రద్దీ వల్లే తొక్కిసలాట

### న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ ఘటనలో 18 మంది మృతి

### మృతుల్లో 11 మంది మహిళలు, నలుగురు చిన్నారులు, పలువురికి తీవ్రగాయాలు

### మహాకుంభ్‌కు నాలుగు ప్రత్యేక రైళ్లు వేసినా తరగని రద్దీ

### మృతుల కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం ప్రకటించిన రైల్వేశాఖ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** కుంభమేళాకు వెళ్లేప్రయాణీకులు ఒక్కసారిగా వెల్లువలా చొచ్చుకురావడంతో శనివారంరాత్రి న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాటజరిగి 18 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. మృతుల్లో 11 మంది మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. 14,15 ప్లాట్‌ఫారాలపై ఈ దుర్ఘటన జరిగింది. ఘటనపై ప్రధానిమోడీ దిగ్భ్రాంతి వ్యక్తంచేసారు. మృతులకు సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతులపై రైల్వేశాఖ అధికారిక ప్రకటన ఏదీచేయలేదు. అత్యున్నతస్థాయి విచారణకు మాత్రం ఆదేశించింది. తొక్కిసలాటవల్లనే మరణాలు సంభవించినట్లు రక్షణ మంత్రిరాజ్‌నాథ్ సింగ్,ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనాలు తెలిపారు. తొక్కిసలాట నేపథ్యంలో రద్దీని నివారించేందుకు నాలుగు ప్రత్యేకరైళ్లను ఏర్పాటు చేసామని రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ తెలిపారు. అనూహ్యరద్దీకారణంగా తొక్కిసలాట జరిగినట్లు వెల్లడి అయింది. 14వ నంబరు ప్లాట్‌ఫామ్‌పై ప్రయాగరాజ్ ఎక్స్‌ప్రెస్ నిలిచి ఉండటంతో మహాకుంభమేళాకు వెళ్లేభక్తులు అక్కడకు చేరుకున్నారు. స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ రాజధానిఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆలస్యం కావడంతో వాటికోసం వచ్చిన ప్రయాణీకులు అదే సమయంలో 12,13,14 నంబరు ప్లాట్‌ఫారాలపై ఉన్నారు. దీనితో ఒక్కసారిగా అక్కడ రద్దీ పెరిగి తొక్కిసలాటకు దారితీసింది. బీహార్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ కోసం ప్రయాణీకులు ఎగబడ్డారు. భారీ లగేజ్‌పట్టుకుని ఒకరిని ఒకరు తోసుకుంటూ రైలు ఎక్కేప్రయత్నాలు చేసారు. ఒక వృద్ధురాలిని ఎమర్జెన్సీ కిటికీనుంచి లోనికి నెట్టేందుకు ప్రయత్నించగా ఆమె అందులోనే ఇరుక్కునిపోయింది. దర్భంగావెళ్లే రైలు ప్లాట్‌ఫామ్‌పైకి రాగానే రైలులోకి ఎక్కేందుకు రిజర్వేషన్‌లేని, ధృవీకరణలేని ప్రయాణీకులందరూ ఎగబడ్డారు. కిటికీల్లోంచి లగేజిలను విసురుతూ సీట్లుముందుగానే ఆపేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలోనే అడ్డొచ్చినవారిని నెట్టివేయడం గందరగోళానికి దారితీసింది. కనీసం అక్కడ ఆర్పీఎఫ్ సిబ్బంది ఒక్కరు కూడా లేకపోవడం న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లోని దారుణ పరిస్థితులు స్పష్టంచేస్తున్నాయి.

**అనౌన్స్‌మెంట్లవల్లనే తొక్కిసలాట**

తొక్కిసలాటకు ఢిల్లీరైల్వేస్టేషన్‌లో కుంభమేళాకు వెళ్లే రైళ్లపేర్లలో గందరగోళం ఆక కారణం కాగా రైల్వే అధికారులుచేసిన అనౌన్స్‌మెంట్లు కూడా కొంత ఆదుర్దా, తొక్కిసలాటకు దారితీసాయి. తొలుత ప్రయాగరాజ్ స్పెషల్‌రైలు ప్లాట్‌ఫామ్ నెంబరు 16పైకి వస్తుందని ప్రకటించారు. మరో వైపు 14వ నెంబరు ప్లాట్‌ఫామ్‌పై ప్రయాగరాజ్ ఎక్స్‌ప్రెస్ అప్పటికే ఉంది. అదే రైలు అనుకుని కొందరు అక్కడకు చేరారు. అనౌన్స్‌మెంట్ వినగానే తాము ఎక్కాల్సింది 16వ నంబరు ప్లాట్‌ఫామ్‌పై ఉన్నరైలు అని మళ్లీ అక్కడకు పరుగులుతీసారు. వందలమంది ప్లాట్‌ఫామ్ 16వైపు తోసుకువెళ్లారు. అప్పటికే 12,13,14 ప్లాట్‌ఫారాలు ప్రయాణీకులతో క్రిక్కిరిసిపోయాయి. దీనికి తోడు16 వైపు వెళ్లేవారి హడావుడితో తొక్కిసలాట జరిగింది. ఆసమయంలో ప్రయాగరాజ్‌కు నాలుగు రైళ్లు ఉన్నాయి. వాటిలోమూడు ఆలస్యం కావడంతో చాలామంది 14వ నంబరు ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చారు. ఒకరైల్వేస్టేషన్‌లో ఎప్పుడూ ఇంతమంది ప్రయాణీకులను చరిత్రలోనే చూడలేదని ప్రత్యక్ష సాక్షులు చెపుతున్నారు. అధికారులు అక్కడే ఉన్నారు. ప్రయాణీకుల సంఖ్య ఒక్కసారిగాపెరిగిపోవడంతో నియంత్రణ ఎవ్వరితరం కాలేదని చెప్పారు. రాత్రి 10 గంటలసమయంలో తొక్కిసలాట జరిగిందని, 18 మంది చనిపోగా డజన్లకొద్దీ గాయపడ్డారు. మృతులకు రైల్వేశాఖరూ.10 లక్షలచొప్పున పరిహారం కూడా ప్రకటించింది.

**నిర్లక్ష్యం, నిర్వహణలోపం: రాహుల్‌గాంధీ**

రైల్వేశాఖ నిర్లక్ష్యంతోనే ఈ దుర్ఘటన జరిగిందని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన చేసిన పోస్టులో తొక్కిసలాట తనను ఎంతో బాధించిందన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నిర్వహణలోపం, నిర్లక్ష్యంకారణంగానే అమాయకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థత వల్లనే ఈ దుర్ఘటన జరిగిందన్నారు. మరణించిన, గాయపడినవారి ఖచ్చితమైనగణాంకాలు తెలియచేయాలని, రద్దీ నియంత్రణకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కుంభమేళాకు రైల్వేశాఖ అదనపు ప్రత్యేక రైళ్లు ఎందుకు నడపలేదన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గేకూడా ఇవే ఆరోపణలు చేసారు. ఇది కేవలం ప్రభుత్వం,రైల్వేశాఖ అసమర్థత, నిర్లక్ష్యంవల్లనే జరిగిందని ఆరోపించారు.

## రైల్వే తొక్కిసలాటపై విచారణకు ద్విసభ్యకమిటీ ఏర్పాటు

**ఉత్తరరైల్వే ప్రకటన**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది ప్రయాణీకులు మృతిచెందిన ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనపై దర్యాప్తుజరిపేందుకు ద్విసభ్య కమిటీని రైల్వేశాఖ ఏర్పాటుచేసింది. నార్తరన్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌నర్సింగ్ డియో, ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ కమిషనర్ పంకజ్‌గాంగ్వార్‌లతో ఈ కమిటీ ఏర్పాటుచేసినట్లురైల్వేశాఖ ప్రకటించింది. ఈ ఘటనపై ఈ కమిటీ అత్యున్నతస్థాయి విచా రణ జరుపుతుందని వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా రైల్వేస్టేషన్‌లోని విడియో ఫుటేజిలన్నీ భద్రంగా ఉంచాలని కమిటీ ఆదేశాలిచ్చింది. శనివారం రాత్రి పదిగంటలప్రాంతంలో ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో ఈఘటన జరిగిన సంగతి తెలిసిందే. 18 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో తీవ్రగాయాలపాలయ్యారు.

## ఇది రైల్వేశాఖ నిర్లక్ష్యం, వైఫల్యమే

### రైల్వేశాఖ మాజీ మంత్రి లాలూప్రసాద్ యాదవ్



**పాట్నా, ఫిబ్రవరి 16:** కుంభమేళా రద్దీనేపథ్యంలో ఢిల్లీ రైల్వేస్టేషన్‌లోజరిగిన తొక్కిసలాటపై రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ స్పందించారు. మహాకుంభమేళా అర్థరహితమని అన్నారు. రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాటకు రైల్వేనే కారణమని అన్నారు. రైల్వే మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. కుంభమేళాకు వెళ్లేప్రయాణీకులతో ఢిల్లీ రైల్వేస్టేషన్ కిటకిటలాడింది. ఈనేపథ్యంలో శనివారం రాత్రి తొక్కిసలాట జరిగింది. 18 మంది మరణించి పలువురు గాయపడ్డారు. రైల్వే మాజీ మంత్రి కూడా అయిన లాలూప్రసాద్ యాదవ్ ఈఘటనపై స్పందించారు. కేంద్రంలోని బిజెపిపై మండిపడ్డారు. తొక్కిసలాట ఘటన చాలా బాధాకరం, కేంద్రప్రభుత్వం ఏర్పాట్లలో లోపాన్ని ఇది బయటపెట్టింద.ఇ ఈ సంఘటన తర్వాత రైల్వే మంత్రి రాజీనామా చేయాలి. ఇది రైల్వేపూర్తి వైఫల్యం అని విమర్శించారు. యుపిలోని ప్రయాగరాజ్‌కు పెద్దసంఖ్యలో జనవం వెళ్లడంపైనా స్పందిస్తూ కుంభమేళాకు అర్థంలేదు. ఇది అర్థరహితం అని అన్నారు.

## మృతులకు రూ.10 లక్షలచొప్పున పరిహారం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** కుంభమేళాకు ప్రయాణీకులు పోటెత్తడంతో శనివారం న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 18 మంది మరణించగా అనేక మంది గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలుఇస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పగాయాలు అయినవారికి లక్ష ఇస్తామని ప్రకటించారు. మృతుల్లో బీహార్‌కు చెందిన తొమ్మిదిమంది, ఢిల్లీకి చెందిన ఎనిమిదిమంది, హర్యానాకు చెందిన ఒకరు ఉన్నారు. ప్రస్తుతం పరిస్థితిఅదుపులోఉందని అదనపు భద్రతా బలగాలను మొహరించినట్లు అధికారులు తెలిపారు.

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచారం:** రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిగ్భ్రాంతిని వ్యక్తంచేసారు. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ లో జరిగిన తొక్కిసలాటలో పలువురు మరణించడం బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢసానుభూతి. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు అమె తన సోషల్‌మీడియా పోస్టులో పేర్కొన్నారు. యూపీ ముఖ్యమంత్రియోగి ఆదిత్యానాద్‌సైతం విచారం వ్యక్తంచేసారు.రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ తొక్కిసలాట నేపథ్యంలో రద్దీని నివారించేందుకు నాలుగు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశామన్నారు. సంఘటన దురదృష్టకరమని భారీ సంఖ్యలో ప్రయాణీకుల రద్దీ ఒక్క సారిగా తోసుకురావడంవల్లనే ఇలా జరిగిందన్నారు.

## హిందూ సమాజం ఐక్యంగా ఉండాలి

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



**కోల్‌కతా, ఫిబ్రవరి 16:** ప్రపంచంలోని వైవిధ్యాన్ని ప్రజలు ఆమోదించాల్సిన అవసరం ఉందని 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్' (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఉంటుందనే సత్యాన్ని హిందూ సమాజం విశ్వసిస్తోందన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్‌లోని సాయ్ మైదానంలో జరిగిన ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగవత్ మాట్లాడుతూ మనం కేవలం హిందూ సమాజంపైనే ఎందుకు దృష్టి పెడతామని ప్రజలు తరచుగా అడుగుతారని అన్నారు. దీనికి సమాధానంగా దేశంలో బాధ్యతాయుతమైన సమాజం ఏదన్నా ఉందంటే.. అది కేవలం హిందూ సమాజమేనని తాను చెబుతానని అన్నారు. హిందూ సమాజం మరింత ఐక్యంగా ఉండాలని మోహన్ భాగవత్ పునరుద్ఘాటించారు. మంచి సమయాల్లోనూ సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని దానికి సమాజయంలోని ప్రజల మధ్య ఐక్యత అవసరమని అన్నారు. ప్రజలు దేశాన్ని పాలించిన చక్రవర్తులు, మహారాజులను గుర్తు పెట్టుకోరని.. తండ్రి వాగ్దానాన్ని నెరవేర్చడానికి 14 యేళ్ల వనవాసం చేసిన రాజును గుర్తుంచుకుంటారని అన్నారు. 200 యేళ్ల పాటు మన దేశాన్ని పాలించిన బ్రిటిషు వారు దేశ ప్రజలను విడదీయాలని చూశారన్నారు. స్థానిక ప్రజలు దేశాన్ని పరిపాలించడానికి పనికిరారని ప్రచారం చేసి, భారత దేశ చరిత్రను బ్రిటిష్ పాలకులు వక్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బర్ధమాన్‌లో ఆరెస్సెస్ సమావేశం నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరగా మొదట పశ్చిమ బెంగాల్ పోలీసులు నిరాకరించారు. తర్వాత దీనిపై కోల్‌కతా హైకోర్టుకు వెళ్లి అనుమతులు పొందారు.

## బ్రెజిల్ రియో డీజెనీరోలో బ్రిక్స్ సదస్సు





**రియోడీజెనీరో(బ్రెజిల్), ఫిబ్రవరి 16:** ఐదు దేశాల కూటమి బ్రిక్స్‌శిఖరాగ్ర సదస్సు ఈసారి బ్రెజిల్ లోని రియో డీజెనీరోలో జరుగుతుందని అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. జులై 6,7 తేదీల్లో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వియోరా అన్నారు. బ్రిక్స్ దేశాల అభివృద్ధి సహకారం ప్రజల జీవితాలు మెరుగు పరిచేందుకు ఈ సదస్సుల్లో పలు కీలకనిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది అక్టోబరులో రష్యాలోని కజన్ నగరం వేదిగా ఈసదస్సు జరగింది. ప్రధానినరేంద్రమోడీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అద్యక్షుడు జిన్‌పింగ్‌తో సహా పలువురు అధినేతలు వచ్చారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం,పశ్చిమాసియాలోని పరిస్థితులు, ఉగ్రవాదం వంటి కీలక అంశాలపై దేశాల అధినేతలు చర్చలుజరిపారు. ఈ సమావేశంలోనే భారత్‌చైనాల సరిహద్దు వివాదంపై కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. బ్రిక్స్ దేశాలు ఉమ్మడి పౌర కరెన్సీ రూపొందించడంపై దృష్టి సారించాలని పుతిన్ ఆసదస్సులో పిలుపునిచ్చారు. ప్రస్తుతం కూటమిలోని దేశాలు డిజిటల్ కరెన్సీ వాడుకునేందుకు భారత్‌తో కలిసి రష్యాపనిచేస్తుందన్నారు. ఈ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ తీవ్రంగా పరిగణిస్తూ డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మరో కరెన్సీని చెలామణీలోకి తెస్తే ఆదేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించారు.

## సిఇసి, సిబిఐ నియామకాల కమిటీలో సిజెఐ ఎందుకు?

### ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ అభ్యంతరం



**భోపాల్, ఫిబ్రవరి 16:** కార్యనిర్వాహక నియామకాల ప్రక్రియలో చీఫ్‌జస్టిస్ ఆఫ్ ఇండియా భాగస్వాములయ్యే వ్యవస్థపై ఉపరాష్ట్రపతి ధన్‌కడ్ విస్మయం వ్యక్తం చేసారు. భోపాల్‌లోని నేషనల్ జుడీషియల్ అకాడమీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మనదేశంలో ఏదైనా ప్రజాస్వామ్యంలో సిబిఐ డైరెక్టర్‌ఎంపిక వంటి కార్యనిర్వాహక నియామకాల ప్రక్రియలో చట్టప్రకారం సిజెఐ ఎలా పాల్గొంటారని, హేతుబద్ధత ఏంటి, దీనినిపునఃసమీక్షించాలి. కచ్చితంగా ఇది ప్రజాస్వామ్యంలో అమలుకాని అంశం. కార్యనిర్వాహక వ్యవస్థనియామకాల్లో సిజెఐను ఎలా భాగస్వామిచేస్తాం అని ధన్‌కడ్ ప్రశ్నించారు. అయితే ఎంపికలో సిజెఐ ఉండటం వల్ల నియామకాలు మెరుగ్గా ఉంటాయని సీనియర్‌న్యాయవాది షోయబ్ ఆలం అన్నారు. సిజెఐ ఉండాలని అప్పుడే న్యాబద్ధంగా జరుగుతుందని న్యాయవాది మోహిత్‌మాథుర్ అన్నారు. సిఇసి, ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్‌నుంచి సిజెఐని తప్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న అంశం ఇప్పటికే సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది. సిబిఐ డైరెక్టర్ తోపాటు ఇతర నియామకాల ఎంపిక కమిటీలో సిజెఐ ఉండవద్దని సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది చెపుతూ జ్యూడిషియల్ ట్రిబ్యునళ్ల ద్వారా జరిగే నియామకాల్లో సిజెఐ ప్రమేయం ఉండవచ్చని అన్నారు. అయితే అధికశాతం సిజెఐ ఉంటేనే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

## ఇతర ప్రాజెక్టులకు మళ్లిస్తున్న ఆర్మీ ఆహారనిధులు!

**ఆర్మీ డాట్‌కామ్ సంచలన ఆరోపణలు**

**వాషింగ్టన్, ఫిబ్రవరి 16:** అమెరికా ఆర్మీ ఆహారం కోసం సైనికులనుంచి సేకరించిన నిధుల్లో అత్యధికశాతం ఇతర ప్రాజెక్టులకు మళ్లిస్తున్నట్లు ఆదేశ మిలిటరీ డాట్‌కామ్ తీవ్రస్థాయిలో విమర్శించింది.నిధుల్లో సగంకంటే తక్కువ మాత్రమే సైనికులభోజనాలకు వినియోగిస్తున్నట్లు వెల్లడించింది. వారి ఆహారంకోసం మొత్తం 225 మిలియన్ డాలర్లుసేకరించగా వాటిలో కేవలం 74 మిలియన్‌డాలర్లు మాత్రమే ఖర్చయిందని నివేదిక చూపించింది. బ్యారక్‌లలో ఉంటున్న ప్రతి సైనికుడి వేతనం నుంచి ప్రతినెలా 460 డాలర్లు కట్‌చేస్తారని, సిబ్బందికి ఆహారం అందించేందుకు ఈ నిబంధన విధించినట్లు అధికారి ఒకరు తెలిపారు. ఇందులో భాగంగా 2024లో దేశంలో పలుస్థావరాల్లోని సైనికులనుంచి 225 మిలియన్ డాలర్లు తీసుకున్నారని వాటిలో కనీసం 151 మిలియన్ డాలర్లు ఇతరప్రాజెక్టులకు మళ్లించారని మిలిటరీ డాట్‌కామ్ విశ్లేషించింది. వారినుంచి సేకరించిన వాస్తవనగదు మరింత అధికంగా ఉండే అవకాశం ఉన్నట్లు సందేహాలు వ్యక్తం చేసింది. జార్జియాలోని ఫోర్ట్ స్టీవర్ట్‌లో సైనికులనుంచి 17 మిలియన్ డాలర్లు వసూలుచేస్తే ఆ మొత్తంలో కేవలం 2.1 మిలియన్ డాలర్లు మాత్రమే ఖర్చు చేసినట్లు నివేదికలు తెలిపాయి. ఫుడ్‌కోసం కేటాయించిన నిధుల్లో సుమారు 87 శాతం ఇతర ప్రాజెక్టులకు మళ్లించినట్లు తెలిపాయి. సైనికుల ఆహారం నుంచి నిధులను దొంగిలిస్తూ సైనిక సంసిద్ధతను సాధించడం సాధ్యం కాదని రిపబ్లికన్స్ సభ్యుడు జుల్‌టోకుడ అన్నారు. సుమారు 151 మిలియన్ డాలర్లు సేకరించారని అవసరాలకు తగినట్లు మాత్రం ఆహారం అందించలేకపోయారన్నారు. సైనికులు ఆహార కొరతను ఎదుర్కొంటున్నారన్నారు. నాణ్యమైన ఆహారం అందడంలేదని అధికారులు కూడా ఫిర్యాదులు చేస్తున్నారు. ఉడికీ ఉడకని మాంసం, నాసిరకం కూరగాయలతో భోజనం పెడుతున్నట్లు తెలిపారు.

## నెపోలియన్‌తో పోల్చుకుంటూ ట్రూత్‌లో ట్రంప్ పోస్ట్!



**వాషింగ్టన్, ఫిబ్రవరి 16:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి పాలనలో సంస్కరణల జోరును పెంచిన విషయం తెలిసిందే. నిత్యం పదులసంఖ్యలో కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకాలు చేస్తున్నారు. వీటిలో అక్రమ వలసలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలు, ట్రాన్స్‌జెండర్లు, యుఎస్ సైన్యంలోపనిచేయకుండా నిషేధం, ప్రభుత్వ నియామకాలపై నిషేధం, క్యాపిటల్ హిల్ కేసుల్లో క్షమాబిక్ష, మస్క్ నేతృత్వం వహిస్తున్న డోజ్‌కు కీలకబాధ్యతలు ఇవ్వడం ఫెడరల్ వర్క్‌ఫోర్స్ తగ్గించేప్రయత్నాలు జన్మతఃవచ్చే పౌరసత్వం రద్దు వంటి అంశాలపై పలు కేసులు ఎదుర్కొంటున్నారు. యుఎస్ రాజ్యాంగానికి విరుద్ధంగా ఆయన ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఇప్పటికే ఆయనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటిపై తన సొంత మీడియా ట్రూత్‌లో ఆయన మాట్లాడుతూ తన దేశాన్ని రక్షించేవాడు ఎటువంటి చర్యలు తీసుకున్నా అది చట్టాల్ని ఉల్లంఘించినట్లు కాదని ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ చేసిన వ్యాఖ్యలను షేర్‌చేసారు. దీనితో ఆయన తన చర్యలను సమర్థించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఫ్రాన్స్‌ను నపోలియన్ పాలిస్తున్న వేళ తన నిరంకుశపాలనను సమర్థిస్తూ తరచూ ఆయన వ్యాఖ్యలుచేసారు. ట్రంప్‌నకు బద్ధవిరోధి అయిన కాలిఫోర్నియా సెనేటర్ ఆడమ్ షిప్ ఎక్స్‌వేదికగా స్పందిస్తూ అమెరికా అధ్యక్షుడు నిజమైన నియంతలా మాట్లాడారని అన్నారు. అంతర్జాతీయ కార్యక్రమాలకు యుఎస్ఎయిడ సంస్థ అందిస్తున్న నిధులను కూడా నిలిపి వేస్తున్నట్లు ట్రంప్ సర్కారు ప్రకటించింది. ఈ ఆదేశాలపై ఫెడరల్ జడ్జి అమీర్ ఆలీ తాజాగా తాత్కాలిక స్టే ఉత్తర్వులు ఇచ్చారు. తన ఉత్తర్వులు అమలుచేస్తున్నదీ లేనిదీ కూడా ఐదురోజుల్లో తెలపాలని ట్రంప్ సర్కారును ఆదేశించారు.

## అమెరికా మద్దతులేకుంటే మనుగడ కష్టమే..


### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ





**క్యీవ్, ఫిబ్రవరి 16:** అమెరికా మద్దతు లేకుండా రష్యాదాడులను ఢీకొనడం ఉక్రెయిన్‌కు కష్టమేనని అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. అమెరికా రష్యా అధ్యక్షుల మధ్య ఇటీవలచోటుచేసుకున్న ఫోన్ సంభాషణ నేపథ్యంలో ఒక అంతర్జాతీయ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో మాట్లాడుతూ అమెరికా మద్దతులేకుండా ఉక్రెయిన్‌మనుగడ చాలాకష్టం అసాధ్యం కూడా. వారి మద్దతు లేకుండా మేంజీవించే అవకాశాలు కూడా చాలా తక్కువ అని ఆయన అన్నారు. యుద్ధాన్ని ముగించాలని పుతిన్ కోరుకోవడం లేదన్నారు. విరామసమయంలో మరింతసిద్ధం కావడం, సైనిక బలగాల శిక్షణ, రష్యాపై విధించిన కొన్ని ఆంక్షలను తొలగింపచేసుకోవడంకోసం పలు ఒప్పందాలుచేసుకోవాలని ఆయన భావిస్తున్నట్లు చెప్పారు. మ్యూనిచ్‌లో జరిగిన భద్రతా సదస్సుల్లోమాట్లాడిన జెలెన్‌స్కీ ఐరోపాగురించి కీలక వ్యాఖ్యలుచేసారు. రష్యాతో ఐరోపాకు ప్రమాదం పొంచి ఉందని, ఐరోపా ఇప్పటికైనా మేలుకొని సొంతంగా సైన్యం సిద్ధంచేసుకోవాలనిసూచించారు. గతంలోలా ఐరోపాకు అమెరికా అండగా నిలవదన్న ఆయన త్వరలో ఐరోపాపై రష్యా దాడిచేసే అవకాశం ఉందన్నారు. మరోవైపు రస్యాతోట్రంప్ జరుపుతున్న చర్చల్లో ఉక్రెయిన్ భాగస్వామ్యం లేకపోవడంపై జెలెన్‌స్కీ అసంతృప్తి వ్యక్తంచేసారు. యుద్ధం ముగింపుకోసం తీవ్రప్రయత్నాలు చేస్తున్న డొనాల్డ్‌ట్రంప్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీలతో వేరువేరుగా సంప్రదింపులు జరిపారు. పుతిన్‌తో దాదాపు గంటన్నరపాటు చర్చలు జరిపినట్లు స్వయంగా తెలిపారు. నాటోలో ఉక్రెయిన్ చేరిక ఆచరణాత్మక సాధ్యం కాదని భావిస్తున్నట్లు చెప్పిన ట్రంప్ గతంలో కోల్పోయిన భూభాగాన్ని తిరిగిపొందే అవకాశం కూడా ఉక్రెయిన్‌కు లేదన్నారు.

## ఆర్జేడి ఎమ్మెల్యే సోదరులు కిడ్నాప్ చేసి కొట్టారని జెడియునేత ఫిర్యాదు



**పాట్నా, ఫిబ్రవరి 16:** ఆర్జేడి ఎమ్మెల్యే ఆతడి సోదరులు తనను కిడ్నాప్‌చేసి కొట్టారని, బలవంతంగా మూత్రం తాగించారని జెడియునేత ఆరోపించారు. అంతేకాకుండా ఆయన ఇదే అంశాన్ని వివరిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసారు. దీనితో ఆర్జేడి ఎమ్మెల్యేపై కేసు నమోదుచేసారు. అయితే ఈ ఆరోపణలను ఆయన ఖండించారు. బీహార్‌లోని పూర్నియా జిల్లాలో ఈసంఘటన జరిగింది. అధికార జెడియుకు చెందిన బైసీబ్లాక్ ఉపాధ్యక్షుడు మహ్మద్ రెహాన్ ఫజల్, ఆర్జేడికి చెందిన బైసి ఎమ్మెల్యే సయ్యద్ రుక్నుదీన్ అహ్మద్‌లపై పలు ఆరోపణలుచేసారు. దళిత మహిళకు చెందిన భూవివాదంలో తనను కిడ్నాప్‌చేసినట్లు తెలిపారు. తనను బైక్‌పై ఎక్కించుకుని ఎమ్మెల్యే నివాసానికి తీసుకెళ్లి రాడ్లు కర్రలతో దారుణంగా కొట్టారని తాగేందుకు నీళ్లు అడిగితే బలవంతంగా మూత్రం తాగించారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదుచేసారు. తీవ్రంగా గాయపడిన జెడియు నేత మహ్మద్ రెహాన్‌ఫజల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. ఆయన ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తుచేసారు. సేకరించిన ఆధారాల మేరకు ఆర్జేడీ ఎమ్మెల్యే సయ్యద్ రుక్నుద్దీన్ ఆతడి ఐదుగురు సోదరులపై పలు సెక్షన్లకింద పూర్నియా పోలీసులు కేసు నమోదు చేసారు. ఆర్జేడి ఎమ్మెల్యే అరెస్టుకోసం వారంట్‌జారీచేస్తామని ఎస్పీ చెప్పారు. జెడియు నేత మహ్మద్ రెహాన్ ఫజల్ ఆరోపణలను ఆర్జేడి సయ్యద్ రుక్నుద్దీన్ తోసిపుచ్చారు. ఈ ఆరోపణలు రాజకీయ ప్రేరేపితం, నిరాధారమైనవని అన్నారు. తానుకూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసానని చెప్పారు. మజ్లిస్ పార్టీ నుంచి 2022లో ఆయన ఆర్జేడిలో చేరారు.

## బాణాసంచా కర్మాగారంలో పేలుడు: ఇద్దరు మృతి



**ముంబై, ఫిబ్రవరి 16:** బాణసంచా కర్మాగారంలో పేలుడు జరిగి భవనం కూలిపోయింది. ఈ సంఘటనలో ఇద్దరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసుకువచ్చేందుకు సహాయక చర్యలు చేపట్టారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆదివారం కొత్వాల్‌బుడిలోని ఓ బాణసంచా కర్మాగారంలో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి అక్కడి బిల్డింగ్ కూలిపోయింది. శిథిలా కింద కొందరు చిక్కుకున్నారు. భయాందోళన చెందిన కార్మికులు అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు. కాగా, ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## భారత్‌లో ఓటింగ్ పెంపునకు అమెరికా నిధులు

### 21 మిలియన్ డాలర్లు నిలిపివేసిన డోజ్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 16:** అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో వృథా వ్యయం కట్టడే లక్ష్యంగా రూపొందించిన డోజ్ (డిఒజిఇ) విభాగం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా వివిధ దేశాలకు అమెరికా అందించే నిధులకు కోత విధిస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లో జరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అందించే 21 మిలియన్ డాలర్లను రద్దు చేసినట్లు పేర్కొంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది.డోజ్ విభాగం తాజా నిర్ణయంపై బిజెపి నేత అమిత్ మాలవీయ స్పందించారు. 'ఓటర్ల సంఖ్య పెంచేందుకు 21 మిలియన్ డాలర్లా? ఇది భారతదేశ ఎన్నికల ప్రక్రియలో ప్రత్యేక భాగంకాదు. దీని నుంచి ఎవరు లాభపడుతున్నారు? అధికార పార్టీ మాత్రం కాదు' అని మాలవీయ ఎక్స్‌లో రాసుకొచ్చారు.

**బంగ్లాదేశ్‌కు 29 మిలియన్ డాలర్లు:** బంగ్లాదేశ్‌లో రాజకీయ స్థిరత్వాన్ని మెరుగుపరిచేందుకు అందిస్తున్న 29 మిలియన్ డాలర్లకు కూడా డోజ్ కోత విధించింది. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా రాజీనామా తర్వాత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఇక నేపాల్, కంబోడియా, ఆసియా వంటి పలు దేశాలకు కూడా వివిధ రూపాల్లో అమెరికా అందించే సాయాన్ని నిలిపివేశారు.

## రైల్వే ప్రమాదఘటన మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

### దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో సుమారు 18 మంది మృతి చెందడం పట్ల దేవాదాయ, ధర్మాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసిన ఆమె వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని కోరుకుంటున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాద ఘటనలో మరణించిన వారి కుటుంబీకులను, గాయడ్డవారిని కేంద్ర ప్రభుత్వంతోపాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది.

## కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ తరలించుకుపోతుంటే ఏం చేస్తున్నారు?

### సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌ను ప్రశ్నించిన మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 16:** తెలంగాణ నీటి ప్రయోజనాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గండి కొడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుండటం దుర్మార్గమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కృష్ణా జలాలను ఏపీ అడ్డూ అదుపూ లేకుండా తరలించుకుపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని నిలదీశారు. ఈ వాటర్ ఇయర్ లోనే 646 టీఎంసీలు తరలిస్తే ఎందుకు నోరు మెదపడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్‌కు పట్టవా అని నిలదీశారు. సాగర్ ఆనకట్ట కేంద్ర బలగాల ఆధీనంలో ఉందని.. వారి పర్యవేక్షణలో మాత్రమే నీటిని విడుదల చేసుకోవాల్సి ఉన్నప్పటికీ ఏపీ మాత్రం ఇష్టారాజ్యంగా నీటిని తరలిస్తున్నదని విమర్శించారు. తెలంగాణ తాగునీటి అవసరాలకు శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నిలువ ఉంచాల్సిన కోటాను ఏపీ తీసుకెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని మండిపడ్డారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో మిగులు నిల్వలు లేకున్నా పోతిరెడ్డిపాడు, సాగర్ కుడి కాల్వ ద్వారా ఇప్పటికే ఏపీ నీటిని తరలిస్తూ మొండిగా వ్యవహరిస్తుందని హరీశ్‌రావు విమర్శించారు. ప్రతి సంవత్సరం ఉమ్మడి ప్రాజెక్టులకు సంబంధించి నీటి వినియోగానికి కేఆర్ఎంబీ పరిధిలోని త్రిమెన్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. కానీ ఈ ఏడాది ఇంతవరకు త్రిమెన్ కమిటీ మీటింగ్ పెట్టలేదని.. అంటే బోర్డు వ్యవహారం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. బోర్డుపై ఒత్తిడి చేయడంలో, నీటి తరలింపు చేయకుండా ఏపీని నిలువరించడంలో తద్వారా తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఏపీ దూకుడు, తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే నాగార్జున సాగర్, శ్రీశైలం రిజర్వాయర్లు ఖాళీ అయిన పరిస్థితి నెలకొందని హరీశ్‌రావు అన్నారు. ఏపీ నీటి తరలింపును ఇప్పటికైనా అడ్డుకోకపోతే సాగర్ ఆయకట్టుకు ప్రమాదం ఏర్పడనుందని తెలిపారు. సాగర్ లో నీటిమట్టం పడిపోతే హైదరాబాద్ నగరానికి తాగునీటి సమస్య సైతం ఏర్పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాలని, ఈమేరకు కృష్ణ బోర్డుపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

## కేంద్ర పన్నుల్లో పెరిగిన రాష్ట్ర వాటా రూ. 5,359.34 కోట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** కంద్ర పన్నుల్లో తెలంగాణ వాటా పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరం కంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి అదనంగా 21.83 శాతం మేర 5,359.34 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. వాస్తవానికి కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా కింద కొత్త బడ్జెట్‌లో 14,22,444 కోట్ల రూపాయలను కేంద్రం ప్రతిపాదించింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర పన్నుల్లో 41 శాతం వాటాను రాష్ట్రాలకు పంచుతోంది. ఇందులో రాష్ట్రానికి 2.102 శాతం నిధులు రావాల్సి ఉంటుంది. ఆమేరకు 14,22,444 కోట్ల రూపాయల్లో తెలంగాణకు 29,899.77 కోట్ల రూపాయలను కేటాయించింది. ఇందులో కార్పోరేషన్ ట్యాక్స్ కింద 8,349,04 కోట్ల రూపాయలు, ఆదాయ పన్ను కింద 11,140.06 కోట్ల రూపాయలు, సెంట్రల్ జీఎస్టీ కింద 8,704.59 కోట్ల రూపాయలు, కస్టమ్స్ డ్యూటీ కింద 1,376.22 కోట్ల రూపాయలు, యూనియన్ ఎక్సైజ్ డ్యూటీ కింద 285.91 కోట్ల రూపాయలు, సర్వీస్ ట్యాక్స్ కింద 0.86 కోట్ల రూపాయలు, ఇతర ట్యాక్సులు, సుంకాల కింద 43.09 కోట్ల రూపాయలను కేటాయించింది.

## 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసిల ఓటు బిసిలకే

### అభ్యర్థులకు మద్దతుగా నేడు కరీంనగర్ నుండి బిసిల టూర్

### సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 27న జరగనున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలుపించు కోవాడానికి.. బీసీల ఓటు బీసీలకే అనే నినాదంతో ముందుకెళ్లనున్నటుటన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. నేటి(17వ తేదీ) నుంచి 26 వరకు బీసీ అభ్యర్థులకు మద్ధతుగా సభలు, సమావేశాలు ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో నల్లగొండ -ఖమ్మం -వరంగల్ ఉపాద్యాయ నియోజకవర్గం నుండి పూల రవీందర్, కరీంనగర్ -నిజామాబాద్ -అదిలాబాద్ -మెదక్ ఉపాద్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్క కొమురయ్యకి ఇదే నియోజకవర్గం పట్టభద్రుల నుండి ప్రసన్న హరికృష్ణలకు బీసీ సంక్షేమ సంఘం నుండి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అగ్రకులాల ఆధిపత్యంను ఓడించి బడుగుల ఆత్మగౌరవంను నిలబెట్టడానికి రాజకీయాలకు అతీతంగా బీసీలు ఏకం కావాలని, చట్టసభల్లో బీసీల ప్రాతినిధ్యం పెరిగి బీసీల వాణి వినిపించడానికి ఎమ్మెల్సీ ఎన్నికలను వేదిక చేసుకోవాలని జాజుల విజ్ఞప్తి చేశారు.

# ఆధార్‌కార్డు లేదని వైద్యం నిరాకరణ ఘటనపై వైద్యమంత్రి దామోదర రాజనర్సింహా సీరియస్

### మెరుగైన వైద్యం అందించాలని ఉస్మానియా వైద్యులకు ఆదేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఉస్మానియా ఆసుపత్రి వైద్యులపై సీరియస్ అయ్యారు. మహబూబ్ నగర్ జిల్లా మారేడుపల్లి కి చెందిన ప్రమీల అనే మహిళ అనారోగ్యంతో ఉస్మానియా ఆసుపత్రికి వెళ్తే .. ఆమెకు ఆధార్ కార్డు లేదని వైద్యం చేయడానికి నిరాకరించిన ఘటనపై పత్రికలో వార్త కథనం రావడంతో ఉస్మానియా ఆస్పత్రి వైద్యులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనారో గ్యంతో బాధపడుతున్న ప్రమీలకు వెంటనే మెరుగైన వైద్యాన్ని అందించాలని ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను మంత్రి ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రమీలకు మెరుగైన వైద్యాన్ని ఆదివారం ఉదయం నుంచి అందించడం ప్రారంభించారు ఉస్మానియా వైద్యులు.

ప్రమీల ఆరోగ్యం క్రమంగా మెరుగైందని ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు ఆదివారం సాయంత్రం మంత్రి దామోదర రాజనరసింహకి తెలియజేశారు. ఇకపై ఇటువంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉస్మానియా ఆసుపత్రి వైద్యులతోపాటు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.

## ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాని వారికి మరో అవకాశం

### 18 నుంచి 22 వరకు అవకాశమిచ్చిన ఇంటర్ బోర్డు

### ప్రభుత్వ కాలేజీ సెంటర్లలో పరీక్షల నిర్వహణ

### ఉత్తర్వులు జారీ చేసిన బోర్డు సిఒఇ

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 3 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మొదటిసారిగా సీసీ కెమెరాల మధ్య ఇంటర్ బోర్డు పరీక్షలను నిర్వహిస్తోంది. ఈ నెల 22 వరకు కొనసాగనున్న ప్రాక్టికల్ పరీక్షలను నాలుగు విడతలుగా నిర్వహిస్తున్నారు. నేటి(సోమవారం)తో మూడో విడత పరీక్షలు ముగియనున్నాయి. ఈ నెల 18 నుంచి చివరి విడత పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అయితే ఇప్పటి వరకు మూడు విడతల్లో జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకు వివిధ కారణాలతో హాజరుకాని విద్యార్థులకు మరో అవకాశంగా ఈ నెల 18 నుంచి 22 వరకు జరగనున్న చివరి విడతలో అవకాశం ఇవ్వాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు(డీఐఈవో), నోడల్ ఆఫీసర్లకు ఇంటర్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జానేషన్స్(సీవోఈ) జయప్రద బాయి ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలకు హాజరుకాని వారి కోసం ప్రతి జిల్లాలో ఒకటి లేదా రెండు ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఎంపిక చేసి వాటిల్లో ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఐఈవోలు, నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాని వారి చివరి విడతలో అవకాశం కల్పించారు. ఈనెల 3 నుంచి ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు నాలుగు స్పెల్స్‌లో కొనసాగుతూ 22 వరకు కొనసాగనున్నాయి. మొదటి స్పెల్ ఈ నెల 3 నుంచి 7 వరకు.. సెకండ్ స్పెల్ ఈ నెల 8 నుంచి 12 వరకు, మూడో స్పెల్ 13 నుంచి 17(నేటి) వరకు కొనసాగాయి. చివరగా నాలుగో స్పెల్ ఈ నెల 18 నుంచి 22 వరకు కొనసాగ నున్నాయి. చివరి స్పెల్‌లో గత మూడు విడతల్లో పరీక్షలకు హాజరుకాని వారికి కూడా అవకాశం కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాక్టికల్ పరీక్షలకు 33 జిల్లాల్లో 2008 కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఒక సెషన్.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు మరో సెషన్‌ను నిర్వహిస్తున్నారు.

## మానవ మేధోశక్తి ఎంతకీ తరగని గని

### గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ




సభలో ప్రసంగిస్తున్న గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ, వేదికపై బాలకిష్టారెడ్డి, నర్సింహారెడ్డి, రాజ్యలక్ష్మి, రాజ్‌మోహన్ తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** ప్రపంచవ్యాప్తంగా ప్రకృతిలో ఎన్నో రకాల గనులున్నాయని, వాటిని తవ్వుతూపోతే ఏదో ఒకరోజు తరిగిపోతాయని, కానీ ఎంత కాలమైనా వినియోగించుకుంటూ పోయినా ఏనాటికి తరగని గని మానవ మేధోశక్తి ఒక్కటేనని గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. అయితే ఈ మేధోశక్తిని పదునుపెట్టేది గణితశాస్త్రమని ఆయన అన్నారు. ప్రముఖ విజ్ఞాన సంస్థ స్మార్ట్‌జీనియస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన అబాకస్, వేదిక్ మ్యాథ్స్, హాండ్ రైటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల ఆయా పోటీలు, వారికి బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గవర్న రు జిష్ణుదేవ్‌వర్మ విశిష్ట అతిథులు డా. వి.బాల కిష్టారెడ్డి, ఇ.వి. నరసింహారెడ్డి, వెంకట నర్సమ్మ, పి.కార్తిరావన్, సంస్థ డైరెక్టర్ ఎం.రాజ్ మోహన్, ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి రాజ్‌మోహన్ తదితరులతో కలిసి జ్యోతి ప్రకాసనం చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గణితం కేవలం ఒక సబ్జెక్ట్ మాత్రమే కాదు రకరకాల ఆలోచనలను రేకెత్తిస్తుం దన్నారు.

అంతేకాక మెదడు చురుకుగా పనిచేసేందుకు, భౌతిక తార్కికతను బలోపేతం చేయడం, ఏకాగ్రతను పెంచడం, సమస్యల పరిష్కార శక్తిని పెంచి పరిష్కరించేందుకు తోడ్పడుతుందని తెలిపారు. సంస్థ నిర్వహించిన పోటీల్లో మొత్తం 15వేలమంది పిల్లలు అంతర్జాతీయంగా పాల్గొనడం, అందులో 1500మంది బహుమతులను పొందడమే కాకుండా 230మంది నూటికి నూరుశాతం సాధించి భారత పూర్వ రాష్ట్రపతి డా. ఎ.పి.జె.అబ్దుల్‌కలాం పేరున ఛాంపియన్స్‌గా నగదు బహుమతులను పొందడం శ్లాఘనీయమన్నారు. ఈ విజయం పిల్లల్లోని అంకితభావం, క్రమశిక్షణ, లక్ష్యసాధనపట్ల ఆసక్తిని తెలుపుతూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందని విజేతలను ఎంతగానో అభినందించారు. గణితం బుద్ధివర్ధనమ్ అంటాం"న్నారు. ఇక్కడ పిల్లల ప్రదర్శన అద్భుతం మేధాశక్తికి తార్కాణమని కొనియాడారు. నేడు కొత్తగా వచ్చిన కృత్రిక మేధస్సుతో కూడా మానవ మేధాశక్తి పోటీపడుతూనే ఉందని అన్నారు. సెర్చ్ రిసెర్చ్‌లలో విజ్ఞానంతో జ్ఞానం పోటీపడుతుందని, అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జైజవాన్. జైకిసాన్, జైవిజ్ఞాన్, జైఅనుసంధాన్ నినాద మిచ్చారని గుర్తుచేశారు.

నేడు భారతదేశం ఎన్నోరంగాలతోపాటు మానవ మేధాశక్తిలో అగ్రస్థానంలో ఉందని గవర్నరు చెప్పారు. చివరిగా విద్యార్థులు నానాటికీ మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకొంటూ గొప్పగా రాణించాలని సూచిస్తూ ఆ దిశగా ప్రోత్సహిస్తున్న స్మార్ట్‌జీనియస్ యాజమాన్యాన్ని, పాల్గొన్న విద్యార్థులను, అందుకు తోడ్పాటునందించిన తల్లిదండ్రులను ఎంతగానో అభినందించి విజేతలకు ఇతర అతిథులతో కలిసి బహుమతులను అందజేశారు. సంస్థ డైరెక్టర్, ఛైర్‌పర్సన్‌లు విద్యార్థులను ప్రోత్సహిస్తున్న తీరును విశదీకరించారు.

## గురుకులాల్లో దరఖాస్తులు 80వేలు కూడా దాటలేదు

### రేవంత్ సర్కార్‌పై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 16:** కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రానికి పట్టిన ఒక శని అని బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఒకప్పుడు గురుకులాల్లో చదవడానికి లక్షల మంది పిల్లలు పోటీపడేవారని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి అడ్మిషన్ల కోసం సెక్రటరీ ఆఫీసు ముందు అర్ధరాత్రి వరకు పడిగాపులు కాసే వారని గుర్తుచేశారు. తమ పిల్లల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దడం కోసం, ప్రైవేట్ సంస్థలకు లక్షలాది రూపాయలు ఖర్చుచేయకుండా నాణ్యమైన విద్య పొందేవారని పేర్కొన్నారు. గత పది సంవత్సరాలలో విద్యార్థులు మంచి పౌష్టికాహారం తీసుకుంటూ అద్భుతమైన ఫలితాలు సాధించేవారని చెప్పారు. కానీ ఇప్పుడు గురుకులాల్లో ప్రతిరోజూ ఏదో ఒక సమస్య కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫుడ్ పాయిజన్ కేసులు, విద్యార్థి ఆత్మహత్యలు, పాము కాటు సంఘటనలు,ఎలుకల బెడద.. ఫలితంగా చివరి తేదిని ఎన్ని సార్లు పొడిగించినా ఐదో తరగతి దరఖాస్తులు 80వేలు కూడా దాటలేదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఇవన్నీ కేవలం ఒక ఏడాదిలోనే జరగడం గమనార్హమని పేర్కొన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో విద్యార్థుల జీవితాలు ఆగమైనయని.. భవిష్యత్తుకు భరోసా లేదని.. ఏం తినాలన్నా, ఏ అనారోగ్యం పాలవుతారోనని ఆందోళన నెలకొందని మండిపడ్డారు. ఏ సమయంలో ఏ సంఘటన జరిగి ఆత్మహత్య చేసుకుంటారోననే భయం, పిల్లలు తల్లితండ్రులలో నెలకొందని అన్నారు. ఈ దుస్థితిపై అడిగితే కేసులు పెడుతున్నారని భయం ఉందన్నారు. ఇదంతా కేవలం నిర్లక్ష్యం, వివక్ష, అనాలోచిత విధానాల వల్ల జరుగుతున్నవేనని పేర్కొన్నారు.రాష్ట్రంలోని గురుకులాల్లో ఇంత జరిగినా కాంగ్రెస్‌కు పట్టింపులేదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క సమీక్ష కూడా చేయలేదని.. చేసినా అది కేవలం ఫోటోల కోసమే అని అన్నారు. కేసీఆర్ అద్భుతంగా అభివృద్ధి చేసిన గురుకులాలను, ఆగం చేయాలనే కోరిక, పేదలకు నాణ్యమైన విద్యను దూరం చేయాలనే దుర్మార్గపు ఆలోచన నిజం అవుతున్నదనే సంతోషం వారిలో ఉండవచ్చని మండిపడ్డారు. కానీ ఈ పేద ప్రజలు మిమ్మల్ని విడిచిపెట్టరని.. మీరు చేస్తున్న ఈ దారుణాలను మరిచిపోరని, పేదల వ్యతిరేక పాలన అంతమయ్యేవరకు కేసీఆర్ నాయకత్వంలో పోరాడుతామని.. తెలంగాణను కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

## భర్త కులమే భార్యకు వర్తింపు

### రాహుల్ కుటుంబం కులమతాలకు అతీతం

### పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** హిందూ సాంప్రదాయ ప్రకారం భర్తది ఏకులమైతే భార్యది అదే కులం అవుతుందని హిందూ ధర్మంపై రాజకీయం చేసి ఓట్లు అడిగి బతికే బండి సంజయ్‌కు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, రాహుల్‌గాంధీ కులం ఏదో తెలియకపోతే ఎట్లా అని టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి నిలదీశారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాహుల్‌గాంధీ కుటుంబం కులమతాలకు అతీతంగా ఉందని జగ్గారెడ్డి వివరించారు. రాహుల్‌గాంధీ కుటుంబం బ్రహ్మణ,హిందువులు అని జగ్గారెడ్డి ధృవీకరించారు. నేను రెడ్డిని నాభార్య గౌడ్ ఇప్పుడు మా ఆవిడ రెడ్డి అని పిలుస్తారు కదా అని ఆయన చెప్పారు. సోనియాగాంధీ భర్త బ్రాహ్మణుడు అని జగ్గారెడ్డి ప్రకటించారు. రాహుల్‌గాంధీ కుటుంబం ఎప్పుడు రాజకీయంగా కులాన్ని వాడలేదని అన్నారు. ఇందిరాగాంధీ భర్త అసలు పేరు ఫిరోజ్ జహంగీర్ గాంధీ మన దేశ సాంప్రదాయ ప్రకారం సోనియాగాంధీ రాజీవ్‌గాంధీని వివాహం చేసుకున్నాక సోనియాగాంధీగా మారారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజి వెంట ఫిరోజ్ ఉంటేవాడు ఆ క్రమంలో ఆయన పేరు ఫిరోజ్‌గాంధీగా ప్రజలు ఆయన పేరు మార్చినారు. రాహుల్‌గాంధీ అంటే చరిత్ర అని అన్నారు. వాజపాయి తరువాత ప్రధాని అద్వాని కావాల్సి ఉంది కానీ ఆయనను పక్కనబెట్టి మోడీ ప్రధాని అయ్యారు. అద్వాని లేకుంటే బిజెపికి దిక్కేలేదు అని ఆయన అన్నారు. అద్వాని రథయాత్ర చేయకపోతే బిజెపికి ఉనికిలేదని ఆనాడు మోడీ అద్వాని వెనుక ఉన్నారని అన్నారు. యుపిఎ భాగస్వామ్య పక్షాలు సోనియాగాంధీ ప్రధాని కావాలని కోరినా వదిలేసుకున్నారు. కిషన్‌రెడ్డిలు సంజయ్ మోడీ దగ్గర అద్వాని గురించి మాట్లాడే ధైర్యం ఉందా అని అన్నారు.

## యాసంగిలో సన్నాలదే హవా

### రికార్డు స్థాయిలో సాగు..65 శాతానికి చేరువలో నాట్లు

### ఉత్తర తెలంగాణలో అధికం

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** తెలంగాణలో సన్న రకాల వరి హవా కొనసాగుతోంది. ప్రస్తుత యాసంగి సీజనులో గతంలో ఎన్నడూ లేని విధంగా సన్న రకాలకు చెందిన వరి నాట్లను వేసేందుకే రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దీంతో రాష్ట్రంలో సన్న రకాల సాగు జోరందుకుంది. రాష్ట్రంలో ప్రస్తుత యాసంగిలో సాగవుతున్న వరిలో 65 శాతం మేర సన్న రకాలే ఉన్నట్లు వ్యవసాయ శాఖ స్పష్టం చేస్తోంది. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల చొప్పున బోనస్ ఇస్తుండటంతో రైతులు ఆ దిశగా మళ్లారు. రాష్ట్రంలో వానాకాలం వరి పంటకు సంబంధించి 23 లక్షల టన్నుల సన్న రకాలకు చెందిన ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 చొప్పున 1,154 కోట్ల రూపాయల మేర రైతులకు బోనస్‌గా చెల్లించింది. ఈ నేపథ్యంలో ఇటీవల వరకూ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ యాసంగిలో 106 శాతం మేర 52 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. గత ఏడాది ఇదే సమయానికి 41 లక్షల ఎకరాలకే పరిమితమైన వరి నాట్లు, ఈ సారి దానికి కంటే అదనంగా మరో 11 లక్షల ఎకరాల్లో సాగు చేయడం జరిగింది. బోనస్‌తో పాటు, ప్రధానంగా సాగు నీరు అందుబాటులో ఉండటం, వాతావరణం కూడా అనుకూలించడంతో సన్నాలపై రైతులు దృష్టిసారించారు. ఇప్పటి వరకూ సాగైన వరి నాట్లలో 65 శాతం మేర అంటే రికార్డు స్థాయిలో దాదాపు 34 లక్షల ఎకరాల్లో సన్నా రకాలు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. రాష్ట్రంలో సాధారణంగా వానాకాలం సీజనులో సాగయ్యే వరిలో 38 శాతం వరకు, రబీలో 10-15 శాతం వరకు సన్న రకాలు ఉంటాయి. ఇప్పుడు రికార్డు స్థాయిలో, అది కూడా యాసంగిలో 65 శాతం వరకూ ఇంత భారీ ఎత్తున సన్న రకాలు సాగవడం ఇదే తొలిసారని అంటున్నారు.

## ఎసిబి పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్ నమ్మొద్దు

### ఎసిబి డిజి విజయ్‌కుమార్ వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** ఎసిబి పేరుతో కొందరు నేరగాళ్లు ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్న ఉదంతంపై ఎసిబి డిజి వి జయ్ కుమార్ స్పందించారు. దీనిపై ఆయన ఆదివారం నాడు మాట్లాడుతూ ఈ తరహా ఫోన్ కాల్స్‌ను ఎవరూ నమ్మవద్దని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులను ఎసిబి అధికారుల పేరిట బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్న అంశం తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ తరహా కేసులను తాము తీవ్రంగా పరిగణిస్తామని ఆయన తెలిపారు. ఎవరైనా ఎసిబి పేరు చెబుతూ డబ్బులు వసూలు చేయాలని ప్రయత్నిం చినా, ఫోన్‌లో బెదిరించినా వెంటనే ఎసిబి టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా సమీప పోలీసు స్టేషన్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. ఈ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు జాగ్రత్తగా వుండాలని ఆయన కోరారు. ఈ తరహా ఫోన్ కాల్స్‌ను ఎవరూ నమ్మవద్దని ఎసిబి డిజి విజయ్‌కుమార్ కోరారు.

## జాతీయ ఒబిసి సెల్ ఛైర్మన్‌తో మంత్రి పొన్నం భేటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరానికి విచ్చేసిన జాతీయ ఒబిసి సెల్ ఛైర్మన్, హర్యానా రాష్ట్ర మాజీ మంత్రి కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బిసి కార్పోరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ఒక హోటల్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు అజయ్‌సింగ్‌యాదవ్‌ను శాలువతో సత్కరించారు.



అజయ్‌సింగ్‌యాదవ్‌ను సత్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, నూతి శ్రీకాంత్‌గౌడ్

## మేడ్చల్‌లో పట్టపగలే దారుణ హత్య


### సోదరుడే హత్యచేశాడనే అనుమానాలు

**మేడ్చల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** మేడ్చల్‌లో నడిరోడ్డుపై పట్టపగలే ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. తీవ్రసంచలనం రేపిన ఈ ఘటన పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన గన్యా మేడ్చల్ బస్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఉద్యోగరీత్యా మేడ్చల్‌లో పని చేస్తున్న అతను కుటుంబసభ్యులతో కలిసి మేడ్చల్‌లో నివాసముంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం మేడ్చల్ డిపో ముందు నుండి గన్యా రెండో కుమారుడు ఉమేష్(30) 44వ జాతీయ రహదారిపై వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు అకస్మాత్తుగా వచ్చి రోడ్డుపైనే కత్తితో కడుపులో పొడిచారు. అతను అక్కడికక్కడే కుప్పకూలి పోయినా ఆ తర్వాత వెంటవెంటనే ఇరువై, ముప్పైసార్లు పొడిచి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఈ దారుణ హత్యను స్థానికులు విడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో దావణంలా వ్యాపించడంతో ప్రజలు బస్‌డిపో వద్దకు చేరుకుని గుమిగూడారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అప్పటికే అతను ప్రాణాలు వదిలాడు. కాగా కుటుంబకలహాల కారణంగా మృతుడి తమ్ముడే మరో వ్యక్తితో కలిసి కత్తితోపొడిచి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు సమాచారం. కాగా పూర్తి వివరాల కోసం సిఐ సత్యనారాయణ, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి విచారణ చేపట్టారు.

# అంగరంగ వైభవంగా సమతాకుంభ్ ఉత్సవాలు

### నిత్య సుప్రభాతం, అష్టాక్షరీ మంత్రం, విష్ణు సహస్రనామాలతో మార్మోగుతున్న ముచ్చింతల్

### వేలాదిగా తరలివస్తున్న భక్తజనం



**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లాల్లోని ముచ్చింతల్‌లో సమతాకుంభ్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ఆదివారం రెండు విశేష ఉత్సవాలు జరిగాయి. ఒకటి వసంతోత్సవం కాగా మరొకటి తెప్పోత్సవం. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సాకేత లక్ష్మీరామచంద్రులకు వసంతోత్సవం జరిగింది. ఈ ఉత్సవాలను భక్తులు కల్యాణదాయంగా భావిస్తారు. ఈ ఉత్సవాలను నిర్వాహకులు విగ్రహాలపై పలురకాల రంగులను చల్లి ప్రారంభించగా అనంతరం వారు ఆయా రంగులను భక్తు లకు పంచగా వాటిని వారు పరస్పరం చల్లుకుంటూ. సీతారామచంద్రులకు సంబంధించిన కీర్తనలను పాడుతూ నృత్యాలు చేశారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 3వేల మంది చిన్నారులు, గోదాదేవి వేషధారణతో చేసిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అటు.. బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన తెప్పోత్సవం సాయంత్రం జరిగింది. ముచ్చింతల్‌లో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో వైదిక కార్యక్రమాలతోపాటు మరెన్నో విశేష కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. రోజుకో ప్రత్యేక వాహన సేవలు జరుగుతున్నాయి. సమతాస్ఫూర్తి కేంద్రంలో ప్రతీదృశ్యం రమణీయం.. ప్రతీ ఘట్టం మహాద్భుతం. ఒకేచోట శ్రీరామానుజాచార్య - 108 దివ్య దేశాధీశుల కల్యాణం అంటే రెండు కళ్లు చాలవు. వెయ్యి సంవత్సరాల క్రితం జరిగిన జ్ఞానయజ్ఞం చేసిన భగవద్రామానుజుల స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రతీయేటా నిర్వహిస్తున్న సమతాకుంభ్ ఉత్సవాలు ఆధ్యాత్మిక వైభవాన్ని కళ్లకు కడుతోంది. కులం, మతం మనిషిని గొప్పవారిని చేయవని, ఆధ్యాత్మికత, అంకితభావం, కట్టుబాట్ల వల్లే మనిషి గొప్పవాడవుతాడంటారు శ్రీరామానుజాచార్య. సమతాకుంభ్ ఉత్సవాలు అలాంటి సందేశాన్నే ఇస్తుంది.

వెయ్యేళ్లు దాటినా సమతాభావం సమాజానికి పాఠాలు బోధిస్తూనే, వార్షికోత్సవాల రూపంలో ఆ స్ఫూర్తిని రగిలిస్తూనే ఉంది. 10 రోజులుపాటు పలు రకాల ఉత్సవాలు, విశేష సేవలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 10న సూర్యప్రభ వాహనసేవ, 12వ తేదీ రామానుజ నూత్తందాది సామూహిక పారాయణం, 13న ఆచార్య వరివస్య, 15న శాంతికళ్యాణ మహోత్సవాలు జరగ్గా ఆదివారం ఉదయం వసంతోత్సవం, సాయంత్రం తెప్పోత్సవం, 18వతేదీ రథోత్సవం, చక్రస్నాన ఘట్టాలు జరిగాయి. ఈ పది రోజుల వేడుకల్లో నిత్యం సుప్రభాతం, అష్టాక్షరీ మంత్రజపం, విష్ణు సహస్రనామ పారాయణం, 18 దివ్యదేశ మూర్తులకు గరుడసేవ..ఇలా ఆధ్యాత్మిక శోభతో ముచ్చింతల్ శ్రీరామనగరం పరవశిస్తున్నది.

తృతీయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేం దుకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శ్రీరామానుజాచార్య 108 దివ్యదేశాల తృతీయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 9వ తేదీన ఉత్సవారంభ స్నపనం, అంకురారోపణతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు 19వ తేదీ వరకు జరగనున్నాయి. తృతీయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేం దుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు.

# రాష్ట్రంలో మటన్, చేపలకు భారీ డిమాండ్

## ఇష్టారాజ్యంగా రేట్లు పెంచి అమ్మకాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** తెలంగాణలో బర్డ్ ఫ్లూ ప్రభావంతో మటన్, చేపలకు భారీగా డిమాండ్ పెరిగింది. కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకున్నాయనే భయంతో చికెన్ 80 శాతం మంది చికెన్ తినడాన్ని మానేశారు. బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ కొనుగోళ్లు తగ్గించిన జనం చేపలు, మటన్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో చేపలు, మటన్ షాపుల వద్ద జనం క్యూ కడుతుండగా, వాటి అమ్మకాలు జోరందుకున్నాయి. హైదరాబాద్ విషయానికి వస్తే ఆదివారం నాడు పలు చేపల మార్కెట్లు కిటకిటలాడాయి. రాంనగర్‌లోని చేపల మార్కెట్లో జనాలు కిక్కిరిసిపోయారు. కొత్తపేటలోని చేపల మార్కెట్లో ఉదయం నుంచి చేపల విక్రయాలు భారీగా జరుగుతున్నాయి. ఇలాగే రాష్ట్రంలోని పలు పట్టణాలు, పల్లెలు అనే భేదం లేకుండా చేపలు, మటన్ షాపులు కిటకిటలాడాయి. ఇదే సమయంలో కొనుగోలుదారులు లేక చికెన్ దుకాణాలు ఖాళీగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో చేపల రేట్లు ఒక్కసారిగా పెంచిన పలువురు వ్యాపారులు అందిన కాడికి దోచుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కిలో మటన్ 700 రూపాయల నుంచి 800 రూపాయల వరకు విక్రయించేవారు. ప్రస్తుతం ఈ రేటుకు అదనంగా మరో 50 నుంచి 150 రూపాయల వరకు పెంచి అమ్ముతున్నారు. అదే విధంగా చేపల రేట్లను కూడా పెంచి విక్రయిస్తున్నారు. కేజీ 150 నుంచి 160 రూపాయలకు అమ్మే బొచ్చ, రవ్వ రకం చేపలను ఏకంగా కేజీ 250 రూపాయల చొప్పున అమ్ముతున్నారు. దీంతో ఈ పెంచిన రేట్లు మధ్య తరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మొత్తానికి కోడికి వచ్చిన రోగానికి మాంస ప్రియుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

# నడకమార్గంలో భద్రతే ధ్యేయం!

## అలిపిరి నడకదారిలో భక్తులకు ఆంక్షలు

## చిరుతల సంచారంతో టిటిడి అప్రమత్తత

**తిరుమల,ఫిబ్రవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం కాలినడకన తిరుమలకొండకు వస్తున్న భక్తుల భద్రతే ధ్యేయంగా టిటిడి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన ప్రణాళికలు సిద్దంచేసి, భక్తులను గుంపుగా పంపుతున్నారు. అలిపిరి నడకమార్గంలో 7వ మలుపువద్ద మూడురోజుల క్రిందట చిరుతపులి సంచరించడం, సిసిటివికెమెరాల్లో గుర్తించడం తెలిసిందే. చిరుతపులులు వేసవికి ముందే నడకమార్గంలో, ఘాట్‌రోడ్లలో సంచరించే ప్రమాదం ఉందని గుర్తించిన టిటిడి అధికారులు అటవీ,విజిలెన్స్ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకుం టున్నారు. ఉదయం 5గంటల నుండి మధ్యా హ్నం2గంటలవరకు 12ఏళ్ళలోపు పిల్లలను,వారి తల్లిదండ్రులను నడకదారిలో అనుమతి నిస్తు న్నారు. ఆ తరువాత పిల్లలను తిరుమలకు కాలినడకన అనుమతించడంలేదు. ఇక ఉదయం నుండి రాత్రి 9గంటల వరకు 70మంది వరకు భక్తులను విజిలెన్స్ సిబ్బంది గుంపుగా పంపు తున్నారు. ఇలా చేయడం వల్ల చిరుతలు దారి తప్పి వచ్చినా భయంతో జనానికి దగ్గరరావని చెబుతున్నారు. అంతేగాక రాత్రి 9గంటలకు అలిపిరి కాలినడక మార్గాన్ని మూసివేస్తున్నారు. గత మూడేళ్ళుగా వరుసగా జరిగిన చిరుతల దాడులు, చిన్నారులను హతమార్చడం వంటి ఘటనలు దృష్టిలో ఉంచుకుని టిటిడి ఇప్పుడు మరింత జాగరూకతతో వ్యవహరిస్తోంది. భక్తుల చేతుల్లో కర్రలు కూడా తీసుకెళ్ళేలా చూస్తు న్నారు. దీనివల్ల కొంతవరకు భయం ఉండదని భావిస్తున్నారు. పూర్తిగా అటవీప్రాంతానికి ఆనుకునే ఉన్న అలిపిరి కాలినడక మార్గంలో గాలిగోపురం నుండి 7వ మైలువరకు, మొదటిఘాట్‌రోడ్డు కలిసే లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు ఇప్పటికే విజిలెన్స్, అటవీశాఖ సిబ్బంది అలర్ట్‌గా ఉంటున్నారు. కాలినడక మార్గంలో,ఆనుకుని ఉన్న అటవీప్రాంతంలో సిసికెమెరాలు నిఘా ఉన్నాయి. శ్రీవారిమెట్టు దారిని కూడా సాయంత్రం 5గంటలకే మూసి వేస్తున్నారు. నడకమార్గాల్లో చిరుతపులులు, వన్యమృగాలు సంచారం వేసవిలో ఎక్కువగా ఉంటుందని అటవీశాఖ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో అలిపిరి కాలినడక మార్గంలో మరింతగా భద్రతకు ఉపక్రమించింది. అలిపిరి నుండి తిరుమలకు కాలినడకన 25వేలమంది వరకు భక్తులు రోజూ వస్తున్నారు. తమ మొక్కు బడుల్లో భాగంగా కొండకు చేరుకుంటున్నారనేది టిటిడి వర్గాల సమాచారం. నడకమార్గంలో మెట్లెక్కుతూ చిన్నపిల్లలు తల్లిదండ్రులు, కుటుం బసభ్యులను వదలి ముందుగా వెళ్ళకుండా కూడా విజిలెన్స్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# పెద్దగట్టుకు పోటెత్తిన భక్తులు



## ఆలయానికి చేరిన దేవరపెట్టె

## గంపల ప్రదక్షిణతో జాతర ప్రారంభం

## భారీ బందోబస్తు ఏర్పాటు

## నేడు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు స్థానిక సెలవు ప్రకటించిన కలెక్టర్

**ప్రభాతవార్త, నడిగూడెం(సూర్యాపేట):** రాష్ట్రంలోనే అతిపెద్ద రెండో జాతర అయిన లింగమంతుల స్వామి జాతర సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్పల్లిలో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. పెద్దగట్టు జాతరకు భక్తులు పోటెత్తారు. రోజుకు ఒక కార్యక్రమం చొప్పున ఐదు రోజులు నిర్వహిస్తారు. మొదటిరోజు గంపల ప్రదక్షిణతో కార్యక్రమం ప్రారంభమైంది. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి ఆదివారం రాత్రి గంపలతో ప్రదక్షిణ చేశారు. కేసారం నుండి చౌడమ్మతల్లి ఉన్న దేవరపెట్టెను రెడ్డి గొల్ల కులస్తులు కాలినడకన బయలుదేరి దురాజుపల్లిలో ఉన్న పెద్దగట్టుకు చేరుకున్నారు. గజ్జల లాగులు ధరించి చప్పట్లు కొడుతూ కత్తుల విన్యాసాలు చేస్తూ ఓలింగ ఓలింగా నామస్మరణతో గంపలతో ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేశారు. అంతేకాకుండా రెండు బోనాలు చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కన్నుల విందుగా తిలకించారు. ఆర్టీసీ అధికారులు వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు వేశారు. భక్తుల సౌకర్యం నిమిత్తం పెద్దగట్టు ఆలయ పరిసరాల్లో అధికారులు తగిన ఏర్పాటు చేశారు. గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారి 65 పై వాహనాలను మళ్లించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చీకటాయపాలెంలో బైకాన్ ఇళ్లలో దేవరపెట్టే జాతర చివరి రోజున తీసుకెళ్లి భద్రపరుస్తారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే జాతర సందర్భంగా తిరిగి దేవరపెట్టెను చీకటాయపాలెం నుంచి కేసారం తీసుకొస్తారు. కేసారం నుండి జాతర ప్రారంభం రోజున ఊరేగింపుగా పెద్దగట్టుకు తీసుకురావడంతో జాతర ప్రారంభమవుతుంది. అదేవిధంగా శ్రీ లింగమంతుల స్వామి తోపాటు 33 మంది దేవతల గణం ఉంటుంది. లింగమంతుల స్వామి శాకాహారి. ఆయనకు శాకాహారాన్ని నైవేద్యంగా సమర్పించారు. మిగిలిన దేవతలకు జంతువులను బలిచ్చి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయంలో సంప్రోక్షణ చర్యలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. ముఖ్యంగా పారిశుధ్య చర్యలు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. కాగా పెద్దగట్టుకు 200 సంవత్సరాల చరిత్ర ఉన్నట్లు చెబుతుంటారు. ఇక్కడి స్థల చరిత్ర ప్రకారం లింగన్న మానవాతీత శక్తులు కలిగిన పశు కాపరిగా ఉంటూ ప్రకృతి వైపరీత్యాల నుండి క్రూర మృగాల దాడుల నుండి పశువులను కాపాడే వాడని చెప్తుంటారు. స్థానిక పశుకాపరులు ఉండ్రుగొండ సమీపంలో ఉన్న పెద్దగట్టు మీద పశువులను మేపేవారు. ఈ నేపథ్యంలో పశువుల పై దాడికి వచ్చిన క్రూర మృగాలనుఎదుర్కొంటూ వెళ్లిన లింగన్న మాయమై అక్కడే దైవంగా వెలిశాడని యాదవుల నమ్మకం. ఆ విధంగా మాయమైన లింగన్నను స్థానిక పశుకాపరులు కోలింగ అంటూ పెద్ద గట్టు ఎక్కి జాతరను ప్రారంభించారు. ఉండ్రుగొండ పెద్దగట్టు ప్రాంతం పెద్ద కోట దుర్గం. దట్టమైన అడవులతో నిండి ఉండటంతో జాతర సమయంలో ఒక గర్భిణీకి జరిగిన ప్రమాదం కా రణంగా ప్రస్తుతము దురాజ్పల్లి సమీపంలో ఉన్న పాల శర్లయ్య గుట్టమీదికి జాతర మారినట్లు చెబుతుంటారు. దురాజ్పల్లి గ్రామానికి సమీపాన ఉన్న కేసారం గ్రామ యాదవులు అక్కడ హక్కుదారులుగా ఉండి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జాతర జరిపిస్తుంటారు. ఒకరోజు ముందుగానే సూర్యాపేటలోని హక్కుదారులైన యాదవ వంశస్థులు మకర తోరణాన్ని గొల్ల గట్టుకు చేర్చారు.

కాసింపేట యాదవులు పసిడి కుండను జాతరకు ముందే చర్చి లింగమంతుల స్వామి ఆలయం పై చివరి రోజు వరకు ఉంచుతారు. జాతరలో భాగంగా రెండవ రోజైన సోమవారము చౌడమ్మ తల్లికి బోనాలు స మర్పిస్తారు. గొర్రెను అమ్మవారికి బలిస్తారు. మూడవ రోజైన మంగళవారం స్వామివారి కల్యాణోత్సవంలో చంద్ర పట్నం వేస్తారు. మెంత బోయిన వారు తీసుకువచ్చిన పూజా సామాగ్రి తెల్లపిండి పచ్చపెండి పసుపు కుంకుమలతో చంద్రపట్నం వేస్తారు. యాదవ్ వంశీయులు స్వామివారి కల్యాణం జరిపిస్తారు. దీంతో చంద్ర పట్నం స్వామి వారి కళ్యాణం తంతు ముగుస్తుంది. నాలుగవ రోజు కేసారం నుంచి పాలు తీసుకువచ్చి రెండు కొత్త బోనం కుండలలోపొంగిస్తారు. అనంతరం గొర్రెను బలిస్తారు. ఐదవ రోజైన గురువారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. జాతర తంతు పూర్తయిన తర్వాత భక్తులు చివరగా మొక్కులు చెల్లించి ఇంటికి బయలుదేరుతారు. దీంతో జాతర ముగుస్తుంది. ఆదివారం జాతర ఏర్పాట్లను అదనపు కలెక్టర్ రాంబాబు అదనపు ఎస్పీ నాగేశ్వరరావు పరిశీలించారు. ఎక్కువమంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అంతా సమన్వయంతో పనిచేయాలని భక్తులందరూ దైవ దర్శనం చేసుకునేలా చూడాలన్నారు. జాతరలో చిన్న పిల్లలతో పనిచేయిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గుర్తించాలని కార్మిక శాఖ అధికారులను అదనపు కలెక్టర్ రాంబాబు ఆదేశించారు. మొదటిరోజు భక్తులు చేసుకున్నారు. ఉదయం నుండి ఆలయానికి చేరుకుని పరిసర ప్రాంతాలను సందర్శించి ఆనందోత్సవాలతో జాతరలో పాల్గొన్నారు. పూజల్లో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు అయ్యారు. జాతర వద్ద భద్రత ఏర్పాట్లను ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అదనపు ఎస్పి నాగేశ్వరరావు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా పెద్దగట్టు జాతర సందర్భంగా సోమవారము ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలకు స్థానిక సెలవును ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీగా రిజర్వేషన్ల మార్పు

## సానికంగా పట్టు కోసం రూటు మార్చుకుంటున్న ఆశావహులు

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధమేనంటున్న ఎన్నికల సంఘం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 16:** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు భారీగా మారనుండటంతో ఆశావహుల్లో సమీకరణాలు మారనున్నాయి. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు గత ప్రభుత్వం రెండు దఫాలకు వర్తించేలా పంచాయతీరాజ్ చట్టం (2018) తీసుకొచ్చినా డిసెంబరులో నిర్వహించిన శాసనసభ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు 2024కు ఆమోదం లభించడంతో ఒకే దఫా మాత్రమే రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంది. అయితే డెడికేటెడ్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, త్వరలోనే ఎన్నికలకు షెడ్యూల్ వెలువడుతుందని ఆశావహులు భావించారు. కానీ వివిధ వర్గాల నుంచి వచ్చిన అభ్యర్థనలకు పరిగణలోకి తీసుకుని రెండో విడత కులగణన సర్వే నిర్వహించాలని నిర్ణయించింది.

ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు కొంత కాలం పాటు వాయిదా పడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్లు ఇతర అంశాలకు సంబంధించి హైకోర్టులోనూ కేసు విచారణ సాగుతున్న విషయం తెలిసిందే. న్యాయస్థానానికి ఆయా విషయాలపై వివరణ ఇవ్వాల్సి ఉంటుందని, జిల్లా నుంచి గ్రామస్థాయి వరకూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించింది. కులగుణనలో రెండో విడతలో వివరాల సేకరణ, పరిశీలన, ఆ తర్వాత కేబినెట్ భేటీలో సమగ్ర నివేదిక ఆమోదం, అనంతరం అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి, బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు చట్టబద్ధత కల్పించేలా బిల్లు పెట్టి కేంద్రానికి, పార్లమెంట్‌కు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.

**ఆశావహుల్లో తర్జనభర్జన**

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదివరకు ఉన్న రిజర్వేషన్ ఉండకపోవచ్చు. జెడ్‌పి చైర్మన్ నుంచి సర్పంచ్ స్థానాల వరకు రిజర్వేషన్లు మారనున్నాయి. రిజర్వేషన్ల కేటాయింపుల్లో తొలుత ఎస్‌టిలకు రిజర్వు స్థానాలు కేటాయిస్తారు. ఎస్‌టి తరువాత ఆ స్థానంలో రొటేషన్ పద్ధతిలో ఎస్‌సి,అనంతరం బిసికి రిజర్వు చేస్తారు. అయితే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల అంశం కోర్టు పరిధిలో ఉంది. న్యాయస్థానం ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ ఉండనున్నది.

ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ మారనుండటంతో పోటీకి ఆసక్తి ఉన్న అభ్యర్థులలో కొత్త రిజర్వేషన్ ఎలా ఉంటుందనే విషయంపై ఆసక్తి నెలకొంది. రిజర్వేషన్‌పై స్పష్టత లేకపోవడంతో ఆశావహులు తర్జనభర్జన పడుతున్నారు. రిజర్వేషన్లు మారనుండటంతో చాలామంది ఆశావహులు ప్రజలతో మమేకమయ్యేందుకు తమ పంథాను మార్చుకుంటున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు, ఇతర పనులతో ఆశావహులు ప్రజలకు దగ్గరవుతున్నారు. ఇంకొందరు పార్టీ పరంగా బరిలోకి దిగేందుకు కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతున్నారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల పనుల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ,రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఇసి) పూర్తిస్థాయిలో నిమగ్నమైంది.

# పంట రుణాల్లో నాబార్డు కోత

## లక్ష్యాలకే కేటాయింపులు పరిమితం

## సాగు పెరుగుతున్నా మంజూరు అంతంతే

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** పంట రుణాల విషయంలో జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) ఎంచుకున్న లక్ష్యాలు క్షేత్ర స్థాయిలో అందుకోవడం లేదు. ఇదే సమయంలో రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు కొన్నేళ్లుగా గణనీయంగా పెరుగుతుండగా, అందుకు అనుగుణంగా రైతుకు ఇచ్చే రుణాల విషయంలో మాత్రం బ్యాంకులు లక్ష్యాలకు దూరంగానే ఉంటున్నాయి. 2025-26 సంవత్సరానికిగాను తెలంగాణలో 3.86 లక్షల కోట్ల రూపాయలను రుణాలగా ఇవ్వగలనే లక్ష ్యంగా పెట్టుకున్నప్పటికీ ఇందులో కేవలం పంటలకు సంబంధించి పంట ఉత్పత్తి, నిర్వహణ నిమిత్తం 87,149 కోట్ల రూపాయలను మాత్రమే కేటయింపులు జరిపింది. ఈ మొత్తం 2024-25లో పెట్టుకున్న రూ.90,794 కోట్ల లక్ష ్యం కంటే 3,645 కోట్ల రూపాయలు తక్కువ కావడం విశేషం. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరంలో 2024-25 లక్ష్యాని కన్నా 3,645 కోట్ల రూపాయలను తక్కువగా రుణ అంచనాగా కేటాయింపులు జరిపినట్లు వెల్లడించినప్పటికీ నాబార్డ్ అంతకుముందు మూడేళ్ల కూడా పంటలకు ఇచ్చే రుణాల విషయంలో లక్ష్యాలను చేరుకోలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 73,437 కోట్ల రూపాయల మేర రుణ లక్ష ్యం విధించుకోగా 64,939 కోట్ల రూపాయల చొప్పున మాత్రమే రుణాలను మంజూరు చేశాయి. అంటే 8,500 కోట్ల రూపాయలు తక్కువ ఇచ్చింది. అలాగే 2024-25లో 90,794 కోట్ల రూపాయల లక్ష ్యంగా పెట్టుకోగా, ఇందులో 70 శాతం మాత్రమే రుణాలు మంజూరయ్యాయి. 2021-22లో పంట రుణాల కింద 59,440 కోట్ల రూపాయలు లక్ష ్యంగా నిర్ణయించుకొని కేవలం 42,854 కోట్లు రూపాయలను మాత్రమే మంజూరు చేసింది. 2022-23లో 67,764 కోట్ల రూపాయల లక్ష్యాలకుగాను 59,060 కోట్ల రూపాయలు వరకే పంపిణీ చేసింది.



కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్‌తో ఎపి మంత్రి సవిత

# ఎపిలో చేనేతకు అండగా నిలవండి

## కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌తో మంత్రి సవిత

**విజయవాడ, ఫిబ్రవరి 16, ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ను మంత్రి సవిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలో జరుగుతున్న భారత్ టెక్స్ 2025లో ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ నుద్దేశించి భారత మండపంలో ఆదివారం ప్రధాని నరేంద్రమోడీ ప్రసం గించారు. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంతి సవిత ఆయనను కలిశారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర చేయూతనందించాలని ఆమె కోరారు. గడిచిన 5 ఏళ్ల నాటి పాలకుల అసమర్థత కారణంగా ఏపీలో చేనేత పరిశ్రమ నిర్వీర్యమైపోయిందన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించకపోవడంతో పాటు జగన్ ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లభించకపోవడంతో లక్షలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. చేసిన అప్పులు తీర్చలేక, ఉత్పత్తులు అమ్మకానికి నోచుకోక ఎందరో నేతన్నలు బలవన్మరణాలకు సైతం పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. 2024 ఎన్నికల్లో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత నుంచి చేనేత రంగానికి మంచిరోజులు ప్రారంభమయ్యాయన్నారు. కొద్ది నెలల కిందటే నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చామన్నారు. 2014- 19 మధ్య ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం అమలు పథకాలన్నింటినీ మరోసారి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వాటితో చేనేత వస్త్రాలపై జీఎస్టీ మినహాయింపునకు సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారన్నారు. నేతన్నలకు 365 రోజులు పని కల్పించాలన్న లక్ష్యంతో నూతన టెక్స్ టైల్స్ పార్కులు, వీవర్ శాలలు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం అండగా ఉంటే నేతన్నలకు మరింత ఆర్థిక భరోసా కలిగించే అవకాశముంటుందని కేంద్ర మంత్రి గిరిరాజ్ దృష్టికి మంత్రి సవిత తీసుకెళ్లారు. రాష్ట్రంలో చేనేత రంగంలో పెట్టుబడులకు సాయమందించాలని కోరారు. మంత్రి సవిత వినతులపై కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ సానుకూలంగా స్పందించారు. మంత్రి సవిత వెంట రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

# ‘నెయ్యి’ టెండర్లలో ‘రింగ్ మాస్టర్’లు ఎవరు?




## ఇద్దరు ముఖ్యులకు నోటీసులు జారీ

## కేసు నేడు కొత్తమలుపు తిరిగే అవకాశం, మరికొందరు అరెస్టు?

**తిరుమల, ఫిబ్రవరి 16ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారిలడ్డూల తయారీకి అవసరమైన నెయ్యిసరఫరా టెండర్లు దక్కించుకుని చివరకు కల్తీనెయ్యి పంపిన కేసు విచారణలో కీలక పరిణా మాలు చోటుచేసుకుంటున్నాయి. కల్తీనెయ్యి పాపంలో ఎవరున్నారనే అంశంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టిన సిబిఐ సిట్ అధికారులు ఇప్పటికే పాత్రధారులైన ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తర ప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, షోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక)సిఇఒ అపూర్వ వినయ్‌కాంత్ చావ్డాలను అరెస్టుచేయడం, ఐదురోజులు కస్టడీకి తీసుకోవడం తెలిసిందే.వీరిని తిరుపతి అలిపిరిలోని పాత ఎస్వీబిసి కార్యాలయం ప్రాంగణం భవనం లోని పైఅంతస్థులో ప్రత్యేక గదుల్లో ఉంచి వేర్వే రుగా సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్‌ప్రభు, డిఐజి మురలీరాంభా ప్రశ్నలతో కూడిన విచారణ చేపట్టారు. విచారణలో చాలావరకు పొంతనలేని సమాధానాలు ఇవ్వడం, తమకు గుర్తులేదు, అప్పట్లో ఎవరో చెప్పారు, మేం నెయ్యిపంపాము అనే వివరాలు ఇవ్వడంతో సిబిఐ సిట్ అధికా రులు ఖంగుతినే పరిస్థితి నెలకొంది. కస్టడీలో మూడవరోజు ఆదివారం ఉదయంనుండి కూడా కల్తీనెయ్యిలో పాత్రధారులుగా ఉన్న నిందితులనుండి సమాధానాలు రాబట్టి సూత్రధారులు ఎవరనేది దాదాపుగా కొలిక్కివచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పుడు అసలు ఈ మూడు డైరీలకు నెయ్యిసరఫరాకు టెండర్లు ఇప్పించింది ఎవరు, ఎక్కడ నుండి నెయ్యి సరఫరా చేసేలా ట్యాంకర్లు పంపారు, అసలు సామర్థ్యం లేకపోయినా ఎందుకు అనుమతించారు అనేది ఇద్దరు ప్రధాన ముఖ్యులను సిబిఐ సిట్ అధికారులు నోటీసులు ఇచ్చి విచారణ చేయడానికి సిద్ధమయ్యారు. రేపు (సోమవారం)ఈ విచారణలో మరింత కీలక మలుపుతిరిగే సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో టిటిడిలో కీలకంగా వ్యవహరించిన అధికారితోబాటు తమిళనాడుకు చెందిన గత పాలకమండలిలో కీలకమైన ముఖ్యుడిని విచారణ చేయడానికి సిద్ధమవుతున్నారు. వీరి విచారణ సమయంలోనే కారకులైన ఇంకొందరిని నేరుగా అరెస్టుచేసే అనూహ్య పరిణామాలు, కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యిసరఫరా చేశారని గతంలోనే తీవ్రసంచలనం రేకెత్తించింది. ఈ కేసులో సిబిఐ విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

**అంతా ఒకటే సమాధానం:**

సిబిఐ సిట్ అధికారుల కస్టడీలో ఉన్న నలుగురు నిందితులు సిబిఐ సిట్ అధికారుల ప్రశ్నలకు ఒకటే సమాధానం చెబుతున్నారనేది మరింత విస్తుబోయే అంశం. అసలు తొలిరోజుల్లో టెండర్లు వేయాలని ఎవరు చెప్పారు?ఆ డైరీలకు నెయ్యిసరఫరా చేసే అర్హత లేకున్నా టిటిడికి అవసరమైన పెద్దమొత్తంలో నెయ్యి సరఫరా చేస్తామని ఎలా ఒప్పుకున్నారనే ప్రశ్నలకు సమాధానాలు రాకపోగా ఇద్దరు కీలకంగా సహకరించారనేది సిబిఐ సిట్‌కు తెలిసిన సమాచారం. ఒక దశలో తాము నెయ్యిసరఫరానే చేయలేదనే సమాధానాలు నిందితులు వెల్లడించడం మరింత ఆశ్చర్యం కలిగించింది. కల్తీనెయ్యి విచారణలో ఇప్పటికే ఇద్దరు కీలకంగా సూత్రధారులుగా వ్యవహరించారని సిబిఐ సిట్ నిర్ధారణకు వచ్చేసింది. విచారణలో మరింతముందుకు వెళ్ళేందుకు స్థానిక పోలీసు అధికారుల సహకారం తీసుకుంటుంది. టిటిడి మార్కెటింగ్ విభాగం, కొనుగోళ్ళు విభాగంలో ,పోటు,విజిలెన్స్‌కు సంబంధించి 12మంది అధికారులు ప్రమేయం ఉందని సిట్ గుర్తించింది.

ఈనెలాఖరుకు టిటిడిలో నెయ్యి సరఫరా టెండర్లు, కల్తీనెయ్యి బాగోతం ఒక కొలిక్కి రావచ్చని తెలుస్తోంది. ఈదశలోనే నిందితుల తరపున న్యాయవాదులు బెయిల్ మూవ్‌చేసేందుకు అవసర మైన అన్ని చర్యలు తీసుకుంటున్నారనేది అర్థమవుతోంది. పలువురు స్థానిక న్యాయవాదులతోబాటు చెన్నై నుండి కూడా న్యాయవాదులు తిరుపతికి చేరుకుని సిబిఐ సిట్ అధికారులను కలసి ఎఫ్ఐఆర్ కాపీలు, ఎలాంటి సెక్షన్లుపెట్టారనే వివరాలుతెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. 18వతేదీ కస్టడీముగించి నిందితులను కోర్టులో హాజరుపరిచే సమయంలో బెయిల్ పిటిషన్లు ముందుకు తీసుకెళ్లాలనేది వారి మాటల్లో తెలుస్తోంది.

# తెలంగాణ దశ, దిశను మార్చి రాష్ట్రానికి తరగని ఆస్తులు సృష్టించాం

## కేంద్ర అప్పులన్నీ కార్పొరేట్ శక్తుల లక్షల కోట్ల రుణాల మాఫీ కోసమే

## తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్న బిజెపిని ప్రజలు క్షమించరు

## కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు కెటిఆర్ బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 16:** స్వాతంత్రం వచ్చిన నాటినుంచి 14 మంది ప్రధానులు 65 యేళ్లలో 56 లక్షల కోట్లు అప్పు చేస్తే.. 2014 నుంచి 2024 వరకు కేవలం పదేళ్లలోనే రూ.125 లక్షల కోట్ల అప్పు చేసిన బీజేపీ ప్రభుత్వానికి అప్పులపై మాట్లాడే నైతికహక్కే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణను బలవంతంగా ఆంధ్రలో కలిపిననాడు కూడా తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రమేనని కేటీఆర్ స్పష్టంచేశారు. 2014లో తెలంగాణ ఏర్పడిన సమయంలోనూ రాష్ట్రానికి దాదాపు రూ.70వేల కోట్ల వరకు అప్పు ఉన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. అలాగే బీఆర్ఎస్ పదేళ్ల పాలన తరువాత కూడా తెలంగాణను మిగులు బడ్జెట్ రాష్ట్రంగానే కాంగ్రెస్‌కు అప్పజెప్పామని కేటీఆర్ తేల్చిచెప్పారు. అసలు అప్పులను, మిగులు బడ్జెట్‌తో ముడిపెట్టడం సమంజసం కాదన్నారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుగా తెచ్చిన ప్రతి పైసాను పెట్టుబడిగా మార్చి తెలంగాణ నేలపై విప్లవాత్మకమైన మార్పు తీసుకువచ్చిన విషయాన్ని యావత్ దేశం చూసిందని గుర్తు చేశారు. సమైక్యరాష్ట్రంలో తీవ్ర విధ్వంసానికి గురైన తెలంగాణ ముఖచిత్రాన్ని, తెలంగాణ ప్రజల బతుకు చిత్రాన్ని సమూలంగా మార్చి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పదేళ్లలో తెచ్చిన రూ.125 లక్షల కోట్ల అప్పుతో ఏం చేశారో చెప్పే పరిస్థితి లేదని, కానీ తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన అప్పుతో దశాబ్దాలపాటు ఈ నేలను పట్టి పీడించిన తాగు, సాగునీటి కష్టాలను శాశ్వతంగా నిర్మూలించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను నిర్మించామని తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలో.. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి చేసిన అప్పును తప్పుగా చూపించే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేటిఆర్ తెలిపారు. తెచ్చిన అప్పులతో సంపద సృష్టించే బృహత్తర కార్యక్రమాలు చేపట్టడమేనని కుండబద్దలు కొట్టారు. అటు కేంద్ర బడ్జెట్‌లో, ఇటు రైల్వే కేటాయిం పుల్లో బీజేపీ సవతి ప్రేమ కనబరుస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. అధికారంలోకి రాగానే తెలంగాణలోని ఏడు మండలాలను, లోయర్ సీలేరు విద్యుత్ ప్రాజెక్టును లాక్కొని కొత్తగా ఏర్పడిన రాష్ట్రం గొంతుకోసిన విషయాన్ని పదేళ్లు గడిచినా తెలంగాణ ప్రజలు మరిచిపోలేదని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్రం ఖజానా నింపే తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటాను ఇవ్వాలని, విభజన హక్కులను నెరవేర్చాలని అడిగిన పాపానికి కేంద్ర మంత్రి పియూష్ గోయెల్, తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో.. కేంద్ర ప్రభుత్వ ఖజానా నింపే స్థాయికి తెలంగాణను తీర్చిదిద్దినందుకు తెలంగాణకు మీరిచ్చే బహుమానం ఈ అవమానాలేనా అని కేటిఆర్ ప్రశ్నించారు. దేశ అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంట్ లో ఇచ్చిన హామీలకు దశాబ్దం గడిచినా మోక్షం లేకపోవడం నయవంచన కాదా అని ప్రశ్నించారు. కేవలం గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాటి అప్పులపై బురదజల్లి తప్పించుకోలేరని, బీజేపీ చేసిన తప్పులను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ క్షమించరని కేటిఆర్ తేల్చిచెప్పారు.

# చాలా కాలం తరువాత ఓ మంచి పాత్రను చేశాననే సంతృప్తి కలిగింది: 'బ్రహ్మా ఆనందం' సక్సెస్ మీట్‌లో బ్రహ్మానందం



**మళ్ళీ రావా,** ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద వంటి హ్యాట్రిక్ హిట్ల తరువాత స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి 'బ్రహ్మా ఆనందం' అనే చిత్రం ఫిబ్రవరి 14న వచ్చింది. పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్రహ్మానందం, అతని కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో ప్రియా వడ్లమాని, ఐశ్వర్యహోలక్కల్ కీలక పాత్రల్లో కనిపించారు. సావిత్రి, ఉమేష్ కుమార్ సమర్పణలో ఈ చిత్రాన్ని రాహుల్ యాదవ్ నక్కా నిర్మించగా.. నూతన దర్శకుడు నిఖిల్ అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రానికి ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో నేడు చిత్రయూనిట్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డ్ గ్రహీత డా.బ్రహ్మానందం మాట్లాడుతూ,'బ్రహ్మా ఆనందం' సినిమాను చూసిన వారంతా మా అబ్బాయి గురించే మాట్లాడుతున్నారు. మీ కన్నా.. మీ అబ్బాయి బాగా చేశాడని మెచ్చుకుంటూ ఉంటే తండ్రిగా నాకు చాలా సంతోషంగా అనిపించింది. కొత్త పాత్రలను చేయాలనే ఎప్పుడూ కోరుకుంటాను. నన్ను అభిమానించే ఆడియెన్స్‌కు ఏదైనా కొత్తగా అనిపించాలనే ఉద్దేశంలోనే సినిమాను చేస్తుంటాను. చాలా కాలం తరువాత ఓ మంచి సినిమాను, మంచి పాత్రను చేశాననే సంతృప్తి కలిగింది. ఆడియెన్స్‌ని థియేటర్లకు రప్పించే గొప్ప అంశాలేమీ ఇందులో లేవు. నేను, వెన్నెల కిషోర్, స్వధర్మ్ ఎంటర్టైన్మెంట్, నా కొడుకు రాజా గౌతమ్‌లు మాత్రమే ఉన్నారు. మీరు చాలా రోజుల తరువాత కనిపిస్తున్నారు కదా? అందుకే థియేటర్లకు జనాలు వస్తున్నారు అని చాలా మంది చెబుతుంటే ఆనందంగా ఉంది. ఎప్పుడూ ఒకే రకమైన పాత్రలు కాకుండా రంగమార్తాండ లాంటి కారెక్టర్లు చేయాలని అనుకుంటున్నాను. డైరెక్టర్లే నన్ను కొత్తగా చూపించే ప్రయత్నం చేయాలి. నా మీద ప్రేమతో యంగ్ దర్శకులు వచ్చి.. ఒక్క రోజు పాత్ర ఉంది.. చేయండి సర్ అని అడుగుతుంటారు. అలా చేయడం వల్ల నాకు వచ్చిన నష్టం ఏమీ లేదు కదా?.. నేను ఆ పాత్ర చేస్తే వాళ్లకి ఉపయోగపడుతుంది కదా? అని నేను చిన్న పాత్రల్ని అయినా చేస్తున్నాను. నా కోసం ఇంత మంది థియేటర్‌కు వచ్చి సినిమా చూస్తున్నారు అని తెలిసి ఎంతో ఆనందమేస్తోంది అని అన్నారు.

హీరో రాజా గౌతమ్ మాట్లాడుతూ,'బ్రహ్మా ఆనందం' సినిమాను చూసిన వారంతా నా గురించి మాట్లాడుతున్నారు. మా నాన్న ఇంట్లోనూ నాతో పాటు సరదాగా ఉంటారు. స్క్రీన్ మీదకు వచ్చే సరికి మాత్రం చాలా సీరియస్‌గా ఉండేది. మా నాన్న ఎప్పుడూ కూడా మా మీద ఒత్తిడి పెంచలేదు. అలా ఎందుకు చేశావ్.. ఇలా ఎందుకు చేశావ్ అని కాకుండా.. అన్నీ మా నిర్ణయాలకే ఆయన వదిలేస్తుంటారు. మళ్లీ ఇప్పుడు రాహుల్‌తోనే ఓ సినిమాను చేస్తున్నాను. వైబ్ సినిమాలో మరింత కొత్తగా కనిపిస్తాను. మను తరువాత ధూత చేశాను. ఆ తరువాత బ్రేక్ అవుట్ చేశాను. మళ్లీ ఇప్పుడు ఈ మూవీని చేశాను. కంటిన్యూ పని అయితే చేస్తూనే ఉన్నాను. నేను పెట్టే ఎఫర్ట్స్‌ను మాత్రం నాన్న గమనిస్తూనే ఉంటారు అని అన్నారు.నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా మాట్లాడుతూ,నేను నిర్మించిన గత చిత్రాలు మంచి మౌత్ టాక్‌తోనే హిట్ అయ్యాయి. ఈ మూవీకి మంచి మౌత్ టాక్ వచ్చింది. ఇప్పటి వరకు అన్ని చోట్లా షోలు ఫుల్ అవుతున్నాయి. మీడియా సహకారంతో ఇంకా ముందు వెళ్తుందని ఆశిస్తున్నాను అని అన్నారు.

# హైదరాబాద్‌లో 'విశ్వంభర' చిరంజీవి ఇంట్రో సాంగ్ షూటింగ్



**మెగాస్టార్ చిరంజీవి** హైలీ యాంటిసిపేటెడ్ సోషియో ఫాంటసీ ఎంటర్టైనర్ 'విశ్వంభర' సినిమా టీజర్ విడుదలైన తర్వాత హ్యూజ్ బజ్ క్రియేట్ చేసి, ఈ సినిమా కోసం రూపొందించిన మెస్మరైజింగ్ వరల్డ్ కోసం ఓ అవగాహన కల్పించింది. ప్రతిష్టాత్మక యువి క్రియేషన్స్ బ్యానర్ పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ సినిమా గ్రేట్ విజువల్ వండర్‌గా రూపొందుతోంది.సినిమా ప్రొడక్షన్ పూర్తి కావస్తోంది, తాజా షెడ్యూల్‌లో చిరంజీవి ఇంట్రడక్షన్ సాంగ్ హైదరాబాద్ లోని శంకర్‌పల్లిలో ఒక అద్భుతమైన సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఈ పాట కోసం ప్రొడక్షన్ డిజైనర్ ఎఎస్ ప్రకాష్ ఓ మ్యాసీవ్ సెట్‌ని రూపొందించారు.ఎంఎం కీరవాణి ఈ పాట కోసం పవర్ ఫుల్ మాస్ అంథమ్ కంపోజ్ చేయగా, రామజోగయ్య శాస్త్రి సాహిత్యం రాశారు. ప్రఖ్యాత కొరియోగ్రాఫర్ శోభి మాస్టర్ డ్యాన్స్ మూమెంట్స్‌ని పర్యవేక్షిస్తున్నారు. సాంగ్ షూట్ నుంచి విడుదలైన ఇమేజ్ చిరంజీవిని కూల్ అండ్ స్టైలిష్‌గా, షేడ్స్‌తో కారు దిగి షార్ప్ లుక్స్ తో ప్రజెంట్ చేస్తోంది. బ్లాక్‌బస్టర్ బింబిసారతో అద్భుతమైన అరంగేట్రం చేసిన దర్శకుడు వశిష్ట 'విశ్వంభర' కోసం అహర్నిశలు కష్టపడుతున్నారు. ఇది తన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా భావిస్తాన్నారు. తన అభిమాన హీరో చిరంజీవితో కలిసి ఒక అద్భుతమైన ప్రపంచాన్ని సృష్టించారు, ఇది ఒక విజువల్ వండర్ అని హామీ ఇస్తోంది. అగ్రశ్రేణి విఎఫ్ఎస్ హైఆక్టేన్ యాక్షన్, ఎమోషన్స్ ఆకట్టుకునే డ్రామాను బ్లెండ్ చేస్తోంది. ఈ చిత్రంలో త్రిషకృష్ణన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు, కునాల్‌కపూర్ ఒక ముఖ్యమైన పాత్రను పోషించారు. సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు అద్భుతమైన విజువల్స్ అందిస్తుండగా, లెజెండరీ ఎంఎం కీరవాణి ఈ ప్రాజెక్ట్‌కు సంగీతం సమకూరుస్తున్నారు.

# 'శంబాల' నుంచి అర్చన అయ్యర్ ఫస్ట్ లుక్ విడుదల..



**విమర్శకుల** ప్రశంసలు పొందిన కృష్ణమ్మ చిత్రంలో తన పాత్రతో అందరినీ ఆకట్టుకున్నారు అర్చన అయ్యర్. ప్రస్తుతం అర్చన అయ్యర్ సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ 'శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్'లో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం మేకర్లు ఈ చిత్రంలోని ఒక్కో క్యారెక్టర్‌ను రివీల్ చేస్తూ వస్తున్నారు. ఆది సాయికుమార్, స్వాసిక పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్లకు మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇక తాజాగా అర్చన అయ్యర్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. దేవీ పాత్రలో అర్చన అయ్యర్ ఇంటెన్స్ లుక్‌లో కనిపించారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో అర్చన ఎరుపు చీరలో కనిపిస్తోంది. ఇంటెన్స్ ఎమోషన్స్‌ను పలికిస్తూ కనిపించింది. బ్యాక్ గ్రౌండ్‌లో పంట, గుడి, పక్షులు, దిష్టిబొమ్మ ఇలా అన్నీ కూడా చాలా క్యూరియాసిటీని పెంచేలా ఉన్నాయి. పోస్టర్లతోనే అందరిలోనూ ఆసక్తిని పెంచేస్తోంది చిత్రయూనిట్.

యుగంధర్ ముని దర్శకత్వంలో షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రామిసింగ్ హీరో ఆది సాయికుమార్ జియో సైంటిస్ట్ పాత్రను పోషిస్తున్నారు. అత్యున్నత నిర్మాణం, సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో ఈ చిత్రం ఉండబోతోంది. ప్రత్యేకమైన కథ, గ్రిప్పింగ్ కథనం, హై స్టాండర్డ్స్ వీఎఫ్ఎక్స్‌తో ఆడియెన్స్‌కు గొప్ప అనుభూతిని అందించబోతున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది.

# 'బ్యూటీ' టీజర్ విడుదల..



**వానరా సెల్యులాయిడ్** ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో ఆడియెన్స్‌ను మెప్పించబోతోంది. మైథలాజికల్ థ్రిల్లర్ త్రిబాణధారి బార్బారిక్ సినిమాతో త్వరలోనే ఆడియెన్స్ ముందుకు రాబోతున్నారు. లవ్, యూత్ ఫుల్ ఎంటర్టైన్మెంట్‌ను అందించేందుకు మారుతి టీం ప్రొడక్ట్‌తో కలిసి బ్యూటీ చిత్రాన్ని నిర్మిస్తోంది. జీ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి గీతా సుబ్రమణ్యం, హలో వరల్డ్, భలే ఉన్నాడే ఫేమ్ వర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కేఆర్ బన్సాల్ నిర్మించిన ఈ చిత్రంలో అంకిత్ కొయ్య,నీల పాత్ర ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమాకు బి.ఎస్. రావు ఎగ్జిక్యూటివ్ నిర్మాత. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ అందరిలోనూ ఈ సినిమా పట్ల ఆసక్తిని పెంచింది. ఇక వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ 'బ్యూటీ' బ్యూటీ టీజర్ మరింతగా ఆసక్తిని పెంచేసింది. బ్యూటీ టీజర్ ఎంతో బ్యూటీఫుల్‌గా, ఎంతో ప్లెజెంట్‌గా ఉంది. ఓ అందమైన ప్రేమ కథతో పాటు, మిడిల్ క్లాస్ ఎమోషన్స్‌ని కూడా చూపించబోతున్నారనిపిస్తోంది. ఈ టీజర్‌లో అంకిత్ కొయ్య, నీల పాత్రలు.. తండ్రిగా నరేష్, తల్లిగా వాసుకి పాత్రల్ని కూడా చూపించారు.టీజర్ చూస్తుంటే ఓ స్కూటీ చుట్టూనే ఈ కథ తిరిగేలా ఉంది. స్కూటీ వచ్చాకా? ఏం జరుగుతుంది? అసలు హీరోయిన్ స్కూటీని ఎందుకు అడుగుతోంది..? ఆ స్కూటీ వచ్చాక హీరోయిన్‌లో వచ్చే మార్పులు ఏంటి? ఈ ప్రేమ కథలో ఎలాంటి ట్విస్టులు వస్తాయి.. అనే ఆసక్తికరమైన ప్రశ్నలు తలెత్తేలా టీజర్‌ను బ్యూటీఫుల్‌గా కట్ చేశారు. ఇక టీజర్‌లో విజువల్స్, ఆర్ఆర్ ఎంతో ఆహ్లాదకరంగా అనిపిస్తున్నాయి. లైఫ్‌లో నిన్ను ఇంకేం అడగను అనే డైలాగ్‌కు సినిమాలో చాలానే ఇంపార్టెన్స్ ఉందనిపిస్తోంది.

# 'హే చికితా' షూటింగ్ ప్రారంభం



**అమరావతి** మూవీ మేకర్స్, సుందరకాండ మోషన్ పిక్చర్స్ బ్యానర్ల పై ఎన్. అశోకఆర్ ఎన్ యస్, 'గరుడవేగ' అంజి కలిసి భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న చిత్రం "హే చికితా". యువ దర్శకుడు ధన్‌రాజ్ లెక్కల, కథ, కథనం, దర్శకత్వంతో నూతన దర్శకుడుగా పరిచయం అవుతున్నాడు. ఈ చిత్రంలో వైఫ్ ఆఫ్ ఫేమ్ అబినవ్ మణికంట, దివిజ ప్రభాకర్, తన్మయి హీరో, హీరోయిన్లగా నటిస్తుండగా, 30సం. పృథ్వీ రాజ్, డైరెక్టర్ దేవి ప్రసాద్, ప్రభాకర్, డైరెక్టర్ వీర శంకర్, బలగం సుజాత, సాయినాయుడు, అశోక్‌వర్ధన్, నేత, సాయికౌశిక్, క్రాంతి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇతర ముఖ్యమైన పాత్రలో మై విలేజ్ షో అంజి మామ, గంగవ్వ, రాజశేఖర్ నటిస్తున్నారు. ఈ మూవీ టైటిల్ ని డైరెక్టర్ అజయ్ భూపతి లాంచ్ చేశారు. అనుసూయ భరద్వాజ్, సాయిరాజేష్ ,వశిష్ట ఎన్ సింహా సోషల్ మీడియా వేదికగా రివిల్ చేశారు. అందరికీ వాలెంటైన్స్ డే విషెష్ తెలుపుతూ ఈ చిత్రం షూటింగ్ ఈ రోజు నుంచి ప్రారంభమైయింది. తెలంగాణ, ఆంధ్రాలోని పలు అద్భుతమైన లొకేషన్‌లో శర వేగంగా షూటింగ్ జరుపుకోనుంది. చరణ్ అర్జున్ అద్భుతమైన సంగీతాని అందించిన ఈ చిత్రానికి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా 'గరుడవేగ' అంజి చేయనున్నారు. ఎడిటర్‌గా మధు పని చేస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రవిందర్ బెక్కం. నటీనటులు: అబినవ్ మణికంట, దివిజ ప్రభాకర్, తన్మయి, 30సం. పృథ్వీ రాజ్, డైరెక్టర్ దేవి ప్రసాద్, ప్రభాకర్, డైరెక్టర్ వీరశంకర్, బలగం సుజాత, సాయి నాయుడు, అశోక్ వర్ధన్, నేత, సాయికౌశిక్, క్రాంతి, మై విలేజ్ షో అంజి మామ, గంగవ్వ, రాజశేఖర్ తదితరులు.




# ఘనంగా 'త్రికాల' ట్రైలర్ లాంచ్ ఈవెంట్..

**రిత్విక్ వేట్లా** సమర్పణలో రాధిక, శ్రీనివాస్ నిర్మాతలుగా శ్రీ సాయిదీప్ చాట్లా, వెంకట్ రమేష్ దాడి సహ నిర్మాతలుగా త్రికాల సినిమాను మణి తెల్లగూటి తెరకెక్కిస్తున్నారు. శ్రద్దా దాస్, మాస్టర్ మహేంద్రన్, అజయ్, సాహితి అవంచ, ఆమని, ప్రభాకర్, అంబటి అర్జున్, రౌడీ రోహిణి వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'త్రికాల' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను చిత్రయూనిట్ నేడు ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అజయ్ మాట్లాడుతూ, మణి నాకు రెండు, మూడేళ్ల క్రితం త్రికాల కథ చెప్పారు. బడ్జెట్ ఎక్కువ అయ్యేట్టుంది ఎలా చేస్తారో అనుకున్నా. ఇంత వరకు నాకు ఏం చూపించలేదు. నేరుగా ఇక్కడే ట్రైలర్‌ను చూశాను. అద్భుతంగా వచ్చింది. మహేంద్రన్ అందరి కంటే చాలా సీనియర్. మంచి చిత్రాన్ని తీశాం. క్వాలిటీ అద్భుతంగా ఉంది. ఈ సినిమాను అందరూ సపోర్ట్ చేయండి అని అన్నారు.అంబటి అర్జున్ మాట్లాడుతూ,త్రికాల ట్రైలర్ చూశాక అందరికీ ఈ మూవీ ఏంటో అర్థం అవుతుంది. మణి నమ్మకం మీద ఈ మూవీ కోసం నిర్మాతలు భారీగా ఖర్చు పెట్టారు. ఈ చిత్రం అద్భుతంగా వచ్చింది. సినిమా టీంకు ఆల్ ది బెస్ట్ అని అన్నారు. మాస్టర్ మహేంద్రన్ మాట్లాడుతూ, మణి ఈ మూవీని అద్భుతంగా తీశాడు. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన మణికి థాంక్స్. అజయ్ చాలా మంచి యాక్టర్. ఆయనన్నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. రవి వర్మతో పని చేయడం ఆనందంగా ఉంది. సాహితి



చాలా మంచి వ్యక్తి. శ్రద్దా దాస్ ప్రతీ విషయాన్ని ఎంతో నిశితంగా పరిశీలిస్తారు. మా సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. సమ్మర్‌లో మా సినిమా రాబోతోంది. అందరూ మా చిత్రాన్ని సపోర్ట్ చేయండి అని అన్నారు. రవివర్మ మాట్లాడుతూ. త్రికాల ట్రైలర్ చాలా బాగుంది. చిన్న పాత్రగా మొదలైనా సినిమా అంతా నన్ను వాడేశారు. సినిమా అద్భుతంగా వచ్చింది. మధ్యలో ఎన్ని సమస్యలు వచ్చినా కూడా చివరివరకు నిలబడి దర్శక, నిర్మాతలు సినిమాను నిలబెట్టారు. ఈ చిత్రానికి అందరి సపోర్ట్ ఉండాలి అని అన్నారు.

సాహితి మాట్లాడుతూ, త్రికాలలో నటించడం ఆనందంగా ఉంది. ఈ మూవీ ట్రైలర్ అద్భుతంగా వచ్చింది. సినిమా కూడా అంతే అద్భుతంగా ఉంటుంది. నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. థియేటర్లో మా సినిమాను చూసి ఆదరించండి అని అన్నారు.దర్శకుడు మణి మాట్లాడుతూ,అజయ్ ఈ కథను ముందుగా చెప్పాను. త్రికాల సినిమాటిక్ యూనివర్స్ అని ట్రైలర్‌లో పెట్టాం. అంబటి అర్జున్ ఒక్క రోజే షూటింగ్ చేశారు. అదేంటో ఫ్యూచర్‌లో తెలుస్తుంది. సాహితి పాత్రను ఎక్కువగా రివీల్ చేయకూడదని అనుకున్నా. రూప కారెక్టర్ సర్ ప్రైజింగ్‌గా ఉంటుంది. సెట్‌లో రవివర్మ ఎప్పుడూ ఇది జరుగుతుందా? అని కంగారు పడుతుండేవారు. మా నిర్మాతలు రాధిక, శ్రీనివాస్ ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డారు. అజయ్ మాకు ఈ ప్రయాణంలో అండగా నిలబడ్డారు. మా చిత్రం సమ్మర్‌లో రాబోతోందిఅన్నారు. నిర్మాత రాధిక మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లాలి అని, మన సూపర్ హీరోల్ని అందరికీ చూపించాలని త్రికాల సినిమాను తీశాం. బ్యాట్ మ్యాన్, సూపర్ మ్యాన్, స్పైడర్ మ్యాన్‌లా మన త్రికాల ఉంటుంది. టైంతో సంబంధం లేకుండా కాపాడేవాడే త్రికాల. ఇంకా త్రికాల గురించి తెలియాలంటే సినిమాను చూడాల్సిందే. మాకు మీడియా, ఆడియెన్స్ సపోర్ట్ ఇవ్వాలని కోరుకుంటున్నాను అని అన్నారు. నిర్మాత శ్రీనివాస్ మాట్లాడుతూ, 'త్రికాల' మూవీకి సీజీ వర్క్ ఎక్కువగా అవసరం పడింది. అందుకే ఈ మూవీ లేట్ అవుతూ వచ్చింది. మన పురాణాల్లోనే హనుమాన్, భీమ్ వంటి సూపర్ హీరోలున్నారు. మనం ఓ ఫిక్షనల్ హీరోని సృష్టించాలని అనుకున్నాం. అలా పుట్టిందే ఈ త్రికాల. సమ్మర్‌లో ఈ మూవీని రిలీజ్ చేయబోతున్నామని అన్నారు.


# మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర' ప్రారంభం

**ప్రముఖ నిర్మాణ సంస్థ** జీ స్టూడియోస్ సమర్పణలో ఉమేష్ కె.ఆర్.బన్సాల్, ప్రేరణ అరోరా నిర్మాతలుగా నవ దళపతి సుధీర్ బాబు హీరోగా సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర' చిత్రం తెరకెక్కుతోంది. ఈ మూవీ పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో శనివారం నాడు జరిగాయి. ఈ కార్యక్రమానికి దర్శకుడు హరీష్ శంకర్, మైత్రీ నిర్మాత రవిశంకర్, దర్శకుడు వెంకీ అట్లూరి, దర్శకుడు మోహన ఇంద్రగంటి, శిల్పా శిరోద్కర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

జీ స్టూడియోస్ సీఈవో ఉమేష్ కేఆర్ బన్సాల్ మాట్లాడుతూ,జీ స్టూడియోస్‌లో రూపొందుతోన్న జటాధర థ్రిల్లింగ్ సూపర్ నేచురల్‌గా ఉండబోతోంది. ఈ ప్రాజెక్ట్ కోసం మరోసారి ప్రేరణ అరోరాతో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది. ప్రేక్షకులకు ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ని అందించే సినిమా ఇదిఅని అన్నారు.

జటాధర సినిమా కథ అనంత పద్మనాభ స్వామి ఆలయం చుట్టూ తిరుగుతుంది. అక్కడి సంపద, దాని చుట్టూ అల్లుకున్న వివాదాలు, నేపథ్యం, చరిత్ర ఇలా అనేక అంశాలను ఈ చిత్రంలో చూపించనున్నారు. అక్కడి నిధిని మాత్రమే కాకుండా ఆలయ చరిత్ర, పురాణా కథల్ని కూడా చూపించబోతోన్నారు. ఈ సినిమాలో సుధీర్ బాబు కారెక్టర్ చాలా భిన్నంగా ఉండబోతోంది.

'జటాధర' యాక్షన్‌ప్యాక్డ్ ఎంటర్టైనర్‌గా ఆడియెన్స్ ముందుకు రానుంది. థ్రిల్లింగ్, మిస్టరీ అంశాలతో 'జటాధర'ను ఉత్కంఠభరితంగా ఉండేలా తెరకెక్కిస్తున్నారు. జటాధరలో నిధికోసం పోరాటంజరుగుతుంది. కానీ పోరాడాలంటే కొన్ని శాపాల్ని ఎదుర్కో వాల్సి ఉంటుంది. ఆ పోరాటం ఏంటి? ఈ శాపం ఏంటి? అని తెలియాలంటే ఇంకొన్ని నెలలు వేచి చూడాల్సిందే.



# మార్చి 7న సోనీ లివ్‌లోకి రాబోతోన్న 'రేఖా చిత్రం'



**మలయాళ** క్రైమ్, థ్రిల్లర్, మిస్టరీ చిత్రాలు ఎంత ఉత్కంఠగా సాగుతాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ప్రస్తుతం ఇలాంటి ఓ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'రేఖా చిత్రం' సోనీ లివ్‌లో రాబోతోంది. ఈ చిత్రానికి జోఫిన్ టి. చాకో దర్శకత్వం వహించారు. కావ్య ఫిల్మ్ కంపెనీపై వేణు కున్నప్పిల్లి నిర్మించిన ఈ చిత్రానికి థియేటర్లలో మంచి రెస్పాన్స్ వచ్చింది. మాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 75 కోట్ల వసూళ్లను సాధించి రికార్డులు నెలకొల్పింది. మలక్కప్పర ప్రాంతంలో జరిగే ఘటనలు, పోలీసు ఇన్‌స్పెక్టర్ వివేక్‌ను కలవరపరిచే ఆత్మహత్య కేసు చుట్టూ ఈ కథ తిరుగుతుంది. అయితే ఆ కేసుని ఎంతకీ ఛేదించలేకపోతాడు. ఎటు వెళ్లినా కేసు ఓ కొలిక్కి రాదు. చివరకు ఈ కేసు. మరో కేసుకి లీడ్ ఇస్తుంది. సినిమా షూటింగ్, అందులో మిస్ అయిన ఓ వ్యక్తి.. పాతిపెట్టిన శవం దొరకడం వంటి ఘటనలతో ట్విస్టుల మీద ట్విస్టులు వస్తుంటాయి. గ్రిప్పింగ్ కథనం, ఊహించని మలుపులతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే ఈ చిత్రం సోనీ లివ్‌లోకి మార్చి 7న రాబోతోంది. ఈ సందర్భంగా ఆసిఫ్ అలీ మాట్లాడుతూ, వివేక్ పాత్రకు జీవం పోయడం, ఆ కారెక్టర్‌కు న్యాయం చేయడం నాకు ఓ పెద్ద సవాలుగా అనిపించింది. ఇలాంటి పాత్రలు పోషించడం అంత సులభం కాదు. ప్రేక్షకుల అంచనాలు, ఊహకు అందకుండా ఈ చిత్రం సాగుతుంది. వాస్తవానికి, ఊహకు మధ్య ఆడియెన్స్ నిజాన్ని కనిపెట్టేందుకు ప్రయత్నిస్తూనే ఉంటారు. థియేటర్లలో మా సినిమాకు అద్భుతమైన స్పందన లభించింది. మార్చి 7న సోనీ లివ్‌లోకి మా చిత్రం రాబోతోంది. ఓటీటీ ఆడియెన్స్‌ని కూడా మా సినిమా మెప్పిస్తుందని ఆశిస్తున్నాను అని అన్నారు.

# ట్రోఫీ గెలిచిన తొలి భారతీయురాలు




'జెట్ విమానం 2,500 అడుగుల ఎత్తులో వేగంగా ప్రయాణిస్తోంది. అంతలో ఇంజిన్ వేగం తగ్గింది. ఏ క్షణంలోనైనా విమానం అదుపు తప్ప వచ్చు. ఆలోగాసురక్షి తంగా ల్యాండ్ చేయాలి. పైలట్ దీన్ని సవాల్‌గా తీసుకుని రన్వే పైకి దింపగలిగింది'. అయితే ఇదంతా ఓ పోటీలో భాగమే. విపత్కర పరీక్షలో పైలట్ నైపుణ్యానికి ఇది. ఇందులో స్నేహ భాస్కరన్ విజేత మాత్రమే కాదు, ఈ ట్రోఫీని అందుకున్న తొలి భారతీయురాలు కూడా. 'అనుకొని ప్రమాదాలు ఎదురైనప్పుడు ఒత్తిడికి గురికాకుండా సరైన నిర్ణయం తీసుకుంటే విజయం మనదే'నని చెప్పే స్నేహాభాస్కరంది చెన్నై. చిన్నప్పటి నుంచి ఆకాశంలో ఎగిరే విమానాలను చూడమంటే ఇష్టం. సైన్స్ పై ఆసక్తి, జెనెటిక్ ఇంజినీరింగ్‌లో పట్టా తీసుకుంది. ఆపై కమర్షియల్ పైలట్ లైసెన్స్ కోసం 2023, జనవరిలో 'న్యూజిలాండ్ ఎయిర్‌లైన్ అకాడమీ'లో చేరింది. 'న్యూజిలాండ్‌లో 1963 నుంచి ఏటా ఈ అకాడమీ ఓ పోటీని నిర్వహిస్తోంది. ఇది పైలట్ ధైర్యసాహసాలు, నైపుణ్యానికి పరీక్ష ఈసారి మనదేశం తరపున తొలిసారిగా నేను బరి లోకి దిగాలనుకున్నాను. దీనికంటూ ప్రత్యేక శిక్షణ పొంది ఎంపికయ్యా. 2,500 అడుగుల ఎత్తులో జెట్ విమానాన్ని నడుపుతూ మనమే ఇంజిన్ను ఆఫ్ చేయాలి. వేగం తగ్గి విమానం అదుపు తప్పేలోపే దాన్ని సురక్షితంగా రన్‌వేపై మార్క్ చేసిన చోట ల్యాండ్ చేయాలి. అలా ఎమర్జెన్సీ సమయాల్లో మన నైపుణ్యాలను కలిగి ఉన్నారు. ఒత్తిడి ఎంత ఉన్నా మహిళల సమన్వయం చేయగలుగుతాం. ఆ ఆత్మవిశ్వాసంతో ఈ పోటీలోకి దాదాపు 60 ఏళ్లుగా జరుపు కుంటున్న ఈ పోటీలో ఇప్పటివరకు మన దేశానికి చెందినవారు ఎవరూ లేరు. దీన్లో ట్రోఫీ అందుకోవడం గర్వంగా ఉంది' అని చెబుతున్న స్నేహ ధైర్యసాహసాలు అభినందనీయం కదూ.

# గిరిపుత్రులకు వ్యాధులపై అవగాహన..

**సాంకేతికత అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లోనూ.. వచ్చిన వ్యాధి ఏంటి? దానికి ఎలాంటి చికిత్స తీసుకోవాలి? తదితర విషయాలపై అవగాహన లేక ప్రాణాలు కోల్పోతున్నారు గిరిజనులు. వాళ్ల ఈ పరిస్థితే తన పరిశోధనలకు కారణమంటున్నారు. డా.పరికపండ్ల శ్రీదేవి గిరిపుత్రులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తూ.. వాటి నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నారామె.**




శ్రీదేవి ఇప్పటికే ఇలాంటి చాలా ప్రాజెక్టుల్లో పనిచేశారు. సర్వైకల్ క్యాన్సర్,కొవిడ్‌లో గిరిజనులకు వాక్సినేషన్ అందించే జాతీయ ప్రాజెక్టులోనూ తనదైన పాత్ర పోషించారు ప్రస్తుతం నేషనల్ ఆలయన్స్ ఫర్ సికిల్‌సెల్ ఆర్గనైజేషన్స్ (ఎన్ఎఎస్సీవో) సలహా మండలి సభ్యురాలిగా కొనసాగుతున్నారు. చేతులూ, కాళ్లూ ఉబ్బడం, పసుపు రంగులోకి మారిపోవడం... తీవ్రమైన నొప్పులు, ఊపిరి. అందక చనిపోవడం. ఇవన్నీ సికెల్ వ్యాధి లక్షణాలు: ఇదంతా వైద్యులూ, కాస్తోకూస్తో వైద్యపరిజ్ఞానం ఉన్న వాళ్లకే తెలుసు కానీ, గిరిజనులు మాత్రం ఇది గాలిసోకడం... మంత్రం వేస్తే తగ్గిపోతుంది. పసరు పోస్తే చాలు... అనుకుంటారు. మధ్యప్రదేశ్‌లోని అమరకంటలో ఇందిరాగాంధీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరిన నాకు ఎదురైన అనుభవం అది అప్పుడే పరిశోధన చేయాలనుకున్నా మాది కరీంనగర్ దగ్గర బసంత్ నాన్న సత్యనారాయణ, దర్జీ. అమ్మ సరోజన గృహిణి. మేం ఆరుగురం సంతానం. ఐదుగురు అన్నయ్యలూ, నేనూ, నాన్న బట్టలు కుట్టి తెచ్చే డబ్బులే మాకు జీవనాధారం పస్తులున్న రోజులూ ఉన్నాయ్. ఈ పరిస్థితుల్నీ, మన జీవితాన్నీ చదువొక్కటే మారుస్తుంది అని చిన్న అన్నయ్య చెప్పేవాడు. అందుకే కష్టపడి చదివాను. ఆటలు ఏవైనా మొదటి స్థానంలో ఉండేదాన్ని పది డిస్టింక్షన్‌లో పాసయ్యాను. ఇంటలల్లో ఫ్రీ సిట్ వచ్చింది. డాక్టర్ అవ్వాలనుకున్నా.. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఎంసెట్‌లో 5 వేల ర్యాంకు వచ్చింది. సంవత్సరం చదువు ఆపేసి ఇంట్లోనే ఉన్నా మూడో అన్నయ్య నరహరి ఇప్పుడు ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన ప్రోత్సాహంతో డిగ్రీలో చేరా అది మొదలు వెనుదిరగలేదు. హైదరాబాద్‌లోనే జెనెటిక్స్‌లో పిజి, పోస్ట్ అక్టోరల్ పూర్తిచేశా. భయంతో వెనక్కి వచ్చేశారు.. అవగాహనతో సికెల్ సెల్కి అడ్డుకట్ట వేయొచ్చు. కానీ దీన్ని వ్యాధిగానే గుర్తించని వాళ్లకి చికిత్స. నిర్మూలన గురించి చెప్పడం సవాలుగా మారింది.



గిరిజనులు మమ్మల్ని దగ్గరికి కూడా రానిచ్చేవారు కాదు. దాంతో స్థానికుల్ని వారధిగా చేసుకున్నాం. వాళ్ల పండుగలు, పెళ్లిళ్లకు వెళ్లే వాళ్లం. వాళ్ళు మమ్మల్ని అంగీకరించడానికి సంవత్సరం పట్టింది. ఇంతా కష్టపడి వాళ్లని చికిత్సకి పంపిస్తే మందులిస్తే వాడేవారు కానీ, వ్యాధి తీవ్రత పెరిగి రక్తం ఎక్కించాల్సి వస్తే నిరాకరించే వాళ్ళు సూదితో రక్తం తీసి ఏం చేస్తారో ఏమో అని భయపడేవాళ్ళు. వాళ్లను ఒప్పించి ఆశా వర్కర్లను సహాయంగా ఇచ్చి అస్పత్రికి పంపించేవాళ్లం ఇలా ఐదేళ్ల దీనికి సంబంధించిన వివరాలన్నీ ఎప్పటికప్పుడు ఐసీఎస్ఆర్‌కు పంపేవాళ్లు ఆరోగ్య పరిస్థితుల్లో వచ్చే మార్పులు, ఏ మందు వాడాలి. బ్లెడ్ ఫ్యూజన్ ఎప్పుడు చేయాలి. మందులకి వాళ్ల శరీరం ఎలా. స్పందిస్తుంది. వాటివల్ల ఏర్పడే దుష్ప్రభావాలు, గ్రౌండ్ లెవెల్లో నిర్మూలనకి ఎలాంటి చర్యలు తీసుకోవచ్చు లాంటి చాలా విషయాల్ని పరిశోధనా పత్రాల్లో పొందుపర్చాను. ఇప్పుడు ఐసీఎస్ఆర్ ఆధ్వర్యంలో ఏడు రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్ట్ అమల్లో ఉంది. ఆ ప్రాంతాల్లో ఉన్న చాలా విషయాలు మిగతా వాళ్లకి సోపానాలుగా మారాయి. విజయ నగరం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి బదిలీ అయింది ఇక్కడా అదే ప్రాజెక్టు నడుస్తోంది. దాంతో పరిశోధనలు కొనసాగించే అవకాశం వచ్చింది. ప్రస్తుతం అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకు పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తున్నా పార్వతీపురం మన్యంజిల్లా లోనూ ఈ వ్యాధి బాధితులు ఎక్కువే గన్నెల.. దనుగడ, బంగవర్తి తదితర ప్రాంత జనాభాలో ఒక శాతానికి పైనే వ్యాధి సోకిన వాళున్నారు. చిత్రికపై జనగాహన కల్పిస్తున్నా గతేడాది నుంచే సికెల్వెల్ వ్యాధిగ్రస్థులకి ప్రభుత్వం రూ.100లు పించను ఇస్తుం ది. దీనికి ఎలా దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత వర్టిపికెట్లు ఎలా. అనుకోవాలి లాంటి అంశాల్ని వివరిస్తున్నాం.

# పరికరాలు లేకుండా సంగీతం!



**ఆ అమ్మాయి మాటైనా పలకకుండా పాట పాడేస్తుంది. ఎలాంటి పరికరాలు లేకుండానే సంగీతం పలికిస్తుంది.** ఇది ఎలా సాధ్యమంటే పుణెకు చెందిన కృతి తొమ్మిదో తరగతి చదువుతుండగా స్కూల్లో వినూత్న సంగీత పోటీలు జరిగాయి, సంప్రదాయ వాయిద్యాలను ఉపయోగించకుండా. సంగీతాన్ని సృష్టించడం దీన్లో ప్రధానం పాత పైపులతో, పప్పులు నింపిన డబ్బాలతో... ఈతలో ప్రయత్నం చేశారు. ఆమె సీనియర్లు మాత్రం ఫ్లూట్, డ్రమ్స్.. లాంటి వాయిద్యాల నంచి వచ్చే శబ్దాలను నోటితోనే చేయడం చూసి ఆశ్చర్యపోయింది కృతి అలా చేయడాన్ని బీట్‌బాక్సింగ్ అంటారని తెలుసుకుంది. ఇంటి కెళ్లాక యూట్యూబ్‌లో ఆ తరహా వీడియోలను చూశాక ప్రయత్నించాలని పించింది. క్రమేణా అందులో నైపుణ్యం సంపాదించింది. ఇప్పుడు చాలా సినిమా పాటలకు తనదైన శైలిలో బీట్ బాక్సింగ్ చేస్తోందీమె. దైనందిన జీవితంలో ఎదురయ్యే సందర్భాల నుంచీ శబ్దాలను సృష్టిస్తుంది. వీడియోల్ని ఇన్‌స్టాలోపెట్టి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. రెండు లక్షలమందికి పైగా ఫాలోయర్లనూ సంపాదించింది. 'మనకు ఆనందాన్నిచ్చే పనిచేయడం ముఖ్యం. మొదట్లో కష్టంగా ఉన్నా ఆ ప్రయాణాన్ని ఆస్వాదిస్తాం. ఏదో ఒకరోజు పరిపూర్ణత సాధిస్తాం' అంటోంది 10 ఏళ్ల కృతి.

# అందానికి మందారం ..

**మంచారు అనగానే గుర్తొచ్చేది ఒత్తైన పరులే ఈ పువ్వులు చర్మసంరక్షణకూ సాయనసతాయంటున్నారు. నిపుణులు** ఈ పువ్వుల్లోని నీ చిటమిన్ చర్మ నిగారింపుడకు సాయపడుతుంది. పొడివరం ఉన్నవాళ్లు ఈ మిశ్రమాన్ని పూతలా వేసుకుంటే పరిష్కారముంటుంది. వీటిల్లో ఉండే ఆల్ఫాహైడ్రల తొలగిస్తాయి. ప్రకాశవంతమైన చర్మం మీ సొంతమువుతుంది. ఇక, మందార పువ్వుల్లో




యాంటీ అక్రిమెంట్లూ ఎక్కువే ఇవి ఫ్రీ రాడికర్ళ్ని తొలగించడంలో సాయపడతాయి సిగ్మెంటేషము నియంత్రిస్తాయిని మొటిమలు, నల్లటి మచ్చలతో బాధపడేవారు వీటి మిశ్రమాన్ని పూతలా వేసుకుంటే చక్కని ఫలితాలు వస్తాయి. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమల్ని అదుపుచేస్తాయి. మందార రేటు మిశ్రమాన్ని పెరుగు లేదా తేనెతో కలపండి ఆపై ముఖానికి పూతలా వేయండి. 15-30 నిమిషాలు ఉంచి గోరువెచ్చటి వీటితో కడిగేస్తే సరి. పువ్వు రేకల్ని ఎండలో పెట్టి పొడి చేసి వేడినీటిలో కలపాలి అది కాస్త చల్లారాక స్ప్రే బాటిల్లోకి వేసుకుని బొట్టు బొట్టుగా ఉపయోగించవచ్చు మందార పువ్వుల్ని ఎండబెట్టి పొడిగా చేసిన తర్వాత చాలు.

# ఊహాల్లో తిప్పుతాయి..








ఉన్నచోటే ఉండాలంటే విసుగేస్తుంది. అందుకే వీలైనప్పుడల్లా ఎక్కడికైనా వెళ్తుంటాం. ఆయా ప్రాంతాల్లో దొరికే ఆహారం తిని ఆనందిస్తాం. 'టూరిజం డే' గా బస్సు, కారు, రైలు, పడవ, విమానం అనే తేడా లేకుండా పండ్లూ కూరగాయలతో వాహనాలను రూపొందించారు. ఇవి కదలకుంటేనేం.. మనసును ఊహల్లో తిప్పడం ఖాయం!







# జనరేషన్ బీటా జాగ్రత్తన

**జనరేషన్ పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు మరిన్ని నైపుణ్యాలను పెంచుకోవాలంటున్నారు. నిపుణులు వీరి పెంపడంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించడానికి సంసిద్ధం కావాలని సూచిస్తున్నారు.**

..ఏఐ ఆధారిత పరికరాలు ప్రస్తుతం సర్వసాధారణమయ్యాయి. దీంతో సాంకేతికత చుట్టూ సరిహద్దులను గీయడం తల్లిదండ్రులకు ఓ పెద్దసవాల్‌లాంటివి టెక్ వినియోగం అత్యంత అవసరం అనే యుగంలోకి ప్రస్తుతం ఉన్నాం అందుకే, స్క్రీన్లను నిషేదించడం కన్నా డిజిటల్ మీడియా ప్లాట్ఫామ్లపై సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించడమెలాగో నేర్పించాలి. నిజం, అబద్ధం మధ్య తేడాను గుర్తించడంలో సాయం చేయాలి. అలాగే ఫైబర్ సెక్యూరిటీ పట్ల అవగాహన పెంచాలి. వ్యక్తిగత సమాచారాన్ని బయటకు చెప్పడంవల్ల ఎదురయ్యే పరిణామాలను వివరించాలి. తీవ్రతరమవుతున్న వాతావరణ మార్పుల సమస్యపై జెన్ బీటాకు అవగాహన కలిగించాలి. రీసైక్లింగ్, నీటి పొదుపు, అవసరమైనంత మేరకే వినియోగం వంటి పర్యావరణహిత అలవాట్లను నేర్పించాలి. తోట పెంపకాన్ని తల్లిదండ్రులు పాటిస్తూ పిల్లలను అనుసరించేలా చేయాలి. దీంతో పర్యావరణ పరిరక్షణపై బాధ్యత వస్తుంది. పర్యావరణ అనుకూలమైన ఉత్పత్తుల వినియోగంతో వ్యర్థాలు తగ్గించడంలో వారినీ భాగస్వాములను చేయాలి. వీరికి ఎమోషనల్ ఇంటెలిజెన్స్ అత్యంత ముఖ్యం. మానసికారోగ్యానికి మూలమైన భావోద్వేగాలను సమన్వయం చేసుకోవడం, నియంత్రించుకోగలగడం తెలియాలి. వాళ్ల భావాల్ని వ్యక్తీకరించే అవకాశమివ్వాలి. అలాగే పెద్దవాళ్ళు కథలు చెప్పడం, వాళ్లతో చదివించడం, తమ అభిప్రాయాలను చెప్పించడం వంటివి వాళ్లకు అభ్యాసంలా మారతాయి. బావోద్వేగాలను సమన్వయం చేసుకోగలిగే సామర్థం వాళ్లకు పెరుగుతుంది. పిల్లలను ప్రకృతితో మమేకమయ్యేలా చేయాలి. పార్కులో నడక, కుటుంబమంతా పర్యటక ప్రాంతాల కెల్లడం, అవు ట్డోర్ అడ్వంచర్స వంటివి శారీరక శ్రమతో పాటు వాళ్లలో మానసికారోగ్యాన్ని పెంపొందించేలా చేస్తాయి. పలురకాల క్రీడల్లో ప్రవేశం కలిగేలా చేయాలి. వీటన్నింటితో తమ అభిప్రాయాలను చెప్పించడం వంటివాళ్లకు అభ్యాసంలా మారతాయి. భావోద్వేగాలను సమన్వయం చేసుకోగలిగే సామర్థ్యం వాళ్లకు పెరుగుతుంది. పిల్లలను ప్రకృతితో మమేకమయ్యేలా చేయాలి.



పార్కులో నడక, కుటుంబమంతా పర్యటక ప్రాంతాలకెల్లడం అవుట్‌డోర్ అడ్వంచర్స్ వంటివి శారీరకశ్రమతోపాటు వాళ్లలో మానసికారోగ్యాన్ని పెంపొందించేలా చేస్తాయి. పలురకాల క్రీడల్లో ప్రవేశం కలిగేలా చేయాలి. వీటన్నింటితో తమ చుట్టూ ఉన్న వాతావరణం, వ్యక్తులతో పిల్లలు అనుబంధాన్ని పెంచుకకుంటారు. దీంతో వారిలో మానవసంబంధాలూ మెరుగుపడతాయి. స్క్రీన్ సమయం తగ్గుతుంది.

# నమ్మకం కోల్పోకూడదు

ఒక ధనికుడికి దైవభక్తి ఎక్కువ అతడో రోజు సొంత పడవలో సముద్రంలో ఒంటరిగా షికారుకి వెళ్లాడు. ఉవ్వెత్తున ఆటలు రావడంతో పడవ ధ్వంసమైంది. గబుక్కున సముద్రంలోకి దూకి, అతి కష్టంమీద ఒక ద్వీపానికి చేరుకున్నాడు. !! ద్వీపంలో మనుషుల జాడ లేదు. చుట్టూ నీళ్ల తప్ప మరేం కనిపించలేదు. ధనికుడు మొదట బాధపడినా వెంటనే తేరుకుని, తనను మరణం నుంచి రక్షించిన భగవంతుడు,. తన ప్రాంతం చేరేందుకు కూడా దారి చూపిస్తాడు అనుకుని స్థిమితపడ్డాడు. ఒంటరిగా జీవిస్తూ, దొరికే పండ్లు, దుంపలూ తినడం అలవాటు చేసుకున్నాడు. కొంతకాలానికి అతడి ఆశలు నీరుగారినా దేవుడిపట్ల నమ్మకం మాత్రం తగ్గలేదు. బాధపడుతూనే ఓ గుడిసె నిర్మించాడు. తీరా పిడుగు పడి గుడిసె కాలిపోయింది. అతడు దుఃఖిస్తూ ఖిదేవుడా! నీకిది న్యాయమా, ఎన్ని కష్టాలేదురైనా నీపై విశ్వాసాన్ని కోల్పోలేదు. కానీ నువ్వెందుకు దయ చూపడంలేదు? అంటూ దుఃఖించాడు. అంతలో పడవ వచ్చింది. ఇద్దరు వ్యక్తులు పడవ దిగి ఖిమంటలు కనిపించడంతో ఎవరైనా ఇబ్బంది పడుతున్నారేమోనని రక్షించడానికి వచ్చాం మీరీ గుడిసెను కాల్చి ఉండకపోతే, ఇక్కడ మనిషి ఉన్నట్టు తెలియదుఖి అన్నారు. ధనకుడు పశ్చాత్తాపంతో ఖినన్ను రక్షించడానికే పిడుగు పడిందని గ్రహించలేకపోయాను. నువ్వు నా సహనాన్ని పరీక్షి ంచావు. నేనందులో విఫలమయ్యాను నమ్మినవారిని నిశ్చయంగా కాపాడతావని మరోసారి నిరూపించావు. చన్ను మన్నించు ప్రభూ“ అంటూ, నమస్కరించాడు. ఎంతటి కష్టంలోనూ దేవుడి మీద నమ్మకాన్ని కోల్పోకూడదు అంటూ ఓ గురువు చెప్పిన కథ



ఆధ్యాత్మకం

# తిల్ పీఠా



**కావలసినవి.** బియ్యం కప్పు, నల్ల నువ్వులు కప్పు, బెల్లం 2 కప్పులు, కొబ్బరి కోరు 2 టేబుల్ స్పూన్లు, సోంపు టేబుల్ స్పూన్లు

**తయారీ** బియ్యం నాలుగు గంటలు నానబెట్టి ఆ నీళ్ల వంపేయాలి. వాటిని వస్త్రం మీద ఆరబోసి.. తడి. పీల్చేసుకున్నాక రుబ్బాలి పిండి ఎంత మెత్తగా ఉంటె పీరా అంత బాగా వస్తుంది. పిండిని ఒక పాత్రలోకి తీసి, పాలిథిన్ పేపరుతో చుట్టి.. ఓ గంట పక్కనుంచాలి. నువ్వులను వేయించాలి. వాటిలో సోంపూ, బెల్లం, కొబ్బరి కోరు జతచేసి బ్లెండ్ చేయాలి. కాలుతున్న పెనం మీద. చారుగరెటెడు బియ్యప్పిండి వేసి.. అదే గరిటెతో వెడల్పుగా పరిచినట్లు చేయాలి. దాని మీద తగినంత స్టఫింగ్ వేయాలి. దోశల గట్టిపడిన పిండిని మెల్లగా రోల్ చేసి, పళ్లెంలోకి తీయాలి. తక్కిన పిండితోనూ ఇలాగే చేసుకోవాలి. అసోం వారి 'తిల్ పీరా' పదిరోజులు నిలవనుంది.




### హాకీ ఫెడరేషన్ ప్రో లీగ్‌లో..

# ఇంగ్లండ్‌పై అమ్మాయిలు గెలుపు

### స్పెయిన్ చేతిలో ఓడిన అబ్బాయిలు

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ హాకీ ఫెడరేషన్ (ఎఫ్ఐహెచ్) మహిళల ప్రొ లీగ్‌లో భారత్ అమ్మాయిలు అదరగొట్టగా, పురుషుల ప్రొలీగ్‌లో భారత్ అబ్బాయిలు పేలవ ప్రదర్శన చేశారు. దీంతో హోరా హోరీ పోరులో అమ్మాయిలు విజయం సాధించగా, అబ్బాయిలు పరాజయం పాలయ్యారు. ఎఫ్ఐహెచ్ మహిళల ప్రొలీగ్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. భారత అంచె పోటీల్లో భాగంగా భువనేశ్వర్‌లో హోరాహోరీగా సాగిన తొలి పోరులో భారత్ 3-2 పాయింట్ల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. కళింగ స్టేడియంలో జరిగిన పోరులో తమకన్నా మెరుగైన ర్యాంక్ ఉన్న ఇంగ్లండ్ జట్టుపై భారత్ స్ఫూర్తిదాయకమైన ప్రదర్శన కనబర్చింది. భారత్ తరఫున వైష్ణవి (6వ నిమిషంలో), దీపిక (25వ నిముషంలో) నవ్నీత్ కౌర్ (59వ నిముషంలో) తలా ఒక గోల్ చేశారు. వైష్ణవి, దీపిక పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచగా, ఆట ఆఖరి నిమిషంలో అదిరిపోయే ఫీల్డ్ గోల్‌తో నవ్‌నీత్ జట్టుకు విజయాన్ని అందించింది. ఇంగ్లండ్ తరఫున డార్సీ బౌర్నె (12వ నిమిషంలో), ఫియానా క్రాక్లెస్ (58వ నిముషంలో) చెరో గోల్ కొట్టారు. ఎఫ్ఐహెచ్ ర్యాంకింగ్స్‌లో తొమ్మిదో స్థానంలో ఉన్న భారత్ వైష్ణవి గోల్‌తో తొలి క్వార్టర్లోనే ఖాతా తెరిచింది. అయితే కాసేపటికే ఏడో ర్యాంక్‌లో ఉన్న ఇంగ్లండ్ స్కోరు సమం చేసింది. రెండో క్వార్టర్లో దీపిక గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన భారత్ సునాయాసంగానే మ్యాచ్ గెలిచేలా కనిపించింది. ఈ క్రమంలో గోల్‌కీపర్ సవిత పూనియా కొన్ని చక్కటి సేవ్‌లతో ప్రత్యర్థికి స్కోరు చేసే అవకాశం ఇవ్వలేదు. చివర్లో ఇంగ్లండ్ స్కోరు సమం చేసినా, నిమిషం వ్యవధి లోనే మరో గోల్ కొట్టిన భారత్ విజయం సాధించింది. ఇక పురుషుల ప్రొ లీగ్ అంచె పోటీల్లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో హర్మన్ ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత్ 1-3 గోల్స్ తేడాతో స్పెయిన్ చేతిలో ఓడింది. దీంతో 2024 పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక పోరులో భారత జట్టు చేతిలో ఎదురైన పరాజయానికి స్పెయిన్ బదులు తీర్చుకున్నట్లయింది. భారత్ తరఫున సుఖ్‌జీత్ సింగ్ (25వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. స్పెయిన్ తరఫున బోర్జా లాకల్లె (28వ నిమిషంలో), ఇగ్నాషియా కొబొస్ (38వ నిముషంలో), బ్రూనో అవిలా (56వ నిముషంలో) తలా ఒక గోల్ చేశారు. భారత జట్టు పదే పదే దాడులు చేసినా స్పెయిన్ రక్షణ పంక్తి సమర్థవంతంగా అడ్డుకుంది. తొలి క్వార్టర్లో ఇరు జట్లు ఎంత ప్రత్నించినా గోల్ చేయలేకపోయాయి. రెండో క్వార్టర్‌ను ఇరు జట్లు మరింత దూకుడుగా ప్రారంభించాయి. ఈ క్రమంలో సుఖ్‌జీత్ సింగ్ గోల్‌తో భారత్ ఆధిక్యంలోకి వెళ్లగా, మూడు నిమిషాల వ్యవధిలోనే గోల్ కొట్టిన స్పెయన్ స్కోరు సమం చేసింది. ఆ తర్వాత వరుసగా రెండు క్వార్టర్స్ లో ఒక్కో గోల్ బాదిన స్పెయిన్ మ్యాచ్‌ను చేజిక్కించుకుంది.

# ఈ స్టార్లకు ఇదే లాస్ట్ టోర్నీ

### ఐసిసి టోర్నమెంట్‌తో ఫ్యూచర్ రోహిత్, కోహ్లి, జడేజాలపైనే దృష్టి










**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మరో రెడు రోజులే మిగిలి ఉన్నాయి. ఈ మినీ వరల్డ్ కప్ గెలిచేందుకు భారత్‌తో సహా ప్రపంచంలోని 8 అత్యుత్తమ జట్లు పోటీ పడుతున్నాయి. దీనికి సంబంధించి శనివారం రాత్రి టీమిండియా ఆటగాళ్లు దుబాయ్ చేరుకున్నారు. అయితే టీమిండియాలోని కొందరు దిగ్గజాలకు ఇదే ఆఖరి ఐసీసీ టోర్నమెంట్ అని తెలుస్తోంది. ఐసీసీ ఛాంపియన్స్ టోర్నమెంట్ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభమవుతుంది. టీమిండియాలోని ముగ్గురు సీనియర్ క్రికెటర్లకు ఇదే చివరి ఐసీసీ టోర్నమెంట్‌గా చర్చ సాగుతోంది. ఇందులో చూపించే ప్రదర్శనపైనే వీరి భవిష్యత్ ముడిపడి ఉంటుందనేది స్పష్టమవుతోంది. 2024 టీ20 ప్రపంచ కప్ గెలిచిన తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా అంతర్జాతీయ టీ20 క్రికెట్ నుంచి రిటైర్ అయ్యారు. ఇప్పుడు ఈ ముగ్గురు దిగ్గజాలు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడుతున్నారు. రోహిత్, విరాట్, జడేజా టీ20 నుంచి రిటైర్ అయ్యారు. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటిసి) ఫైనల్ జూన్‌లో జరగాల్సి ఉంది. అందులో భారత్ ఆడడం లేదు. వచ్చే ఏడాది, 2026 టి20 ప్రపంచ కప్ జరుగుతుంది. అప్పుడు కూడా ఈ ముగ్గురిని అక్కడ చూసే అవకాశం ఉండదు. దీని తర్వాత, 2027లో వన్డే ప్రపంచ కప్ జరుగుతుంది. అప్పటికి పరిస్థితులకు అనుగుణంగా టీమిండియా కూర్పు ఉంటుందని భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇది వారికి చివరి ఐసీసీ టోర్నమెంట్ కావచ్చు అని భావిస్తున్నారు. దీనికి బలమైన అవకాశాలు కన్పిస్తున్నాయి. 2024-25 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ సందర్భంగా, ఈ ముగ్గురు భారతీయ ఆటగాళ్ల భవిష్యత్తు గురించి చాలా చర్చలు జరిగాయి. అభిమానుల మనస్సుల్లో ఉన్న అతిపెద్ద ప్రశ్న ఏమిటంటే, ఈ ముగ్గురూ 2027 వన్డే ప్రపంచ కప్ ఆడతారా? ముగ్గురి వయస్సును పరిగణనలోకి తీసుకున్నప్పటికీ, ఈ ప్రశ్న అభిమానుల మనస్సుల్లోనే ఉంది. ముగ్గురూ 36 ఏళ్ల పైబడిన వారు. రోహిత్ 2025 ఏప్రిల్ నాటికి 38 ఏళ్లు నిండుతాయి. అయితే, ఈ ముగ్గురి ఫిట్‌నెస్ అద్భుతంగా ఉంది, కాబట్టి వయస్సు ఇకపై సమస్య కాదు. అయితే, ఈ దిగ్గజ త్రయం 2027 వన్డే ప్రపంచ కప్‌లో ఉంటుందో లేదో భారత్ క్రికెట్ బోర్డు నిర్ణయిస్తుంది.

# చివరి స్థానంలో గుకేశ్



### గ్రాండ్‌స్లామ్ చెస్ టోర్నమెంట్‌లో ఒక్క మ్యాచ్‌లోనూ గెలవని గ్రాండ్ మాస్టర్

**ఢిల్లీ:** ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టూర్ టోర్నమెంట్‌లో ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ నిరాశ పరిచాడు. జర్మనీలోని హాంబర్గ్‌లో ముగిసిన ఈ టోర్నీలో గుకేశ్ ఆఖరి స్థానంతో సరిపెట్టుకున్నాడు. ప్లే ఆఫ్ పోరులో గుకేశ్ 0.5-1.5 పాయింట్ల తేడాతో అలిరెజా ఫిరౌజా (ఇరాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. క్వార్టర్ ఫైనల్లో ఫాబియానో కరువా నా (అమెరికా) చేతిలో ఓడిన గుకేశ్, ప్లే ఆఫ్ రౌండ్‌లోనూ ఆకట్టుకోలేక పోయాడు. తొలి రౌండ్‌ను డ్రా చేసుకున్న గుకేశ్, రెండో రౌండ్‌లో తెల్ల పావులతో ఆడినా సత్తా చాటలేక పోయాడు. 30 ఎత్తుల్లో పరాజయం పాలయ్యాడు. ఓవరాల్‌గా విన్సెంట్ కైమెర్ (జర్మనీ) అగ్రస్థానం దక్కించుకోగా, ఫాబియా కరువానా (అమెరికా), మాగ్నస్ కార్ల్సన్ (నార్వే) వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఆ తర్వాత వరుసగా జవోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్; 4వ స్థానం), హికారు నకమురా (అమెరికా; 5వ స్థానం), నొడ్రిబె డ్రిక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్; 6వ స్థానం), అలిరెజా ఫిరౌజా (7వ స్థానం) నిలిచారు. ఎనిమిది మంది గ్రాండ్ మాస్టర్లు పాల్గొన్న ఈ టోర్నీలో గుకేశ్ ఎనిమిదో స్థానంతో ముగించాడు. ఈ టోర్నీ మొత్తంలో గుకేశ్ ఒక్క మ్యాచ్‌లోనూ విజయం సాధించలేకపోయాడు.

### ఇన్విటేషనల్ టోర్నీ రేసులో.. భారత్ యువ అథ్లెట్ గుల్వీర్ సింగ్

# జాతీయ రికార్డు




**న్యూఢిల్లీ:** భారత యువ అథ్లెట్ గుల్వీర్ సింగ్ బోస్టన్‌లో జరిగిన ఇన్విటేషనల్ టోర్నీలో జాతీయ రికార్డు నెలకొల్పాడు. 3000 మీటర్ల ఇండోర్ రేసులో 26 ఏళ్ల గుల్వీర్ సింగ్ 7 నిమిషాల 38.26 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. తద్వారా 16 ఏళ్ల క్రితం సురేందర్ సింగ్ (7:49.47) నెలకొల్పిన రికార్డును గుల్వీర్ బద్దలు కొట్టాడు. 2022 హాంగ్జూ ఆసియా క్రీడల 10,000 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించిన గుల్వీర్, ఈ సీజన్ ఆరంభంలోనే రికార్డు నెలకొల్పడం విశేషం. ఇదేటో ర్నీలో పాల్గొన్న భారత మరో రన్నర్ రాహుల్ 8 నిమిషాల 8.27 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. ప్రస్తుతం గుల్వీర్ పేరిటే 5000 మీటర్లు, 10,000 మీటర్ల జాతీయ రికార్డులు ఉన్నాయి. 5000 మీటర్ల పరుగును 13 నిమిషాల 11.82 సెకన్లలో పూర్తిచేసిన గుల్వీర్, 10,000 మీటర్ల రేసును 27 నిమిషాల 14.88 సెకన్లలో లక్ష్యా న్ని చేరాడు.



### ఇండియన్ సూపర్ లీగ్‌లో..

# చెన్నై రెండో విజయం

### 2-1తో పంజాబ్ చిత్తు

**న్యూఢిల్లీ:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో చెన్నైయిన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్సీ) వరుసగా రెండో విజయం నమోదు చేసుకుంది. చెన్నైలో జరిగిన ఈ పోరులో చెన్నైయిన్ ఎఫ్సీ 2-1 గోల్స్ తేడాతో పంజాబ్ ఎఫ్సీపై విజయం సాధించింది. చెన్నై యిన్ జట్టు తరఫున విల్మార్ జోర్డాన్ గిల్ (19వ నిమిషంలో), డానియల్ చిమ చుకువా (84వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. పంజాబ్ జట్టు తరఫున లూకా మాజ్సెన్ (48వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు చెరో 12 షాట్లు ఆడాయి. అందులో ఐదేసిసార్లు ప్రత్య ర్థి గోల్‌పోస్ట్‌పై దాడి చేశాయి. అయితే మ్యాచ్ ఆరంభంలోనే జోర్డాన్ గిల్ గోల్‌తోచెన్నైయిన్‌జట్టు ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత పంజాబ్ జట్టు స్కోరు సమం చేసినా మ్యాచ్ మరికాసేపట్లో ముగుస్తుందనగా, చెన్నైయిన్ మరో గోల్‌తో విజయం సాధించింది. తాజా సీజన్లో 21 మ్యాచ్‌లు ఆడిన చెన్నైయిన్ 6 విజయాలు, 9 పరాజయాలు, 6 డ్రాలతో 24 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో 10వ స్థానంలో ఉంది. మరో మ్యాచ్ మోహన్ బగాన్ జట్టు 3-0 గోల్స్ తేడాతో కేరళా బ్లాస్టర్స్‌పై గెలుపొందింది. జేమీ మెక్లారెన్ (18వ, 40వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో విజృంభించగా, అల్బర్టో రోడ్రిగో డ్రిజ్ (66వ నిమిషంలో) మరో గోల్ సాధించాడు. తాజా సీజన్‌లో 21 మ్యాచ్‌లు ఆడిన మోహన్ బగాన్ జట్టు 15 విజయాలు, 2 పరాజయాలు, 4 డ్రాలతో 49 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక టాప్‌లో సాగుతోంది.

## వాణిజ్యం

# బంగారం రుణాలపై కేంద్రం కొత్త రూల్స్


**ముంబై, ఫిబ్రవరి 16:** గోల్డ్ లోన్ చెల్లించలేని కారణంగా బ్యాంకులు ఇష్టారీతిన ప్రజల సొమ్ము ను వేలం వేయడానికి వీల్లేదని కేంద్రం ప్రకటన చేసింది. బంగారం వేలం వేసే విషయంలో బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు నిబంధనలు కచ్చితంగా పాటించాలని హెచ్చరిం చింది. కమర్షియల్ బ్యాంకులు సామాన్యుల సొమ్మును వేలం వేసే పక్షంలో కచ్చితంగా సమయంలో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు ఒకేలాంటి నియమాలుపాటించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ బ్యాంకులు ఆర్బీఐ పరిధిలోకి రాకు న్నప్పటికీ బిడ్డింగ్ విషయంలో వీరు కచ్చితంగా నియమాలు పాటించాల్సి ఉంటుంది. ఇలా కష్ట మర్లు తాకట్టు పెట్టిన బంగారం వేలం వేసే ముందు వారికి నోటీసులు పంపించాల్సి ఉం టుంది. ఆభర ణాల



ఆర్బీఐ నిబంధనలను పాటించి తీరాలనే రూల్స్ ఉన్నాయి. అయితే, కొందరు సాధారణ పాన్ షాపుల్లో తమ బంగారాన్ని తాకట్టు పెడుతుంటా రు. అయితే వీరు ఎలాంటి రూల్స్ పాటించరు. కస్టమర్లకు గడువు ముగిసిన తర్వాత ఎలాంటి హెచ్చరికలు లేకుండా వారి బంగారాన్ని వేలం వేసేస్తుంటారు. ఇకపై ఎవరైనా ఇలా చేస్తున్నట్టు తేలితే వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని కేంద్ర మంత్రి హెచ్చరిం చారు. లోక్ సభలో ప్రశ్నోత్తరాల సొమ్మును రుణ గ్రహీత లు తిరిగి చెల్లించడం లో విఫలమైతే బ్యాంకు లేదా ఎన్ ఎఫ్ బీసీ వేలానికి వెళ్లవలసివస్తుంది. కానీ దానిని కస్టమర్‌కు సరిగ్గా తెలియజేయాలి. ఈ ప్రక్రియలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. లేదంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర ఆర్థిక శాఖ చర్యలు తీసుకుంటుంది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలు, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు ఈ విషయంలో ఒకే విధ మైన నిబంధనలను పాటిం చాల్సి ఉంటుం ది.

# ‘ఇవి’ స్కూటర్లదే హవా!

**ముంబై, ఫిబ్రవరి 16:** భారతీయ ద్విచక్ర వాహన మార్కెట్‌ను మోటర్ సైకిల్స్ విభాగం లో ఐసీఈ మోటార్ సైకిల్స్ శాసిస్తుంటే స్కూటర్ల విభాగాన్ని మాత్రం రెండేళ్ల నుంచి ఎల క్ట్రిక్ వాహనాలు శాసిస్తున్నాయి. ముఖ్యంగా యుటి లిటీ, విస్తృత శ్రేణి మోడల్స్‌పై పెరుగుతున్న ఆసక్తి నేప థ్యంలో ఈవీ స్కూటర్ల కొనుగోలును ఇష్టపడుతున్నారు. అయితే స్కూటర్ల వినియోగం విషయానికి వస్తే నిల్వ సామ ర్థ్యం వినియోగదారులు పరిశీలిస్తున్నారు. ప్రయాణ ప్రయోజ నాల కోసం ఎలక్ట్రిక్ స్కూటర్‌లు అనువుగా ఉన్నా కుటుంబంతో బయటకు వెళ్లి నప్పుడు వారి లగేజీ మెయిన్ టెయిన్ చేయడా నికి అండర్ సీట్ స్టోరేజీను కొనుగోలు దారులు చూస్తున్నారు. షాపింగ్ బ్యాగు లు, ఇతర చిన్న బ్యాగులు, మొబైల్ ఫోన్ ఛార్జర్, ల్యాప్టాప్ మొదలైన వాటిని తీసుకెళ్లగల సామర్థ్యం ఉన్న స్కూటర్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా హెల్మెట్ సరిపోయేంత స్థలం ఉన్న స్కూటర్ల కోసం కొనుగోలుదారులు వెతుకుతున్నా రు. ఈ నేపథ్యంలో మార్కెట్లో 30 లీటర్ల కంటే ఎక్కువ నిల్వ సామర్థ్యాన్ని అందించే ఎలక్ట్రిక్ స్కూటర్ల గురించి మరిన్ని వివరాలను తెలుసు కుందాం. ఏథర్ 450 సిరీస్ ఎలక్ట్రిక్ స్కూటర్లతో విజయం సాధిం చిన తర్వాత ఏథర్‌కంపెనీ రిజ్టాను ఫ్యామిలీ స్కూటర్ పేరుతో రిచయం చేసింది. ఈ ఫ్యామిలీ స్కూటర్‌గురించి చెప్పుకుంటే ప్రాక్టికాలిటీ, యుటిలిటీ అంశాలు కొనుగోలు నిర్ణయాలలో కీలక పాత్ర పోషిస్తా యి. ఏథర్‌రిజ్టా 56 లీటర్ల భారీ నిల్వ సామర్థ్యాన్ని అంది స్తోంది. ఇందులో 34 లీటర్ల అండర్‌సీట్ స్టోరేజ్ ఉంటుంది, అయితే పెద్ద ఫ్రంట్ ఆప్రాన్ కూడా 22లీటర్ల నిల్వను అంది స్తుంది. ఆథర్ రిజ్టా ధర రూ.1.10 లక్షలు (ఎక్స్ షోరూమ్).



ఓలా ఎస్1 ప్రో ప్లస్ జెన్ 3 ఎలక్ట్రిక్ స్కూటర్ కొన్ని రోజుల క్రితం భారతదేశంలో లాంచ్ చేశారు. ఈ స్కూటర్ మెరుగైన పనితీరు, భద్రతా లక్షణాలతో ఆకట్టుకుంటుంది. ఓలా ఎస్1 ప్రో ప్లస్ 34 లీటర్ల అండర్ సీట్ స్టోరేజ్ సామర్థ్యాన్ని అందిస్తుంది. అలాగే ఈ ఎలక్ట్రిక్ వాహనం ముందు భాగంలో క్యూబీ హోల్స్‌తో రావడం వల్ల ఫోకస్డ్ స్టోరేజ్ ఎంపికగా వస్తుంది. ఓలా ఎస్1 ప్రో ప్లస్ ఎలక్ట్రిక్ స్కూటర్ ధర రూ.1.55 లక్షలు (ఎక్స్ షోరూమ్)గా ఉంది. బెంగళూరుకు చెందిన ‘ఇవి’ రివర్ ఇండీ ఎలక్ట్రిక్ స్కూటర్ ఒక ప్రత్యేకమైన డిజైన్‌తో వస్తుంది.

# నకిలీ కరెన్సీ ఉంటే ఇలా చేయాల్సిందే..లేదంటే ఏడేళ్ల జైలు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** ఇటీవల ఢిల్లీ కోర్టు నకిలీ 2000 రూపాయల నోట్లను కలిగి ఉండడంతో పాటు ఉపయోగించిన ఇద్దరి వ్యక్తులకు శిక్ష ఖరారు చేసింది. ఐపీసీ సెక్షన్ 489 బి (నిజమైన, నకిలీ, నకిలీ కరెన్సీ నోట్లు, బ్యాంకు నోట్లను ఉపయోగించడం), సెక్షన్ 489 సి కింద కోర్టు చర్యలు తీసుకుంది. వీరిద్దరి నుంచి పోలీసులు 2000రూపాయల 29 నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ నోటును ముద్రించడం ఎంత నేరమో? అవి ఉన్నాయని తెలిసి వాటిని సైలెంట్‌గా చలామణి చేయడం కూడా అంతే నేరమని భారతీయ చట్టాల ద్వారా తెలుస్తుంది. భారతదేశం లో నకిలీ కరెన్సీని ఉపయోగిం చడం, తయారు చేయడం, చలామణి చేయడం లేదా కలిగి ఉండటం వంటి వాటిని తీవ్రమైన నేరాలు గా పరిగణిస్తారు. నకిలీ నోటు తయరు చేసినా, చలామణి చేసినా భారత శిక్షాస్మృతి (ఐపీసీ) ప్రకారం పలు శిక్షలను విధించడం తో పాటు జరిమానా కూడా కట్టాల్సి ఉంటుంది. ఐపీసీ లోని సెక్షన్ 489 ఏ ప్రకారం నకిలీ నోట్లను తయారు చేస్తే జీవిత ఖైదు, 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. అలాగే సెక్షన్ 489 బీ ప్రకారం నకిలీ నోట్లను ఉపయోగించడం లేదా చలామణి చేయడా నికి ప్రయత్నించినా జీవిత ఖైదు, 10 సంవత్స రాల వరకు జైలు శిక్ష, జరి మానా విధిస్తారు. సెక్షన్ 489 సీపీ నకిలీ నోట్లు అని తెలిసి ఎవరైనా వ్యక్తి వాటిని వారి దగ్గరే ఉంచుకుంటే ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. అలాగే సెక్షన్ 489డీ ప్రకారం నకిలీ నోట్లను ముద్రించడానికి పరికరాలు లేదా ప్లేట్లను తయారు చేయడం లేదా కలిగి ఉంటే దీనికి జీవిత ఖైదు లేదా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా విధి స్తారు. అయితే సెక్షన్ 489 ఈ నిజమైన కరెన్సీ నోట్లను పోలిన ప్రకటనలు, పత్రాలు లేదా సామగ్రిని ముద్రిస్తే దీనికి 6 నెలల వరకు జైలు శిక్ష, జరిమానా రెండూ విధించవచ్చు. దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో నకిలీ నోట్లను ఉపయోగిస్తుంటే ఉగ్రవాద నిరోధక




చట్టాల (యుఎపిఎ, పిఎంఎల్ఎ) కింద కూడా చర్యలు తీసుకోవచ్చు. నకిలీ కరెన్సీకి సంబంధించిన కేసులను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)చట్టం, 1934 కింద దర్యాప్తు చేయవచ్చు. అనుకోకుండా మీ దగ్గర ఉన్న సొమ్ములో నకిలీ నోట్ వస్తే వెంటనే సమీపం లోని బ్యాంకు లేదా పోలీసులకు తెలియ జేయాల్సి ఉంటుంది. నకిలీ నోటును మరెవరికీ ఇవ్వడం, ఉపయోగించడం మానుకోవాలి. ఎందుకంటే ఇది కూడా నేరం. బ్యాంకు ఆ నకిలీ నోటును స్వాధీనం చేసుకుని పోలీసులకు, ఆర్‌బీఐకు తెలియ జేస్తుంది.

**ముంబై, ఫిబ్రవరి 16:** టెలికం వనరుల దుర్వి నియోగాన్ని అరికట్టడానికి, అలాగే వినియోగదారుల భద్రతను పెంచడానికి టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నిబంధనలను సవరించింది. స్పామ్ కాల్స్ గుర్తింపును మెరుగుపరచడంతో పాటు టెలికం ఆపరేటర్లను జవాబుదారీగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ట్రాయ్ టెలికం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్, 2018ను ఇటీవల సవరించారు. ముఖ్యంగా పది అంకెల ఫోన్ నెంబర్స్‌తో చేసే మోసాల అరికట్టేలా రూల్స్‌ను సవరించింది.

# స్పామ్ కాల్స్‌కు చెక్ పెట్టేలా ట్రాయ్ చర్యలు..

ఈ సవరణలు నమోదుకాని టెలిమార్కెటర్ల (యూటీఎం)పై నిబంధనలను కఠినతరం చేస్తాయి. ముఖ్యంగా వినియోగదారుల ఫిర్యాదు మేరకు టెలికం కంపెనీలు వెంటనే చర్యలు తీసుకోవాల్సిందేనని ట్రాయ్ స్పష్టం చేసింది. ట్రాయ్ తాజా సవరణల ప్రకారం ప్రామాణిక 10 అంకెల మొబైల్ నంబర్ల ద్వారా వాణిజ్య వినియో గాన్ని పరిమితం చేసింది. టెలిమార్కెటర్లు నియమించిన నంబర్ల శ్రేణిని ఉపయోగించాల్సి ఉంటుంది. అలాగే ‘140’ సిరీస్ ప్రమోషనల్ కాల్స్ కోసం, కొత్తగా కేటాయించిన ‘1600’ సిరీస్ లావాదేవీలు, కాల్స్ సర్వీస్ కోసం ఉపయోగించాలి. అలాగే స్పామ్ కాల్స్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదులు చేసే ప్రక్రియను కూడా సరళీకరించారు. గతంలో



మూడు రోజుల్లోపు ఫిర్యాదు చేయాల్సి ఉంటే ఇప్పుడు దానిని ఏడు రోజులకు పెంచారు. గతంలో టెలికం ఆపరేటర్లు యూసీసీ ఫిర్యాదుల పై 30 రోజుల్లోపు చర్య తీసుకోవాల్సి ఉండేది. ఇప్పుడు వారు 5 రోజుల్లోపు కచ్చితంగా ఫిర్యాదులను పరిష్కరించాలి. టెలికం కంపెనీలకు జరిమానా విధించే పరిమితిని ఏడు రోజుల్లో 10 ఫిర్యాదుల నుంచి 10 రోజుల్లోపుకేవలం ఐదు ఫిర్యాదులకు తగ్గించారు. ముఖ్యంగా టెలికం కంపెనీ లు ఇప్పుడు వినియోగదారులు తమ మొబైల్ యాప్‌లు మరియు వెబ్‌సైట్‌లలో ఫిర్యాదునమోదు చేసే సౌకర్యాన్ని కూడా అందించాలని ట్రాయ్ స్పష్టం చేసింది.

# బీమాపై పెరుగుతున్న ధీమా..

**ముంబై, ఫిబ్రవరి 16:** ఇటీవల ఓ తెలుగు సినిమాలో చెప్పినట్టు రోడ్డు ప్రమాదం అంటే ఓ వ్యక్తి రోడ్డుపై పడడం కాదు. ఓ కుటుంబం రోడ్డున పడడం అని. ఇంటి పెద్ద లేకపోతే ఆ కుటుంబ పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో? అందరికీ తెలుసు. ఇలాంటి సందర్భంలో వారికి భరోసా కల్పించేందుకు వివిధ బీమా పాలసీలు అందు బాటులో ఉంటున్నాయి. ముఖ్యంగా వాహనం కొనుగోలు చేసినప్పుడే తప్పనిసరిగా ఇన్సూ రెన్స్ తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుం ది. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ క్లెయిమ్స్ చేసే వారి సంఖ్య పెరిగిందని నిపుణు లు చెబుతున్నారు. దేశంలో పెరిగిన డిజిటల్ విప్లవంతో మోటార్ బీమా విషయంలో ఆన్‌లైన్ క్లెయిమ్ సెటి ల్మెంట్ పాలసీదారులకు అద నపు సౌకర్యాన్ని అంది స్తుంది. ఆన్‌లైన్ ప్రక్రియలో మీ స్మార్ట్‌ఫోన్‌లో కొన్ని క్లిక్‌లతో మీరు మీ వాహన ప్రమాద విషయాన్ని బీమా కంపెనీకు నివేదించవచ్చు. మీ వాహన, ప్రాణ నష్టం ఫోటోలు, మీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, మీ డ్రైవింగ్ లైసెన్స్ వంటి అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేయవచ్చు. బీమా సంస్థలు కూడా మీ క్లెయిమ్ ను డిజిటల్‌గా ప్రాసెస్ చేస్తాయి. మిమ్మల్ని సమీపంలోని నెట్‌వర్క్ గ్యారేజీకి వెళ్లమని, మరమ్మతులు వెంటనే ప్రారంభించేలా బీమా కంపెనీలు ఇటీవల చర్యలు తీసుకుంటున్నాయి. భారత ప్రభుత్వం కూడా బీమా రంగంలో డిజిట లైజేషన్ ప్రయోజనాలను గుర్తించింది. 2024లో ఆన్‌లైన్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి అనేక నియంత్రణ కార్యక్రమాలు ప్రవేశపెట్టారు. బీమా నియంత్రణ, అభివృద్ధి అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) బీమా సంస్థలు సజావుగా డిజిటల్ పరిష్కారాలను అందించాలని, వేగవంతమైన క్లెయిమ్ ప్రాసెసింగ్, కస్టమర్ సంతృప్తిని నిర్ధారించాలని మార్గదర్శకాలను రూపొందించింది. ఈ నిబంధనలు బీమా సంస్థలు డేటా విశ్లేషణలు, ఏఐ ఆధారిత సాధనాలను నష్ట అంచనా కోసం స్వీకరించ డానికి, మానవ తప్పిదాలను మరింత తగ్గించడానికి మరియు పరిష్కారాలను వేగవంతం చేయడానికి ప్రోత్సహిస్తాయి. 2024లో మోటారు బీమాలో సంస్కరణలు సర్వే నివేదిక అందిన ఏడు రోజుల్లోపు క్లెయిమ్‌ల పరిష్కారాన్ని తప్పనిసరి చేయడంతో 24 గంటల్లోపు సర్వేయర్లను కేటాయించడం వంటివి ఉన్నాయి.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.